# జీవనం సత్యం
# జీవనం సుందరం

## అమృతసంతానం నవల పై ఆత్మీయస్పందన



# జీవనం సత్యం
# జీవనం సుందరం

అమృతసంతానం నవలపైన ఆత్మీయస్పందన

***JIVANAM SATYAM, JIVANAM SUMDARAM***

Readers response on the Odiya classic

**'AMRUTA SANTANAM '**

**Gopinatha Mohanty**

Translated by **Puripanda Appalaswamy** in to Telugu

Published by Sahitya Akademi, 1965

**Complete text of the novel can be accessed at:**

https://drive.google.com/file/d/0B3dreJny4z-0ZUN1OFNldkJoUGM/view?usp=sharing

Edited by

**Nyayapathi Srininvasa Rao**

**Vadrevu Ch Veerabhadrudu**

Cover photo:

Kondh mother with baby in Tola Kutianga village

Photo courtesy:

**Enric Solé**

(https://www.flickr.com/photos/paxorra/24106276782/)

Book layout

**Samanta Graphics, Hyderabad**

May, 2018

e-book released by **Sri Prachurana**

89, Navodaya Colony,

Mehidipatnam, Hyderabad. chinaveera@gmail.com

పురిపండా అప్పలస్వామిగారికి

# జీవనం సత్యం
# జీవనం సుందరం

## వరుసగా


**ముందుమాటలు**

న్యాయపతి శ్రీనివాసరావు

**ఆలస్యమైనా ఈ అమృతం అమృతమే 6**

వాడ్రేవు చినవీరభద్రుడు

**అమృతసంతానం మళ్లీమళ్లీ 19**

సూరపరాజు రాధాకృష్ణమూర్తి

**మరో సీతాచరిత 23**

న్యాపతి శ్రీనివాసరావు

**ఒక అమృతకథనం ముందొక చిన్ని అద్దం 40**

శ్రుతకీర్తి

**కళ్లకు కట్టిన సుఖదుఃఖాలు 50**

నరుకుర్తి శ్రీధర్

**ఏ పురాతన దుఃఖమో కమ్మేసింది 55**

సుశీలా నాగరాజ

**రుద్రరమణీయం 62**

నౌదూరి మూర్తి

**హృదయానందం రెణ్ణాళ్ల వేడుక 67**

పద్మజ సూరపరాజు

**తానూ, అడవీ రెండే శాశ్వతం 74**

జయతి లోహితాక్షన్

**ఆ ఆరాధకుల్లో నేనూ ఉన్నాను 78**

శిరంశెట్టి కాంతారావు

**వంచన నేర్వని అమృతసంతానం 88**

మానస చామర్తి

**వరప్రసాదంలా లభించింది 94**

**పరిచయాలు**

గోపీనాథ మొహాంతి .102

పురిపండా అప్పలస్వామి 103

వ్యాసరచయితల గురించి 104

## న్యాయపతి శ్రీనివాసరావు

# ఆలస్యమైనా ఈ అమృతం అమృతమే!

శ్రీ గోపీనాథ మహంతి అనే ఒడియా రచయిత రాసిన 'అమృతర సంతాన్' (1947) అనే ఒడియా గ్రంథానికి శ్రీ పురిపండా అప్పలస్వామి గారు చేసిన తెలుగు అనువాదం (1963) 'అమృత సంతానం'. శ్రీ మహంతి గారికి తమ రచనలకై జ్ఞానపీఠ పురస్కారం లభించింది. ఈ నవల అనువాదం ఇంగ్లీషులో కూడా లభ్యం. శ్రీ అనిల్ బత్తుల గారి ప్రయత్నం వలన ఈ తెలుగు అనువాదం సాఫ్ట్‌కాపీ (PDF) కూడా పాఠకులకు దొరుకుతున్నది. ఇది ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కొండల్లో జీవించే ఒక ఆదిమ తెగవారైన కోదుల జీవితం గురించి మహంతి గారు ఉద్యోగరీత్యా ఆ ప్రాంతాల్లో పనిచేశారు గనక తమకున్న అపరోక్షానుభవంతో రాసిన గొప్ప నవల.

ఈ నవల ఎంత గొప్పదో చెప్పడానికి ఒక్క మాట చాలు. మన వాడ్రేవు చినవీరభద్రుడు ఈ నవల ఎప్పుడో 1980ల్లో చదివి ఇటువంటి నవల నేనెక్కడా చదవలేదని ఇప్పటికీ అంటుండడమే, దీనిని వ్యాస మహాభారతం తరువాత అంతటి రచనగా, Tolstoy రాసిన War and Peace కన్నా ఉత్తమమైనదిగా పేర్కొనడమే.

ఇందులో ఫేస్‌బుక్‌లో ప్రకటితమైన సమీక్షలున్నాయి. ఇవి రాసినవారందరూ మంచి సాహిత్యాభిలాష ఉన్నవారే. నా వ్యాసమూ ఇందులో ఉంది గనక గానీ లేకుంటే ఈ వ్యాసకర్తల గురించీ ఇంకా చెప్పగలిగేవాడినే. ఉత్తమ సాహిత్య

లక్షణాలన్నీ ఈ నవలలో కనిపిస్తాయి. ఎత్తైన కొండలమధ్యా గెడ్డల ఒడ్డునా క్రూరమృగాల మధ్యా కోదుల జీవితం, వారి విశ్వాసాలూ ఆచారాలూ కోదు స్త్రీపురుషుల సంబంధాలూ అందులో పల్లపు మైదానాల వారు చాపకింద నీరులా ప్రవేశించడమూ, అన్నదమ్ముల మధ్య అధికారం నీడ పడటం మూలాన ఏర్పడ్డ అగాథాలూ, అమాయకులైన కోదులపై పల్లపు ప్రాంతాల షావుకార్లూ ప్రభుత్వాధికార్లూ చేసే మోసాలూ వగైరా.

దీనిపై సమీక్ష రాసినవారందరూ దీన్ని చదివి అచ్చెరువొందినవారే. జీవితమంత గొప్ప నవల ఇది కనుక దీనికి ఒకే సమీక్షావ్యాసం న్యాయం చెయ్యలేదు. చదివి అనుభవించి పలవరించాల్సిన ఈ ఉద్గ్రంథం నైకనదీనదాలు కలగలిసిన అంతస్సింధువు.

శ్రీ సూరపరాజుగారు తమ వ్యాసంలో కథలో కనిపించే ఎన్నో కోణాల్ని ఆవిష్కరిస్తూ చివరికి పుయులో సీతాదేవిని దర్శించారు. శ్రుతకీర్తిగారు తమ వ్యాసంలో కోదుల జీవనాన్నీ సంస్కృతినీ మన మనసులకు హత్తుకునేలా నవలని వడపోసి వివరించారు. నరుకుర్తి శ్రీధర్ గారు అమృత సంతానం నవల మార్క్వెజ్ రచన One Hundred Years of Solitude లాంటిదంటూ మానవ స్వభావం ఏ తెగవారిలోనైనా ఒక్కటే అని ఈ నవల ప్రతిపాదిస్తుందని చక్కగా వివరించారు.

సుశీలా నాగరాజ గారు తమ వ్యాసంలో కోదుల వనదేవతను మనకు సాక్షాత్కరింపజేశారు. నౌడూరి మూర్తి గారు మహంతి గారు ప్రతిపాదించిన వైయక్తిక సత్యం విశ్వజనీనమనీ అది తనకు ఎటువంటి పురాస్మృతులను కలిగించిందో వివరిస్తూ ఈ నవలను సరిగా తూచిచూపించారు. పద్మజ గారు ఈ నవలని పరామర్శిస్తూ కోదుకీ అతని అడవికీ అభేదం ఎత్తిచూపారు. ఇక అడవుల్నే నమ్ముకున్న జయతీ లోహితాక్షన్ గారు ఈ నవలని చదివి ముగ్ధులై కోదు జనజీవనస్రవంతిని అంత దగ్గరగా చూసి రాసిన మహంతి గారంటే తనకు కాస్త అసూయగా ఉందన్నారు. వీరు ఇలా అనడం ఈ నవలకి నిజంగా ఎంత మంచి యోగ్యతా పత్రం!

శిరంశెట్టి కాంతారావుగారు రాక్షసుల్ని వంచించి అమృతాన్ని తాగి అమరులైన దేవతలకన్నా ఆదిమ సమసమాజపు కోదులే అసలైన అమృతసంతాన

మంటూ నూతన భాష్యం చెప్పారు. మానస చామర్తి గారు ఇది కథలో పాత్రలు కాదని, పాత్రలతో కథ అంటూ సహేతుకంగా వివరిస్తూ ఈ వరప్రసాదాన్ని కళ్ళకద్దుకున్నారు. వాడ్రేవు చినవీరభద్రుడైతే చలం మహాప్రస్థానాన్ని అనుభవించి పలవరించినట్టే ఈ రచనని పలవరిస్తూ ఈ నవల గొప్పతనాన్నే కాక ఇంకా ఎన్నో సంగతులు ముచ్చటించాడు. ఈ అమృతకథనం ముందొక చిన్ని అద్దం తెచ్చిపట్టుకొని నేనూ మీ ముందు నిలబడ్డాను.

శ్రీ మహంతి గారు ఈ నవలని తన జీవనసహచరికే అంకితమిస్తే మేము ఈ వ్యాసావళిని అనువాదకులు శ్రీ పురిపండా గారికి అంకితమిస్తున్నాం.

## వాడ్రేవు చినవీరభద్రుడు

# అమృతసంతానం గురించి మళ్లీ మళ్లీ

**గో**పీనాథ మొహంతి (1914-1991) ఆధునిక ఒరియా సాహిత్యంలో, ముఖ్యంగా వచనసాహిత్యంలో ఫకీర్ మోహన సేనాపతి తర్వాత అంతటి ఖ్యాతి పొందాడు. 24 నవలలు, 12 కథాసంపుటాలతో పాటు కవిత్వం, నాటకం, వ్యాసం, జీవితచరిత్ర వంటి ప్రక్రియల్లో కూడా చెప్పుకోదగ్గ కృషి చేసాడు. గిరిజన భాషా, సంస్కృతుల మీద అయిదు సంపుటాలు వెలువరించాడు. టాల్‌స్టాయి నీ, గోర్కీని, టాగోర్ నీ ఒరియాలోకి అనువదించాడు. ఆయన రచనల్లో 'అమృత సంతానం' సాహిత్య అకాదెమీ పురస్కారాన్నీ, 'మటిమటాల' జ్ఞానపీఠ పురస్కారాన్నీ సముపార్జించేయి. గోర్కీ My Universities ని అనువదించినందుకు గాను, సోవియెట్ లాండ్ నెహ్రూ పురస్కారం లభించింది. భారత ప్రభుత్వం పద్మభూషణ సత్కారాన్ని అందించింది. తన చివరిరోజుల్లో ఒక అమెరికన్ విశ్వవిద్యాలయంలో సాంఘిక శాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తూ అక్కడే కాలం చేసారు.

మొహంతి సమకాలికులైన ఒరియా రచయితలు మేరుసమానులు చాలామంది ఉన్నారు. కాళిందీ చరణ పాణిగ్రాహి, మాయాధర మానసింహ, సచ్చిదానంద రౌత్రాయ్, సురేంద్ర మొహాంతి లతో పాటు మొహంతి సోదరుడు కానూ చరణ మొహంతి కూడా ఉన్నారు. ఒకప్పుడు మా శాఖకి కార్యదర్శిగా

పనిచేసిన చిత్తరంజన బిశ్వాల్ గారితో నేను మొహంతి గురించి మాట్లాడినప్పుడు, ఆయన గోపీనాథ మొహంతి కన్నా కానూ చరణ్ గొప్ప రచయిత అన్నారు.

కాని గోపీనాథ మొహంతిని సమకాలిక ఒరియా రచయితల్లోనే కాక, ఆధునిక భారతీయ రచయితలందరికన్నా ప్రత్యేకంగానూ, మిన్నగానూ నిలబెట్టేది గిరిజనుల గురించి ఆయన సృష్టించిన సాహిత్యం.

ఆయన 1938 లో ఒరిస్సా రాష్ట్ర పాలనా సర్వీసులో చేరిన తర్వాత చాలాకాలం పాటు అవిభక్త కోరాపుట్ జిల్లాలో వివిధ స్థాయిల్లో పనిచేసారు. గిరిజనులు అత్యధికంగా నివసించే ఆ ప్రాంతాల్లో పనిచేసినందువల్ల ఆయనకి వారిని చాలా దగ్గరనుంచి చూసే అవకాశం లభించింది. కోదులు, పోరజాలు, గదబలు, డొంబులు మొదలైన గిరిజన తెగల గురించి ఆయన ప్రత్యక్షంగా చేసిన 'దాదీ బూఢా' (1944), 'పరజ' (1945), 'అమృతర సంతాన్' (1947) లతో పాటు 'అపహంచ' (1961) అనే మరొక నవల కూడా రాసారు. అందులో 'అమృతర సంతాన్ 'ని సాహిత్య అకాదెమీ కోసం పురిపండా అప్పలస్వామిగారు అద్భుతంగా తెలుగు చేసారు. అద్దేపల్లి అండ్ కో, రాజమండ్రి వారు ప్రచురించిన ఆ పుస్తకం ఇప్పుడు లభ్యం కావడం లేదు. అందులో ఆయన కోరాపుట్ అడవుల్లోని కోదు తెగ జీవితాన్ని చిత్రించారు.

కోదులు (ఇంగ్లీషులో khonds, ఒడియాలో కంధా) భారతదేశంలోని అత్యంత ప్రాచీన మానవసమూహాల్లో ఒకరు. వారు ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన 'కుయి' అనే భాష మాట్లాడతారు. ఒకప్పుడు, ఆ తెగలో, 'మెరియా' అనే పేరిట నరమేధక్రతువు కూడా జరుగుతుండేది. బెంగాల్లో సతిని రూపు మాపడానికి పూనుకున్నట్టే, ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ ప్రభుత్వమూ ఆ ఆచారాన్ని నిర్మూలించడానికి ఒక శతాబ్దం పాటు చాలా ప్రయత్నాలు చేసాయి. అందులో భాగంగా, బయటి ప్రపంచానికి ఆ తెగ పట్ల అపోహలూ, అపార్థాలూ ఏర్పడటానికి కూడా కారణమయ్యాయి. ఆ నేపథ్యంలో ఆ జాతి జీవితం ఒక ఉత్సవంలాంటిదని చెప్పడం కోసం మొహంతి ఆ మహేతిహాసం రాసాడు.

నా దృష్టిలో, ఆ నవల War and Peace కన్నా గొప్పది, బహుశా, భారతీయ సాహిత్యంలో, మహాభారతం తరువాత, ఆ రచనకే నేను పట్టం కడతాను. ఈ

మాట రాస్తున్నప్పుడు శరత్, బిభూతి భూషణ్ బందోపాధ్యాయ, తారాశంకర్ బందోపాధ్యాయ, ప్రేమ్‌చంద్, తకళి శివశంకర పిళ్ళై, శివరామకారంత, ఖాండేకర్ వంటి పూర్వపు మహారచయితలు మొదలుకుని భైరప్ప, విక్రమసేథ్ వంటి నేటికాలపు రచయితలెంతమందో నా మనస్సులో మెదుల్తున్నారు. అయినా కూడా నేను అమృతసంతానాన్నే ఎంపిక చేస్తాను.

ఎందుకంటే ఈ మహారచయితలంతా నాగరిక, గ్రామీణ సమాజాల గురించి రాసారు. అమృతసంతానంలో గొప్పదనం ఎక్కడుందంటే, ఆయన దాన్ని బయటివాడు గిరిజనుల గురించి రాసినట్టుగాకాక, గిరిజనుడి ప్రాపంచిక దృక్పథంతో మమేకమై రాసాడు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న దోపిడీ గురించీ, పీడన గురించీ రాసినవాళ్ళు లేకపోలేదు. ఆ విషయంలో మహాశ్వేతాదేవిని మించిన వాళ్ళు లేరు. కాని మొహంతి అక్కడితో ఆగిపోలేదు. ఆయన 'జీవనం సత్యం' అని మాత్రమే కాక,'జీవనం సుందరం' అని కూడా అనగలిగాడు. అది భారతీయ మహేతిహాసాలైన రామాయణ,మహాభారతాల సాహిత్య వారసత్వం. దుఃఖాన్ని చూసి, చిత్రించి, అక్కడితో ఆగకుండా, అధీరుడు కాకుండా, ఏ సత్త్వం ఇన్ని మహాయుగాలపాటు ఆదివాసుల్ని బతికిస్తూ వచ్చిందో,ఎన్ని ప్రతికూల పరిస్థితుల్ని దాటి మనుగడ సాగనిస్తున్నదో, ఆ జీవశక్తిని ఆయన దర్శించాడు, అద్భుతమైన ఐతిహాసిక శైలిలో చిత్రించాడు.

15-7-2016

## 2

సాహిత్య అకాడెమీ ఆఫీసుకి వెళ్ళినప్పుడు అక్కడ పుస్తక విక్రయ కేంద్రంలో అడుగుపెట్టగానే చప్పున నా దృష్టిని ఆకర్షించింది 'అమృతర్ సంతాన్'. గోపీనాథ మొహంతి ఒడియా నవలకి ఇంగ్లీషు అనువాదం.

ఇటువంటి అనువాదం ఒకటి వచ్చిందని ఆదిత్య కొన్నాళ్ళకింద నాతో అన్నాడని గుర్తొచ్చింది. కాని ఆ పుస్తకం అక్కడ చూడగానే చెప్పలేనంత సంతోషం కలిగింది. ప్రపంచస్థాయి రచన. ప్రపంచమంతా చదివి తీరవలసిన రచన. 1947

లో రాసిన ఈ పుస్తకం ఏడు దశాబ్దాల తరవాతైనా ఇంగ్లీషులోకి రావడం నిజంగా ఒక సంబరమే అనిపించింది.

1982 లోనో, 83 లోనో మొదటిసారి నేను అమృతసంతానం తెలుగు అనువాదం చదివాను. పురిపండా అప్పలస్వామిగారి తెలుగుసేత. రాజమండ్రిలో సరస్వతీ పవర్ ప్రెస్ అని ఉండేది. అక్కడ ముద్రించారు. 1965 నాటి ముద్రణ అనుకుంటాను. ఆ పుస్తకం చదివినప్పణ్ణుంచీ ఆ ప్రభావం నుంచి ఇప్పటికీ బయటపడలేకపోయాను.

అది ఒరిస్సాలో కోరాపుట్ జిల్లా పర్వతాల్లో, అరణ్యాల్లో జీవిస్తున్న కోదులనే ఒక గిరిజన తెగ తాలూకు జీవితచిత్రణ. మహేతిహాసం. నాకు తెలిసి ప్రపంచ సాహిత్యంలోనే అట్లాంటి రచన లేదు. నేను పుట్టినవూరు కూడా గిరిజన గ్రామమే. ఆ గ్రామం కొండరెడ్ల గ్రామమైనప్పటికీ, ఒక గిరిజనతెగగా, వాళ్ళకీ, కోదులకీ మధ్య ఎన్నో సారూప్యాలు కనబడినందువల్లా, ఆ నవలలో చిత్రించిన లాండ్ స్కేప్, ఆ మనుషులు, ఆ అడవులు, ఆ నాట్యాలు, ఆ పండగలు నాకు చిన్నప్పణ్ణుంచీ తెలిసినవి అయినందువల్లా, నేను ఆ రచనతో తక్షణమే ఐడెంటిఫై కాగలిగాను. అంతేకాదు, నేను అప్పటిదాకా పెరిగిన ఆ గిరిజన జీవితం మూల స్వభావాన్ని, సారాంశాన్ని, ఆ ప్రాపంచిక జీవితాన్నిఆ నవలద్వారా ఎంతోకొంత అర్థం చేసుకోగలిగాను.

ఆ తర్వాత నేను గిరిజన సంక్షేమ శాఖలో చేరినప్పుడు, నా ట్రైనింగులో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఒక మారుమూల గ్రామమైన గొయిపాక అనే ఊళ్ళో రెండువారాలు గడపవలసి వచ్చింది. ఆ ఊరు కొండల్లో, అడవుల మధ్య ఉండే ఒక కోదుపల్లె. ఆ ఊరిని ఆనుకుని ఒరిస్సా రాష్ట్రంలో, కోరాపుట్ జిల్లా గిరిజన గ్రామాలు. అదంతా దండకారణ్యం. ఆ కోదులు అమృతసంతానంలో చిత్రించిన కోదులే. నేనప్పటికి అయిదేళ్ళ కింద చదివిన ఆ నవల్లోని జీవితం మధ్యనే అట్లా భౌతికంగా కూడా గడపగలనని ఎన్నడూ ఊహించిఉండలేదు. కాని, ఆ రెండువారాల ఆ సామీప్యత, ఆ కోదుపల్లె, ఆ పక్కనే డొంబు పల్లె, ఆ కొండచరియలు, ఆ పిల్లంగోవి పాటలు, ఆ కుయి భాష, ఆ సాలవృక్షాలు, ఆ సీతాకోకచిలుకలు నన్ను పూర్తిగా లోబరుచుకున్నాయి.

గిరిజనుల గురించి ఒక కథ లేదా నవల రాస్తే అమృతసంతానం లాగా రాయాలనే నమ్మకం స్థిరపడిపోయింది. (అందుకనే ఇప్పటిదాకా ఒక చిన్న కథ కూడా వాళ్ళ గురించి రాయలేకపోయాను.)

అమృతసంతానంలో కథ చాలా సరళం. మిణి అపాయు అనే ఒక కోదుపల్లెకి సరుబు సావొతా అనే పెద్ద ఉండేవాడు. పూర్తిగా పండి పూర్ణజీవితం జీవించాక అతడు మరణిస్తాడు. అతడి కొడుకు దివుడు సావొతా గ్రామపెద్ద అవుతాడు. కుయి భాషలో దివుడు అంటే సీతాకోక చిలుక. అతడి భార్య పుయి (పువ్వు). కొన్నాళ్ళకు కింద పల్లపు ప్రాంతాలకు చెందిన ఒక తెలుగమ్మాయి పియొటి (పిట్ట) ఆ ఊళ్ళో అడుగుపెడుతుంది. దివుడు ఆమె ఆకర్షణలో పడతాడు. అదంతా ఒక రూపకాలంకారం. సనాతన గిరిజన సంస్కృతి పల్లపు నాగరికత వ్యామోహంలో పడిన కథ, ఆ నలుగులాట అదంతా రచయిత గొప్ప కవితాత్మకంగా చెప్పుకొస్తాడు. ఈ మధ్యలో పుయు గర్భం దాలుస్తుంది. ప్రసవిస్తుంది. ఆ చిన్నబిడ్డడిద్వారా మళ్ళా కోదుసంతతి కొనసాగుతుంది. కాని ఆ తల్లీ బిడ్డలముందు గొప్ప అనిశ్చితత పరుచుకుని ఉంటుంది. చివరికి పుయు తన భర్తని వదిలిపెట్టి తన చిన్నబిడ్డడితో విశాలమైన ఆ పర్వతభూమిలో తన కాళ్ళమీద తను నిలబడడానికి ముందడుగువేస్తుంది.

సుమారు వెయ్యి పేజీల ఆ నవలలో మహేతిహాసాల శిల్పముంది. ఇతిహాసాల్లో చిత్రించినట్టే అందులోనూ మరణం, పుట్టుక, పెళ్ళి, కలయిక, వియోగం, యుద్ధం, శాంతి అన్నీ ఉన్నాయి. రామాయణ, మహాభారతాల వారసుడు మాత్రమే రాయగల రచన అది. మరొకవైపు టాల్‌స్టాయి తరహా మహాకుడ్య చిత్రణ. (మొహంతి టాల్ స్టాయి వార్ అండ్ పీస్ ని ఒడియాలోకి అనువదించాడు కూడా).

ఇప్పుడు ఈ నవల ఇంగ్లీషు లో ప్రపంచం ముందుకొస్తున్నది. ఆ అనువాదం ఎట్లా ఉందో చూదామని అక్కడే ఆతృతగా కొన్ని పేజీలు తిరగేసాను. నిజమే, ఆ అనువాదాన్ని అప్పలస్వామిగారి తెలుగు అనువాదంతో పోల్చలేం. ఆదిత్య అన్నట్టు, ఆ అనువాదానికే అప్పలస్వామిగారికి జ్ఞానపీఠ పురస్కారం ఇవ్వొచ్చు. కాని, ఆ తెలుగు అనువాదాన్ని మర్చిపోయి చూసినప్పుడు, ఈ ఇంగ్లీషు అనువాదకులు ప్రశస్తనీయమైన కృషి చేసారని ఒప్పుకోక తప్పదు.

అనువాదంలో ఎదురయ్యే సమస్య గురించి, ముందుమాటలో ప్రభాత నళినీ దాస్ చెప్పినట్టు, అది కావడానికి ఒడియానుంచి ఇంగ్లీషులోకి అనువాదమే అయినా, సాంస్కృతికంగా, ఒక గిరిజన సంస్కృతినుంచి ముందు ఒడియాలోకి అనువాదమై, ఇప్పుడు ఇంగ్లీషులోకి అనువాదమవుతున్న రచన. ఆ గిరిజన జీవితం, ఆ సారళ్యం, ఆ సంక్లిష్టతలు ఒడియా సమాజానికే కొత్త. ఆ ప్రాపంచిక దృక్పథాన్ని మైదాన ప్రాంత ఒడియా సమాజానికి అర్థమయ్యేలా చెప్పడానికే మొహంతి ఎంతో కష్టపడ్డాడు. ఇప్పుడు ఆ జీవితం గురించి సూచనప్రాయంగా కూడా తెలియని విస్తృత ప్రపంచానికి దాన్ని పరిచయం చెయ్యడం మరింత సవాలుతో కూడుకున్న పని.

కాని గొప్ప సాహిత్యం చేసేది అదే. నీకెంత మాత్రం తెలియని ప్రపంచాన్ని నీకెంతో సన్నిహితంచెయ్యగలదు. మనకి నైజీరియాలో ఉండే ఇబొ తెగ గురించి ఏమి తెలుసు? కాని చినువా అచెబె Things Fall Apart చదువుతున్నంతసేపూ నాకు మా ఊళ్ళూ, మా కొండలూ, మా అడవులే కళ్ళముందు కనిపిస్తూ ఉన్నాయి. ఇప్పుడు ఈ ఇంగ్లీషు అనువాదం చదివే ఆఫ్రికా జాతుల పాఠకులు, పసిఫిక్ సముద్ర దీవుల్లోని పాఠకులు, ఎస్కిమోలు, రెడ్ ఇండియన్లు కూడా తమలాంటి ఒక తెగ భారతదేశంలో జీవిస్తూ ఉన్నారని, తామంతా కూడా ఒకే మహా అమృతసంతానమనీ గుర్తుపడతారని తలుచుకుంటేనే నాకు ఒళ్ళు పులకరిస్తూ ఉంది.

ఈ నవలకు ఫెలిక్స్ పడెల్ అనే ఒక యాంత్రొపాలజిస్టు ముందు మాట రాసాడు. రెండున్నరపేజీల ఆ ముందుమాట ఈ నవల సమకాలీన ప్రాసంగితకతను గొప్పగా పట్టుకుంది. ఇప్పుడు గిరిజనప్రాంతాల్ని బాక్సైటు గనులుగా మాత్రమే చూస్తున్న రాజకీయ-కార్పొరేట్ ప్రాపంచిక దృక్పథాన్నీ, కొండల్ని దేవతలుగా చూస్తున్న ఒక ప్రాచీన ప్రాపంచిక దృక్పథాన్నీ ఆ యాంత్రొపాలజిస్టు తన ముందుమాటలో ఎదురెదురుగా పెట్టి చూపించాడు. ముఖ్యంగా నియమగిరి కొండల్లో వేదాంత మైనింగ్ కంపెనికీ, దోంగ్రియా కోదులకీ మధ్య జరిగిన పోరాటంలో సుప్రీం కోర్టు కోదుదేవతలకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో 'అమృతసంతానం' అత్యంత శక్తివంతమైన ఒక రాజకీయనవలగా కూడా కొత్త

జన్మ ఎత్తగలదని నాకు స్ఫురించింది. ఆ స్ఫురణ గొప్ప ఆశ్చర్యానుభూతిని కలిగించింది.

ఆ తెలుగు అనువాదం లభ్యంగా లేదు కాబట్టి, ఇన్నాళ్ళూ నేను అమృత సంతానం గురించి మిమ్మల్ని ఎక్కువ ఊరించలేకపోయాను. కాని ఇప్పుడు ఇంగ్లీషులో ఆ పుస్తకం లభ్యంగా ఉంది. మీదే ఆలస్యం.

29-4-2017

# 3

**అ**మృతసంతానం నవల ఒడియాలో చదవబోతున్నానంటూ వాసు నాకు మెసేజి పంపించాడు. అదృష్టవంతుడు. ముప్పై ఏళ్ళుగా నేనీ నవల గురించి తెలుగువాళ్ళకి చెప్తూ ఉన్నాను. కొందరు చదివారు, కొందరు చదవలేదు. కానీ, సూరపరాజు రాధాకృష్ణమూర్తిగారు తాను మార్క్వెజ్ నీ, అచెబీ నీ చదివాను గాని, మొహంతిని చదవలేకపోయానని చెప్తే, ఆదిత్య దగ్గరున్న ఒకే ఒక్క కాపీ ఆయనకు పంపించాను. (పూర్వకాలపు గిరిజనుల్లాగా నా దగ్గరున్న ఇంగ్లీషు అనువాదం ఆదిత్యతో barter చేసి.) రాధాకృష్ణమూర్తిగారు ఎప్పుడూ గిరిజన ప్రాంతాల్లో నివసించి ఉండలేదనే అనుకుంటాను. ఆయనకి కోదులకీ, సవరలకీ, కొండదొరలకీ మధ్య తేడా తెలిసే అవకాశమే లేదనుకుంటాను. కాని, ఆయన ప్రాచీన భారతీయ సాహిత్యం, వేదాంతం క్షుణ్ణంగా చదువుకున్న పండితుడు. ఉద్యోగరీత్యా ఇంగ్లీషు సాహిత్యం బోధించారు కాబట్టి, మోడర్న్ కవులనీ, న్యూ క్రిటిక్స్ నీ జీర్ణించుకున్న భావుకుడు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాల దర్శనాల తులనాత్మకతలో శేషేంద్ర, సుదర్శనం, మందేశ్వరరావు గారల తరువాత నేను చూసిన పొడగరి ఈయనే. కాబట్టి ఆయన అమృతసంతానాన్ని ఒక రసజ్ఞుడెట్లా చదవాలో అట్లా చదవడంలో ఆశ్చర్యమేముంది!

కాని నన్ను ఆశ్చర్యపరిచిందేమంటే, 82 ఏళ్ళ వయసులో ఆయన కంప్యూటర్ మీద తెలుగు టైపు చేసి వరసగా మూడు వ్యాసాలు రాసారు (ఇంకా నడి యాభైల్లో ఉన్న చాలా మంది రచయితలు తమకి ఎస్ ఎం ఎస్ చూసుకోవడం

తెలీదని చెప్పేవాళ్ళని చూసాను, అరవయిల్లో ఉన్న కొందరు గొప్ప కవులు కూడా తమకి ఇంటర్నెట్ ఓపెన్ చెయ్యడం తెలీదనే వాళ్ళని చూసాను. పాతికేళ్ళ వయసులో ఉండి, గూగుల్ ఇన్ పుట్ టూల్స్ నో, ఇ-పలకనో వాడి తెలుగు టైపు చెయ్యకుండా తెలుగును రోమన్ స్క్రిప్ట్ లో టైపు చేసేవాళ్ళ సంఖ్యకి అంతులేదు. కాని రాధాకృష్ణమూర్తిగారు 77 ఏళ్ళ వయసులో తన మనవణ్ణి చూసి కంప్యూటర్ నేర్చుకున్నారట!). ఆ మూడు వ్యాసాలూ ఇక్కడ పొందుపరుస్తున్నాం. ఒక సాహిత్యకృతిని ఎలా చదవాలో రాధాకృష్ణమూర్తిగారి వ్యాసం ఒక పాఠంగా ఉపకరిస్తుందనుకుంటున్నాను.

తెలుగులో గొప్ప కథారచయితలు నవలలు కూడా రాస్తున్నవాళ్ళున్నారు. కానీ వాళ్ళనుంచి నేను పరవశించగల నవల ఇంకా రావలసే ఉంది. రాధాకృష్ణమూర్తి గారి వ్యాసం చదివితే వాళ్ళకి నవలా రహస్యం కొంతైనా బోధపడుతుంది. దానర్థం వాళ్ళు గిరిజన జీవితం గురించి రాయాలని కాదు, మానవ జీవితం గురించే, తమకు తెలిసిన పరిమిత జీవితం గురించే రాయమంటున్నాను, కాని ఎట్లా రాయాలో, ఆ సూచనలు ఇక్కడ దొరుకు తున్నాయి, చూడండి.

6-6-2017

## 4

**ఒ**క పుస్తకానికి కూడా ఒక cult group ఏర్పడవచ్చా? అవుననే అనిపిస్తోంది, నిన్న వాసు పంపిన రచన చూస్తే.

సూరపరాజు రాధాకృష్ణమూర్తిగారు 'అమృత సంతానం' మీద రాసిన వ్యాసం చదివి, వాసు బెంగుళూరునుంచి వచ్చి మరీ ఆ పుస్తకం నా దగ్గర్నుంచి తీసుకెళ్ళాడు. ఆ పుస్తకం తెరిచినప్పటినుంచీ దాదాపు ప్రతి రోజూ ఫోన్ చేస్తూనే ఉన్నాడు. పుస్తకం ముగించేటప్పటికి అతడి కంఠంలో జ్వరం.

నేనూహించగలను, ఇప్పటికీ పార్వతీపురం అడవుల్ని తలుచుకోగానే నాకే మనసు మెలిపడిపోతూ ఉంటుంది, అట్లాంటిది, గుణుపురంలో పుట్టిపెరిగినవాడికి

ఆ కొండలూ, అ అడవులూ, ఆ జోలాలూ, ఆ ఘాటీలూ ఎలా అనిపిస్తాయో.

ఈ నెలాఖరుకి నేను గిరిజన సంక్షేమ శాఖలో చేరి ముప్పై ఏళ్ళయ్యింది. 1987 లో పార్వతీపురం అడవుల్లో తిరుగుతున్నప్పుడు, అక్కడ అప్పటికి ఇరవయ్యేళ్ళకిందటి నెత్తుటి మరకలు అడుగడుగునా కనిపించేవి. 1967 నాటి నక్సల్ బరీ, ఆ ప్రతిధ్వనిగా శ్రీకాకుళంలో తలెత్తిన గిరిజన పోరాటమూ.

నక్సల్ బరి లో సంతాల్ లు ఆయుధాలు పైకెత్తి యాభై ఏళ్ళయ్యింది. ఈ యాభై ఏళ్ళ నక్సల్ బరీ పోరాట ప్రయాణాన్ని రెండు మూడు రోజులకిందట అట్టాడ అప్పలనాయుడు ఎంతో శ్రద్ధతోనూ, సమగ్రంగానూ సమీక్షించేడు. భారతదేశంలో జాతీయోద్యమం తర్వాత అంత ముఖ్యమైన ఉద్యమం నక్సల్బరీలో మొదలైన పోరాటమని రాసాడు.

అమృత సంతానం నవల నక్సల్ బరీ కన్నా ఇరవయ్యేళ్ళు ముందు వచ్చింది. 1947 లో. దేశ స్వాతంత్ర్యంలానే ఆ నవలకు కూడా ఇప్పుడు డెబ్భై ఏళ్ళు. ఆ నవల రాసేటప్పటికి భారత రాజ్యాంగమింకా పుట్టలేదు. గిరిజనుల గురించిన ప్రస్తావనలు టాగోర్ నుంచి దువ్వూరిరామిరెడ్డిదాకా చాలామంది సాహిత్యంలో చేస్తూ ఉండవచ్చుగాని, పూర్తిస్థాయి నవల ఏదీ అప్పటికింకా వెలువడలేదు. ఆ నవల చదివినవాళ్ళకి ఎవరికైనా, గిరిజనులకి ఏదో ఒకటి చెయ్యకపోతే, స్వతంత్రభారతదేశానికి మంచిది కాదనే భావన కలిగి తీరుతుంది. ఇప్పుడు వెనక్కి తిరిగిచూసుకుంటే, రాజ్యాంగ నిర్మాతలు, 1935 భారతప్రభుత్వ చట్టాన్ని అధ్యయనం చేసినంతగా, యథార్థ భారతదేశాన్ని అధ్యయనం చెయ్యలేదేమో అనిపిస్తుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన అయిదవ షెడ్యూలు శక్తిమంతమైనదే. కాని, ఆ షెడ్యూలు ఒక నక్సల్ బరీ ని ఆపలేకపోయిందన్నది కూడా కాదనలేని సత్యం. అటువంటిదేదో జరగబోతోంది చూడమనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడే 'అమృతసంతానం' హెచ్చరించింది.

చదవండి, వాసు రాసిన సమీక్ష చదవండి. ఇప్పుడు కూడా అదే గిరిజనులు. కానీ ఇప్పటి దోపిడీ అప్పట్లాగా అంత స్థూలరూపంలో లేదు. ఎంతో సూక్ష్మతనీ, సంక్లిష్టతనీ సంతరించుకుంది. ఇప్పుడూ అణచివేత ఉంది, ఇప్పుడూ దాన్నేదో ఒక రూపంలో గిరిజనులు ప్రతిఘటిస్తూనే ఉన్నారు. ఇప్పుడు లేనిదల్లా, కాలం

కన్నా ముందునడిచే గోపీనాథ మొహంతి వంటి రచయిత మాత్రమే.

నా మిత్రులు, ఇద్దరు తెలుగువాళ్ళు, ఈ నవల గురించి ఎంత బాగా రాసారంటే, మరొక ఒడియా రచయిత, జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త, సీతాకాంత్ మహాపాత్ర అమృతసంతానం గురించి రాసింది, వీరి సమీక్షల ముందు, నా కంటికి ఆనడం లేదు. అందుకని, గోపీనాథ మొహంతి వెబ్ సైట్ (gopinathmohanty.in) నడుపుతున్న ఓంకార నాథ్ మొహంతి అనే ఆయనకి ఈ రెండు వ్యాసాలూ పంపించాను, తమ సైట్లో వీటిని కూడా పొందుపరచేలా చూడమని.

30-6-2017

# 5

**అ**మృత సంతానం ఆరాధకుల్లో మరొక రసజ్ఞుడు వచ్చి చేరాడు. కవిత్వ రసవాది నౌదూరి మూర్తి గారు అమృతసంతానం చదువుతున్నారనీ, ఆయన ఒక విశ్లేషణ రాయబోతున్నారనీ వాసు నన్ను కొన్నాళ్ళుగా ఊరిస్తో ఉన్నాడు. రాత్రి ఆ వ్యాసం చదువుతోంటే, ఈ వాక్యాలకు వచ్చేటప్పటికి నా హృదయం కొట్టుకోడం ఆగిపోయింది:

> 'హృదయానందం రెణ్ణాళ్ళ వేడుక. ఇవాళ కట్టి రేపు కూలదోసే కట్టడం. మట్టిలోని అంజనాన్ని దేహానికి పులుముకుని పనిచేస్తున్నారు మనుషులు'.
>
> 'అక్కడ పని శబ్దం వినిపిస్తోంది'.

ఈ ఏడాదే ఇప్పటిదాకా శ్రీయుతులు సూరపరాజు రాధాకృష్ణమూర్తి, న్యాపతి శ్రీనివాసరావు, నరుకుర్తి శ్రీధర్, శ్రుతకీర్తి, జయతి లోహితాక్షన్, సుశీలా నాగరాజ ఈ పుస్తకపఠనానందాన్ని తమతో పంచుకున్నారు. అనిల్ బత్తుల వల్ల ఆ పుస్తకం ఎలక్ట్రానిక్ ప్రతి ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. రానున్న రోజుల్లో మరింతమంది రసజ్ఞపాఠకులు ఆ పుస్తకం చదవాలని నా కోరిక. చదివినవాళ్ళ

తమ అభిప్రాయాలు రాస్తే, వీటన్నిటినీ ఒక పుస్తకంగా తేవచ్చుని నా ఆలోచన.

ఇంతకీ అమృత సంతానం ఎందుకు చదవాలి? గిరిజనుల జీవితాల గురించి తెలుసుకోడానికా? అదొక ముఖ్య ప్రయోజనమే కాని, అదొక్కటే ప్రయోజనం కాదు.

ముఖ్యంగా మానవజీవితోత్సవం గురించిన ఇతిహాసం అది.

నవల ఇతిహాసం తాలూకు ఆధునిక రూపం అంటారు విమర్శకులు. కాని తెలుగువాళ్ళకి నవల రాయడమే రాదంటాన్నేను. ఎందుకంటే, తెలుగు వాళ్ళకి నవలలని కథలుగా చదవడమే తప్ప ఇతిహాసాలుగా చదవడం రాదు.

అవును. నేనీ మాట కొంత దుందుడుకు గా మాట్లాడుతున్నట్టు అనిపించవచ్చు. కాని ఆవేదనతో రాస్తున్నానని గమనించండి. నవలా నిర్మాణం వేరు, కథా నిర్మాణం వేరు. ఈ మధ్య కొన్ని నవలలు, ప్రసిద్ధులు రాసిన నవలలే చదవవలసి వచ్చింది. ఈ పదేళ్ళలో వచ్చిన నవలలు. వాటిలో వస్తువు, శైలి, పాత్రలు–వాటన్నింటినీ అట్లా ఉంచి, వాళ్ళందరిలోనూ కనిపించిన ఒక సామాన్యగుణమేమిటంటే, వాళ్ళు నవల అంటే పొడవైన కథ అనుకుంటున్నారు. Epic proportions లో నవలరాయడమంటే ఒకరి కథనే అయిదారువందల పేజీలు రాయడంగా భావిస్తున్నారు. కాని, అది నవల ముఖ్యప్రయోజనాన్ని భంగపరిచే అంశం.

నవలలో కనీసం రెండు నెరేటివ్ లు ఉండాలి. అందులో ప్రధానమైన నెరేటివ్ కి విభిన్నమైన, విరుద్ధమైన గతిలో రెండో నెరేటివ్ సాగాలి. అప్పుడు మటుకే ఆ మొదటి నెరేటివ్ ను మనం అంచనా వెయ్యగలుగుతాం. కథ అలాకాదు, అది కేవలం single narrative మాత్రమే కాదు, single episodic కూడా.

అమృత సంతానం నవల్లో దివుడు సావొతా నెరేటివ్ కి సమాంతరంగా అతడి పినతండ్రి లెంజుకోదు నెరేటివ్ నడుస్తుంది. ఇద్దరికీ శరీరాలు చల్లారని తృష్ణ ప్రధాన లక్షణం. కాని అధికారం, యవ్వనం ఉన్న శరీరం దివుడిదైతే, అధికారంలేని,వృద్ధాప్యపు గడపలో ఉన్న శరీరం లెంజుకోదిది. లెంజుకోదుని

మనం అర్థం చేసుకోగలం, జాలిపడగలం, అతడితో కలిసి ప్రయాణించగలం. కానీ దివుడు ప్రయాణాన్ని మనం అతడి భార్య పుయిలానే నిరసిస్తాం, ఆగ్రహిస్తాం, దుఃఖిస్తాం– అన్నిటికన్నా ముఖ్యం, మనం కూడా అలా ఉంటున్నామా అని ఆలోచించుకుంటాం. ఉండకూడదు కదా అని మనకు మనం (ఎవరికీ వినబడకుండా) చెప్పుకుంటాం. లెంజుకోదు ప్రయాణం మనలో pityని రేకెత్తిస్తుంది, దివుడి మోహోన్మాదం మనలో fear ని రేకెత్తిస్తుంది. వెరసి, ఒక జీవితనాటకాన్ని సంపూర్ణంగా చూసిన అనుభూతి కలుగుతుంది.

మహాభారతం లాంటి మహేతిహాసంలో ఈ నెరేటివ్‌లు వందలాది ఉంటాయి. అవి ఊరికే చెప్పుకుంటూ పోయిన కథలు కాదు. అందులో ప్రతి నెరేటివ్ కి మహాభారత ప్రధానకథతో సంబంధం ఉంటుంది. కొన్ని mirror narratives. వనపర్వంలో వచ్చే 'జంతు' అనే వాడి కథ మహాభారతకథ తాలూకు సూక్ష్మలిపి. వనపర్వంలోనే తనను చూడవచ్చిన మునులతో తనలాగా కష్టాలు పడ్డవాళ్ళెవరేనా ఉన్నారా అని యుధిష్టిరుడు అడిగినప్పుడు అతడికి చెప్పిన నలుడి కథలో ఎంత కావ్యవ్యంగ్యం ఉందో మా మాష్టారు గొప్ప వ్యాసమే రాసారు. క్లుప్తంగా చెప్పాలంటే, అజ్ఞాతవాసంలో యుధిష్ఠిరుడు విరాటరాజుకి జూదంలో సహచరుడిగా, భీముడు వంటవాడిగా, అర్జునుడు బృహన్నలగా, నకులసహదేవులు పశుపాలకులుగా జీవించవలసి వస్తుంది. అయిదుగురు అన్నదమ్ములూ అయిదురకాలుగా అనుభవించిన న్యూనతను నలుడొక్కడే అనుభవిస్తాడు, జూదసహచరుడిగా, వంటవాడిగా, వికృతరూపిగా, రథాలు తోలేవాడిగా. మహాభారతంలో వచ్చే ప్రతి ఒక్క కథనీ, ప్రధానకథతో పోల్చి చూడవచ్చు. అలా చూడటానికే ఆ కథలన్నీ. అప్పుడే దాన్ని ఇతిహాసమంటాం.

ఆధునిక నవలలో కూడా ఈ రహస్యం తెలిసినవాళ్ళు మహారచయితలు కాగలిగేరు. 'అనాకెరినినా' నవల చూడండి. అది అన్నా కెరినినా కథలాగా ఉంటుంది. కాని కాదు. నవల మొదలుపెడుతూనే రచయిత 'అబ్లాంస్కీల కాపురంలో అంతా గందరగోళమైపోయింది' అంటాడు. అది ఒక్క కరేనిన్ కుటుంబంలోనో లేదా అబ్లాంస్కీల వంశంలోనో మటుకే సంభవించిన సమస్య కాదు. మొత్తం పందొమ్మిదో శతాబ్ది రష్యా సమస్య అది. అందుకనే ఒక విమర్శకురాలు ఆ నవలని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ నవల్లో మొత్తం ఇరవై

కుటుంబాల కథలున్నాయని లెక్కగట్టింది. అందులో పన్నెండు కుటుంబాల కథలు రచయిత సవివరంగా చిత్రించేడనీ, చివరికి రెండు కుటుంబాలు మాత్రమే శాంతిగా ఉన్నట్టు ప్రతిపాదించేడనీ చెప్పింది. ఆ రెండు కుటుంబాల్ని అర్థం చేసుకుంటే టాల్ స్టాయి మనకి అర్థమవుతాడు.

గొప్ప నవలల్లో ఇతివృత్తం దానికదే ఒక మెటఫర్ గా మారిపోతుంది. 'కరమజోవ్ సోదరులు' నవలలో లాగా. అమృతసంతానం దివుడు పల్లపు పిల్ల పియోటి వెనక పడ్డ కథలాగా ఉంటుంది. కాని, అది గిరిజనసమాజం మైదానసంస్కృతి వ్యామోహంలో పడటం తాలూకు ఐతిహాసిక చిత్రణ అని అర్థమయితే, ఆ నవల కలిగించగల అంతర్దృష్టి అనుభవైకవేద్యంగా ఉంటుంది.

15-11-2017

## 6

**ఈ** వ్యాసాలు మొత్తం పదింటినీ ఇప్పుడిలా పుస్తకంగా సంకలనం చేసి చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇది తెలుగు నవల కాదు,ఈ ఇతివృత్తం గిరిజన ప్రాంతాలతో పరిచయం లేనివారికి చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో వ్యాసరచయితలు పదిమందిలోనూ ఇద్దరు మాత్రమే గిరిజన ప్రాంతాలు ఎట్లా ఉంటాయో తెలిసినవాళ్ళు. కాని, రచనను ఆనందించడానికీ, రచయిత హృదయాన్ని సమీపించడానికీ భాషగానీ, ఇతివృత్తంగానీ అడ్డుకాలేదు. గొప్ప సాహిత్యానికిదే కొండగుర్తు. డెబ్భై ఏళ్ళ తరువాత కూడా అమృత సంతానం ఒక నవలగా సజీవంగా ఉందనీ, సహృదయుల్ని సమ్మోహపరుస్తున్నదనీ ఈ వ్యాసాలు ఋజువు చేస్తున్నాయి.ఇంకా మరికొందరు ఈ నవలను చదివి తమ అభిప్రాయాలు పంచుకుంటారని నేనింకా ఎదురుచూస్తున్నాను. ముఖ్యంగా రచయితలు. తమ చుట్టూ ఉన్న మానవజీవితాన్ని, దాని సుఖదుఃఖాలతో పొదివిపట్టుకుని మహేతిహాసాలుగా చిత్రించాలనే తపన ఉన్న రచయితలు ఈ నవలను చదవాలనీ, ఈ స్ఫూర్తితో తెలుగు సామాజిక పరివర్తనని కుడ్యచిత్రాల్లాంటి నవలలుగా చిత్రిస్తారనీ నమ్ముతున్నాను. ఈ రచయితలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

15-5-2018

# జీవనం సత్యం
# జీవనం సుందరం

## అమృతసంతానం నవల పైన ఆత్మీయ స్పందన

## సూరపరాజు రాధాకృష్ణమూర్తి
## మరో సీతాచరిత

**ముం**దుగా నేరం ఒప్పుకొని మరీ మొదలుపెడతాను. ఇది 1947లో వచ్చిన నవల. తెలుగు అనువాదం వచ్చికూడా దాదాపు నలభైసంవత్సరాలవుతున్నది. ఇంతకాలం ఈనవల చదవకపోవడం తప్పకుండా నేరమే. అది నేరమయితే, యిప్పుడు దీనిని పరిచయంచేయబూనడం పరిహాసాస్పదం. 'నవ్విపోదురుగాక' అనుకుని నా అనుభవాన్ని పంచుకునే ప్రయత్నం చేస్తాను. (ఆ భావకవిని తలచుకోడానికి మరో కారణం కూడా ఉంది.)

'అమృతసంతానం' నేను యిప్పుడైనా చదవడానికి కారకులు వాడ్రేవు చినవీరభద్రుడు గారు. ఈ నవలకు ఇటీవల వచ్చిన (ఇన్నాళ్ళు రాకపోవడం నా నేరం కాదు.) ఆంగ్లానువాదం ఆయనకు అనుకోకుండా అగుపించినపుడు తను పొందిన ఆశ్చర్యానందాభివ్యక్తి నాచేత యీ నవల చదివించింది. నైజీరియా నవలలు, లాటిన్ అమెరికా నవలలు, ఆల్జీరియా రచయితలు తెలుసు, కాని పొరుగు రాష్ట్రంలో రచయితలను చదవలేదు అంటే ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. అందులో, గోపీనాథ్ మొహంతి వంటి రచయిత! భారతీయ భాషా సాహిత్యాలలో కాదు, ప్రపంచంలోని అగ్రశ్రేణి నవలారచయితలలో యితనితోపాటు నిలువగలిగినవారు చాలా తక్కువమంది. 'ప్రపంచస్థాయి రచన. ప్రపంచమంతా చదివితీరవలసిన రచన ... రామాయణభారతాల వారసుడుమాత్రమే రాయగలిగిన నవల': వీరభద్రుడుగారి యీ మాటలలో అణుమాత్రం అతిశయం లేదు.

కొండజాతి తెగలవారు యిందులోని ప్రధానపాత్రలు. ఒడియారాష్ట్రంలోని కోరాపుట్ లోని వారు జీవనం చేసే వేలఅడుగుల ఎత్తుకొండలు అక్కడి అడవులు యీకథకు కాన్వాస్. అలాగని, యిది ఆదివాసుల ప్రాంతాలగురించి, వారి ఆచారవ్యవహారాల గురించి తెలిపే యాత్రికుల హస్తపుస్తకం కాదు. ఈ అరవై ఏండ్లలో ఆ ప్రాంతాలు, ఆ ఆదివాసులు చాలా మారిపోయి ఉండవచ్చు. నవల విలువ మారదు. అంతే కాదు, కొండజాతులవారి జీవనవిధానం గురించికాని, వారి ఆర్థిక పరిస్థితుల అభివృద్ధి గురించికాని రచయిత అభిప్రాయాలకోసం కూడా చదవవలసిన నవల కాదు. 'వారి జీవనవిధానం, వారి ప్రత్యేకత భద్రపరచవలెనా? మన నాగరికతలో వారిని కరగదీయవలెనా?' ఇటువంటి ప్రశ్నలకు జవాబులకోసం చదవవలసిన పుస్తకం కాదు.

ఇది నవల కనుక చదవవలసిన నవల. ఈనవల గురించి ముందు, చివర చెప్పుకోవలసిన మాట, ఇది నవల, నవల మాత్రమే, నవలకానిదేదీ యిందులో లేదు. తత్త్వం, వేదాంతం, సామాజికస్పృహ, రాజకీయ చైతన్యం, వలసవచ్చిన దోపిడీ దౌర్జన్యం,యింకా ఏమైనా ఉంటే అన్నిటిని కరిగించి కళగా మార్చుకున్న నవల.

'అమృతసంతానం' లోని ప్రకృతి ,అందమైన అడవులు ఆకాశమంటుకునే కొండలు మాత్రమే కాదు. అవి మనిషి వెలుపలి ప్రకృతి, మనిషి ప్రకృతి కూడా. మనిషి అక్కడి ఆకులో ఆకు, కొమ్మలో కొమ్మ. అతడి రూపం రెండంగుళాల గోచి, బుజాన గొడ్డలి. నునులేత రెమ్మ! అక్కడి ఆడవారికి ఆచ్ఛాదన మొలవరకే. పై సగం పూసలపేర్లు. అవి ఆభరణము, ఆవరణము కూడా.

'అమృతసంతానం' ఆదిమానవుల గురించి కాదు. మానవుడి ఆదిమూలాల గురించి. ( 'శృణ్వన్తు విశ్వే అమృతస్య పుత్రా/ ఆ యే ధామాని దివ్యాని తస్థుః' శ్వేత. ఉప. 2. 5. )

ఈ నవలను రచయిత మూడు పార్శ్వాలనుండి దర్శించాడు: మనిషి – ప్రకృతి,మనిషి –రాజ్యము, మనిషి –మనిషి. దర్శనంలో మనిషి కేంద్రం. ఏ రచనకైనా వస్తువు మనిషే కదా? ('తేనెటీగ జీవితచరిత్ర' The Life of the Bee by Maeterlinck కూడా మనిషి గురించే. )

నవలగురించి ముందు చెప్పుకోవలసింది అందులోని శైలి. మొహంతి కవి.(నవలకు కవితాశైలి పడదు. ఖరీదైన బంగారుబురఖాలా ఒంటిని కప్పేస్తుంది. కథకాళ్లకు అడుగడుగునా అడ్డం వస్తుంది.అందంగా ఉన్నది ఆభరణం కాదు. అందమిచ్చేది ఆభరణం.) కాని,మొహంతి కవితాశైలిలో కవిత్వం కనిపించదు. భావంలో కలిసిపోయి నడిపిస్తుంది. అంటే భావరూపం పొంది కనిపిస్తుంది. (రూపకం, metaphor). ఆయనకు యీ శైలి ఒక అద్భుతమైన సాధనం, ఆయన రచనాశిల్పంలో ప్రధానగుణం. చాలావరకు నాలుగయిదు మాటలు మించని చిన్నచిన్న వాక్యాలు. రెండవ పాదంలోకి సాగిన వాక్యం అరుదు.

అనువాదరచనను బట్టి మూలంలోని శైలిగురించి యింత చెప్పడం సాధ్యమా అనిపించవచ్చు. పురిపండా అప్పలస్వామి అనువాదం అనువాదంలా లేదు. మూలరచన అనువాదానికి అనువైనది అయిఉంటుంది. ఇలా అనడం అనువాద ప్రతిభను ఏమాత్రం తక్కువ చేయడం కాదు. ఆయనది అరుదైన అనువాదప్రతిభ.

(నవలగురించి మరోసారి చెప్పుకుందాం.)

16-5-2017

# 2

**అ**ధ్యాయం 'ఒకటి'

ఈ నవలలో నూటొక్క అధ్యాయాలు.అధ్యాయాలకు పేర్లు లేవు.సంఖ్యలే. పేర్లు ఎందుకు పెట్టలేదు? సాధారణంగా ఒక అధ్యాయంలోని కథాభాగాన్ని అనుసరించి లేక పాత్రప్రాధాన్యాన్ని బట్టి ఆ అధ్యాయానికి పేరు ఉంటుంది.ఈ నవలలో అటువంటి మలుపులు లేవా? ఎందుకు లేవు? ఉన్నాయి. కాని అవి కథలో భాగాలుగా, కథాగమనంలో మజిలీలుగాఉంటూనే, దేనికదే ఒక పూర్ణరూపంతో ఉన్నాయి. ప్రతి అధ్యాయానికి ఒక సమగ్రత ఒక నిండుదనం ఉన్నది.అలాగని, ఒక అధ్యాయం తొలగించినా నవల సమగ్రతకు కొరత ఉండదా? ('పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే' అన్నట్టు)

కొరత ఉంటుంది. నవల నిండుతనానికి ప్రతి అధ్యాయము అవసరమే. అదే మొహంతి రచనానైపుణ్యం.( అటువంటి నైపుణ్యం ప్రసుత నవలకు అత్యంత భిన్నమైన మరో నవలలో చూచాను. The Brothers Karamazov by Dostoevsky లో. అయితే ఆ నవలలో అధ్యాయాలకు పేర్లున్నాయి. అది వేరే విషయం.)

'అమృతసంతానం' లోని ఈ వైశిష్ట్యాన్ని అధ్యాయం 'ఒకటి' లో పరిశీలిద్దాం.

'కోదుజాతి పెద్దపండుగనాడు సరుబు సావొతా చచ్చిపోయాడు.'

ఈ మరణవార్త మొదటి అధ్యాయం చివరివాక్యం. కథాప్రారంభం. నాలుగువేల అడుగుల ఎత్తున కొండలలో, కోదులనే కొండజాతివారి వూరు.ఎనభైఏళ్ళ సరుబు సావొతా (సామంత?) కులవృద్ధు. అయిదువందలమంది కోదులకు కులపెద్ద,పెద్దబుర్ర, నాయకుడు.కథ ఎక్కడ మొదలవుతున్నది? .

'పుష్యమాసం చివరిదినాల ఎండ.'

'పుష్యమాసం.' ప్రకృతి ఈ కొండజాతులవారికి జీవం. ఋతువులు వారి జీవనంలో భాగం. ఆకాశం వాళ్ళ గడియారం.మొక్కలు, చెట్లు, పైన చుక్కలు వారి పంచాంగం. వారి జీవితాలు జీవనవిధానం ఋతుక్రమంతో ముడిపడి వుంటాయి. ఎండ అంటే సరిపోదు. పుష్యమాసం అంటే చాలదు. తొలిపుష్యం ఎండ, మలిపుష్యం ఎండ. ఈ నవల అంతటా ఋతువులు పరచుకొని వుంటాయి. (ఇందులో ఋతువర్ణనలు రామాయణాన్ని గుర్తు చేస్తాయి.) కథాగమనంతో నడిచే ఋతువర్ణనలు అనడం కంటే ఋతువులతో నడిచే కథ అనడం సరి అయిన మాట. ఋతువులు నడిపించే కథ అనడం ఇంకా సరికావచ్చు.

'మాఘమాసం సంజ. చలీ చీకటీను. చలీ చీకటీ అంతా తొక్కేసుకుంటూ
నడిచిపోతారు.'

'ఫాల్గుణం చివరి చీకటిరాత్రి. రైంయి రైంయిమని తుఫానుగాలి.
ఊగుతూ ఊపేస్తూ నడిచింది.'

'ఫాల్గుణంగాడు చావనీ ... చైత్రం పండుగ ఆరంభమయి పోయింది.'

కొండజాతులకు ఋతువులు శరీరంలోనే ప్రకటమవుతాయి. కొండల్లో, నదుల్లో, పూలతీగల్లో, పండ్లచెట్లల్లో ప్రకటమైనట్టు.

సరుబు సావొంతాకు యిది తన చివరిరోజని తెలిసింది.

'పుష్యమాసం ఎండలో ఇప్పసారా రుచిగా ఉంటుంది. నిషా పడుతుంది. ఎండవెచ్చదనంలో కునుకుపడుతుంది...ఆలోచనలలో ముసలాడి కళ్లు మూతలుపడిపోతున్నాయి.'

తన చివరిక్షణాలలో సరుబుసావొంతాకు తన గతం, తన కుటుంబం, తనవూరు, తన కోదుజాతి, దాని ప్రాచీనఘనచరిత్ర అంతా ఒక్కసారి, చివరిసారి, మనసుకళ్ళముందు కదిలిపోతున్నాయి. మరణక్షణాలలో తన ఆదివాసుల ఆదికాలాలు స్మరణకు వస్తున్నాయి అతనికి. చరిత్ర పుట్టకముందే పుట్టిన కొండజాతి. యుగాలు గడిచిపోయాయి.

'ఆకాలం ముసిలాళ్ళు చెప్పేవాళ్ళు. ఎప్పుడో ఏ కాలంలోనో రాముడని ఎవరో రాజుకొడుకట.తన భార్యనీ తమ్ముణ్ణీ వెంటబెట్టుకుని ఈ అడివికి వచ్చాడట!...పెట్టుబడిదార్ల అన్యాయాలు ఎదిరించడానికి,కత్తి కట్టడానికి కోదులకి తగిన సర్దారు దొరికాడు. రాముడు హనూకోదు, జాంబాకా, జాంబవంతకోదూ అతడికి సాయంచేశారు.ఇతరగోత్రాలవాళ్ళు సైనికులైనారు.చెదురుమదురుగావున్న కోదుగోష్ఠిని వొక్కదగ్గర చేర్చాడు రామచంద్రుడు. దీనులు దరిద్రులు కూలీలు రైతులు సైనికులైనారు. ఈటెలు కత్తులు రాళ్ళు వెదుళ్ళు పట్టుకొని పెట్టుబడిదారీ సభ్యతను ఎదిరించి యుద్ధం చేశారు.తిరిగి ఆ దరిద్రనాయకులే రాజులయ్యారు. తిరిగి అదే పెట్టుబడిదారీ సభ్యత...ఎక్కడి పేదాసాదా అక్కడే.'

(అన్ని విప్లవాలలో జరిగేదిదే కదా!)

ఎనభై ఏళ్ల సావొంతాకు చివరిక్షణాల్లో గతం తలపుకురావడం సహజమే. కాని ముందుగా అతనికి గుర్తువచ్చింది తన గతంకాదు. తనకోదుజాతి ఘనచరిత్ర. దాని ఆదిమూలాలు.సరుబు కోదులప్రభువు. జాతిఘనత స్మరణకురావడం సహజం. కాని, ఈ కోదులజాతికి రామాయణంతో సంబంధం ఎంతవరకు నమ్మదగింది? రాముని పాదం తాకనిచోటు సీతమ్మ చీరె ఆరేసుకోని బండ లేదంటారు. ఇదీ అటువంటిదేనా? నవల ఈ గాథను చరిత్రగా చెబుతోందా? ఈ ముసలి తన చివరిక్షణాల్లో గుర్తు చేసుకున్నది, తాను చిన్ననాడు విన్నానని

చెప్పింది, చారిత్రకసత్యమా? కథలో కొన్ని వాక్యాలు వెనుకకు వెళితే రచయిత పరమార్థమేమిటో తెలుస్తుంది.

> 'పుష్యమాసం ఎండలో ఇప్పసారా రుచిగా వుంటుంది. నిషా పడుతుంది. పొగమంచులో నీడలు తేలిపోయేవి. ముసలాడి కళ్ళు మూతలు పడుతున్నాయి.'

కొండజాతిగాని, కొండంతజాతిగాని, తనకొక కాల్పనికచరిత్ర ఘనంగా రాసుకుంటుంది. ఆ చరిత్రలో,ఏ చరిత్రలోనైనా, నిజమెంత నిషా ఎంత? ఇక్కడ రచయిత కథ చెబుతూనే, చరిత్రరచనాప్రక్రియపై ఒక ప్రవచనం (statement) చేస్తున్నాడు. అంటే, ఈ రామాయణప్రసంగం కథకు అతకని, అవసరంకాని, అధికప్రసంగమేనా? ఎంతమాత్రము కాదు. ముసలాడు నెమరువేసుకోడం కథలో భాగం. చరిత్రరచనపై చురకగా కూడా కథకు అవసరం. సరుబు స్మరణలో జాతి, వ్యక్తిలో కలిసి, వ్యక్తిగా వ్యక్తమవుతున్నది. కోదుజాతి సరుబు నోట పలుకుతోంది. ఇది కథకు అవసరమైన సన్నివేశం. కదిలించే సన్నివేశం. సరుబుసావొతా చచ్చిపోయాడు. కోదుచరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. నవలలో మొదటి అధ్యాయం ముగిసింది. కథ మొదలవుతుంది.

> 'పుష్యమాసం చివరి దినాల ఎండ.'

మూడు పొడి మాటలు. ఈ నిరలంకారనగ్న వాక్యం రెండు జానల గోచి పెట్టిన కోదులాగే ఉంది. అంత బలమూ ఉన్నది. అంత బరువు మోస్తున్నది. మనిషి–ప్రకృతి, మనిషి–మనిషి(సమాజం) అనే రెండు పార్శ్వాలు ప్రదర్శిస్తున్నది. (ఈ పొడిమాటల పని యింతటితో అయిపోలేదు.)

ప్రవచనంలో అంతర్భూతమై మరో సత్యంకూడా ఉంది. రాముణ్ణి కొండజాతి వారు అర్థం చేసుకున్న తీరు. వారికి రాముడు విప్లవవీరుడు. పెట్టుబడీదారీ సభ్యతను ఎదిరించి పోరాడడానికి కూలీజనాలను సమీకరించి సైనికులుగా సిద్ధం చేసి పోరాడి పేదలరాజ్యం స్థాపించినవాడు. ఇందుకు విరుద్ధం 'సభ్య' సమాజం రాముణ్ణి అర్థం చేసుకున్నది. వీరికి రాముడు పెట్టుబడిదారుల ప్రతినిధి. (ఇక్కడ 'సభ్యత' అన్న పదం ప్రత్యేకంగా చర్చించదగింది. సాధారణంగా ఈ అర్థంలో 'వ్యవస్థ', 'సంస్కృతి'పదాలు వాడతాం.)

అధ్యాయం 'ఒకటి' లో మరో పార్శ్వం కూడా ఉంది. నవల మొదటే, మొదటి పది లైన్లలోపే, ఒక కీలకమైన అంశం ప్రస్తావించబడింది, మనిషి-రాజ్యము. దీని ప్రస్తావన తరువాతనే, పైన చెప్పుకున్న తక్కిన రెండు అంశాలు, మనిషి-ప్రకృతి, మనిషి-మనిషి(సమాజం) వస్తాయి.

> 'కోదుల నమ్మకం ప్రకారం రైతు దరిద్రుడే అవుగాక, రాజుకంటే అతడి అభిజాత్యం అధికం. రాజు తమ్ముడు. కోదు అన్న. అన్న గుర్రం ఎక్కడం కోసం రువ్వ విరిచి తేడానికి వెళ్లాడు. ఇంతలో తమ్ముడు గుర్రం ఎక్కి వుడాయించాడు. అవేళనుంచీ అతడు రాజయ్యాడు. తమ్ముడు దగాకోరు. అన్న సరుబు సావొతా. రాజైన తమ్ముడి విరోధం క్షమించడం నేర్చుకున్నాడు కోదు..మన్యం కొండలాగా ఉన్నతమైనవాడు కోదన్న. ఆకాశంలాగా ఉదారుడు.'

ముందు వచ్చిన చెవులకన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి. కొమ్ములు తిరిగిన రాజు ఎక్కినగుర్రం ఎప్పటికీ దిగడు.

అధ్యాయం 'ఒకటి' లో మరో ముఖ్య పార్శ్వం కూడా ఉంది. ఆదివాసుల క్రతువులు, ఆర్షసంస్కృతి.

> 'సరుబు కళ్ళు మూతలు పడుతున్నాయి ఆలోచనలో. ఊరిమొగన ఝాకరదేవత తోటలో డోలు వినపడుతోంది డుమ్ డుమ్ డుమ్. జాని (పురోహితుడు) మంత్రాలు చదువుతున్నాడు.'

మంత్రాలు! కోదులేమన్నా ఋషులా? వేదాలు చదువుకున్నారా? ఏమిటా మంత్రాలు? అవి కోదుభాషలో మంత్రాలు.

> 'ఎవరూ నష్టం కాకుండా వుండాలి. పులి లేకుండా వుండాలి. కరువు రాకుండా వుండాలి. అందరూ సుఖంగా శాంతిగా వుండాలి. ఉల్లి సాగు బాగుండాలి. వెల్లుల్లి సాగు బాగుండాలి.'

వేదసూక్తాలు శాంతిమంత్రాలు స్తోత్రాలు కోదుభాషలో లేవు. కాని అవీ యిదేగదా చేయడం. దేవతలను స్తోత్రం చేయడం, ఇదివ్వు అదివ్వు అని అడగడమే కదా? రాళ్ళివ్వు, ఇసుకయివ్వు, మట్టివ్వు ( ఆకాలంలో సిమెంటు లేదు) ఆయుస్సు

యివ్వు, ఆరోగ్యమివ్వు, భార్యనివ్వు, పశువులివ్వు, పంటలివ్వు (ఇడ్లీ చ మే దోశాశ్చమే. courtesy : కన్యాశుల్కం).ఆదివాసుల మంత్రాలలో అత్యాశ యింతగా లేదేమో! ఘనాపాఠి పాఠం ఇంతకంటే ఘనమా?

ఇక ఆదివాసుల క్రతువులు. వాళ్ళు మొదట నరబలి ఇచ్చేవారు.తరువాత బర్రెలు.ఆ తరువాత కోడి. ఇప్పుడు ఎలుకలైనా చాలు. నరబలి వారికి సంతోషం కాదు. విధిగా చేసేవారు.పైన ధర్మదేవతం కింద ధరిత్రి సంతోషిస్తారని కష్టాలనుండి కాపాడుతారని చేసేవారు. 'ఈ పాపం మాదికాదు, ఈ పాపం మాది కాదు' అని పదే పదే ఒద్దుకుంటూ బాధతో, దుఖంతో బలి యిచ్చేవారు. వేదకాలంలో ఋషులు కూడా నరబలుల దగ్గర మొదలుపెట్టిన వారే కదా? మరి ఒక సంస్కృతి సభ్యము, మరొకటి అసభ్యము ఎలా అయ్యాయో?

అలాగని రచయిత కోదుసంస్కృతిని ఆదర్శసంస్కృతి అని ఆకాశాని కెత్తేయడం లేదు. సాహిత్యకారుడిగా వాస్తవాన్ని చిత్రిస్తున్నాడు.

> 'వాళ్ళది అసభ్యత. అక్కడా అరిషడ్వర్గాలున్నాయి.అక్కడా కంపుంది.మైలా వుంది.అన్నిచోట్ల ఏముందో అక్కడా అదే ఉంది.కాని అక్కడ అడివి కెరటాలలో మానవహృదయంలోని మూలస్వరూపం నాట్యం చేస్తుంది ... వేదన నిమ్మళిస్తుంది.'

ఈ నవల సామాజికశాస్త్రచర్చ కాదు. సరుబుసావొతా నవలలో పాత్ర, ఒకతరానికి ప్రతినిధి. తన చివరిక్షణాలలో తన గతాన్ని జాతిచరిత్రను నెమరు వేసుకోడం కథలో భాగం. నవలలో నడవబోయే కథకు భూమిక అధ్యాయం 'ఒకటి'.

చివరగా కోదుల జీవితదృక్పథం.ఇదికూడా పూర్తిగా వేదం దర్శించినదే. అంతకాలంలో సరుబు చింతన:

> 'గతజన్మలో బాగుండేవాణ్ణి .ఈ జన్మలో బాగున్నాను. దీని తరువాత మళ్ళీ మరొక జన్మ తప్పదు.'
>
> ఇలా అనుకుని ఆనందించేవాడు.

'పోతేపోతుంది. ఇది పాతబడిపోయిన పనికిరాని శరీరం. దీన్ని పారేసి మరొకసారి పుట్టడం మంచిది ..... ఎంత అందంగా ఉంది మన్యం! రంగురంగుల కొండలకింద స్ఫటికంలాగ స్వచ్ఛమైన సెలయేళ్ళు. నాలుగువైపులా పసుపుపచ్చని ఒలిసి పువ్వులు. ఒలిసి తేనెపట్లు.'

ఇంత అందాన్ని, ఆనందాన్ని మనసులో నింపుకుని వెళుతున్నాడు సరుబు సావొంతా. ఆ అందమూ ఆనందమే 'పుష్యమాసం చివరిదినాల ఎండ'. ఫాల్గుణం కాకూడదా? కాదు. సరుబుసావొంతా చావుతో ఒకతరం, కోదుచరిత్రలో ఒక దశ, ముగుస్తుంది. మరో దశకు మాఘఫాల్గుణాలు సంధియుగం. (నవల కాలం రెండునెలలని అర్థంకాదు.)

'పుష్యమాసం చివరిదినాల ఎండ.'

మూడు పొడిమాటలు! ఎంత అలవోకగా ఎన్ని బాధ్యతలు నిర్వహించింది! ఇదీ మొహంతి కనిపించని కవితాశైలి!

23-5-2017

# 3

**కథలో**

వూళ్ళు: మిణి అపాయు, బందికార, మిటిం.

ప్రధానపాత్రలు:

సరుబు: (మిణి అపాయు సావొంతా. ఇతని చావుతో కథ మొదలు)

దివుడు: సరుబు కొడుకు, సరుబు తరువాత వూరి సావొంతా

హోర్గుణా: బందికార సావొంతా

బేశు: మిటిం సావొంతా రఘు కొడుకు

లెంజు: సరుబు తమ్ముడు

పుయు: దివుడు భార్య

పుబులి: దివుడు చెల్లెలు.బేశు ఈమెను 'ఉదులియా' తీసుకెళ్లి (రాక్షస వివాహం) పెళ్లి చేసుకుంటాడు.

పియోటి: కథ చివర, దివుడు తన రెండవ భార్యగా యింటికి తెచ్చు కుంటాడు

సోనాదేయి: (డొంబు జాతి) ఘర్షాముండా కోడలు

వర్గము–అరిషడ్వర్గము–ఆడామగా.

ప్రపంచంలోని ఏ భాషాసాహిత్యంలోనైనా ఏ కథ అయినా ఏ కవిత అయినా ఈ మూడింటిచక్రంలో ఇమిడిపోవలసిందే.ఈ చక్రానికి వెలుపల రాయడానికేమీ లేదు.(structuralists, వారికంటే ముందు Northrop Frye, ప్రపంచంలో ఏ కథ అయినా ఇమిడిపోవలసిన ఒక మాతృక (matrix)వంటిది తయారుచేశారు. అవన్నీ పై మూడిటిలో ఇమిడిపోతాయి,'అమృతసంతానం' లో కూడా.)

నూటొక్క వ్యాసాలు ఎలాగు రాయలేను, నవలలో కథనశిల్పాన్ని ఆద్యంతము విశ్లేషించలేను. కనుక , స్థూలంగా కథలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తాను. ఏ నవలలోనైనా ముఖ్యమైన రెండు అంశాలు పాత్రచిత్రణ, కథానిర్మాణం.ఈ నవలలో యీ రెండూ కూడా విశిష్టంగా నిర్వహించాడు మొహంతి.

ఈ నవలలో కథానాయకులనదగినవారు ముగ్గురు: దివుడు, హోర్గుణా, బేశు. ఇద్దరు సావొంతాలు, మూడవవాడు సావొంతా కొడుకు. కాని నవలలో ప్రధానపాత్రలు స్త్రీలనవచ్చు: పుయు, పుబులి, పియోటి. వీరిలో చేర్చలేని మరో స్త్రీ పాత్ర సోనాదేయి.

నవలలో పాత్రలను సాధారణంగా సంక్లిష్టపాత్రలని (round), సీదాసాదా (flat) పాత్రలనీ వర్గీకరిస్తారు.ఈ నవలలో స్త్రీపురుషపాత్రలనన్నిటినీ స్పష్టమైన వ్యక్తిత్వంతో పూర్ణరూపంతో సజీవంగా చిత్రించడం నవల విశిష్టత. ముగ్గురు కథానాయకులవి మూడు విభిన్నవ్యక్తిత్వాలు. దివుడుది ముగ్గురిలోను సంక్లిష్టపాత్ర. బేశు తాను సీదాసాదా అని తనే చెప్పుకుంటాడు. (సీదా పాత్ర సీదా పాత్రచిత్రణ ఒకటికావు. సీదాపాత్రలోని సీదాతనం సజీవంగా చిత్రించబడవలె.)

ఇక రెండవ అంశం కథనం. బిగువైన అల్లిక ఈ నవలలోని ప్రధానగుణం. నవలను ఉత్తమస్థాయికి చేర్చినవి ఈ రెండు అంశాలు. ఇక కథలోకి వెళుదాం. సంఘటనలకంటె సంబంధాలు, అనుబంధాలు, ఆ బంధాలు వారి వ్యక్తిత్వాలను ఎట్లా చూపుతాయి అన్నది ఏ నవలలో అయినా చూడవలసిన విషయం.

సరుబు సాహౌతా చచ్చిపోయాడు. కుటుంబం దుఃఖంలో ఉంది. ఊరు బాధపడుతోంది. అందరి దుఃఖమూ బాధా ఒకటిగా ఉండదు. కోడలు పుయు, పెళ్లి కావలసిన కూతురు పుబులి, ఏడ్చారు. పుయుకు తల్లితండ్రులు లేరు. మామలో తండ్రిని చూచుకున్నది. ('తండ్రి కంటే హెచ్చు.') మామ ఆమెను అంతే ప్రేమతో చూచేవాడు. పుయుకిప్పుడు తొమ్మిదో నెల. మామ ఎక్కువ మాట్లాడేవాడు కాదు. పుయుకడుపులో పెరుగుతున్న మనవణ్ణి తలచుకుంటూ సంతోషంతో కోడలివైపు చూచి, ఒక నవ్వుతో వెళ్ళిపోయేవాడు. కొడుకు అప్పుడప్పుడు కోడలిపై కోపం చూపించబోతాడు. ముసలాడు పొడిదగ్గు దగ్గుతాడు. కొడుకు కోపం మింగేసు కుంటాడు. ( ముసలాడి 'పొడిదగ్గు' కుర్రకోపానికి సరిహద్దు, ఇంట్లోను ఊళ్ళోనూ. ) పుబులి ఏడ్చింది. పుబులి ఏడుపు మనిషి ఏడుపులా లేదు.

> 'జంతువు ఏడ్చినట్టుంది. గుండుదెబ్బతిని పారిపోయిన అడివిపంది
> ఏటివొడ్డు బురదలోపడి పొర్లుతూ ఏడ్చినట్టుంది.'

(రావిశాస్త్రి శైలిని, ముఖ్యంగా 'గోవులొస్తున్నాయి జాగ్రత్త'లోని ఉపమానాలను, గుర్తు చేస్తుంది మొహంతి శైలి. కాని ఈ ఉపమానం అంతటితో ఆగిపోతుంది. రావిశాస్త్రి శైలి ఉన్న కొద్ది కథనాన్ని మింగేస్తుంది అన్నది ఎరిగిన సత్యమే. )

పుయు ఏడ్చింది. పుబులి ఏడ్చింది. ఇద్దరి దుఃఖమూ ఒకటి కాదు. ఎవరి దుఃఖం ఎక్కువ అని చెప్పడం కష్టం. ఈ కష్టం సాధారణంగా కలగకూడనిది. పుయు బంధం మామతో ఆ కుటుంబంతో అంత గాఢమైంది.

పుయు పుబులిల అనుబంధం నవలలో ఒక ప్రధాన అంశం. పుయుకు పుబులి తల్లి, చెల్లెలు, స్నేహితురాలు, ఆడబడుచు. పుయు పుబులిని అందంగా ముస్తాబై ఉండమంటుంది. పెళ్లి కాని ఆడపిల్లలతో కలిసి బయటకువెళ్ళి తిరగమంటుంది. కొండజాతుల్లో వివాహవిషయంలో ఆడపిల్లలదే నిర్ణయం. ఆమె

ఊ అంటేనే అతడు ముందడుగు వేయగలడు. ముసలాడుండగా పుబులి గురించి అంటుండేవాడు,'బందికార హోర్గుణా దీన్ని చేసుకుంటా'దని.

పుయు అడివిలో కన్న కాన్పు వర్ణన ఆశ్చర్యం కలిగిస్తుంది. పుయుకు నిండు నెలలు. అందరి ఆడవాళ్ళతో కలిసి అడివిలోకి వెళ్ళింది, రోజూలాగే, దుంపాదుబ్రా కొరకు. వెళ్ళినవాళ్ళు తలా ఒక దిక్కైనారు. పుయు ఒక్కతే అయింది. బాగా అలిసిపోయింది. ఉన్నట్టుండి నొప్పులొచ్చినాయి, తుఫానులాగా తెరలుతెరలుగా. పుయు అరిచింది, ఏడ్చింది. ఎండ తీవ్రంగా ఉంది. ఎక్కడలేని సత్తువతో ఒక మద్దిచెట్టు రెండుచేతులతోను బిగించిపట్టుకుంది. హఠాత్తుగా తుఫాను ఆగిపోనట్టయింది. ఎర్రటి చిన్న కందు కిందపడి అరుస్తున్నాడు. ఉదయసూర్యుడిలా వాడి కళ్ళు. పుయు చేతులుచాపి కొడుకును తీసుకుంది. నీరసంగా ఉంది. చాలాసేపు అయింతర్వాత, బిడ్డను గుండెలకద్దుకుని లేచింది. ఒంటిమీదనుంచి మురికి నీళ్ళు వరదలు కడుతున్నాయి. ఒక రాతిముక్క తీసుకొని బిడ్డ బొడ్డు కోసింది. కోసినచోట పసరు పూసింది. బిడ్డకు పసరు నాకించింది. తను ఒక వేరు నమిలింది. ఊరిదారిలో ఏరుంది. జారకుండా ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ దిగింది. అడ్డాకులు పరిచి పిల్లాణ్ణి పడుకోబెట్టింది. ఏటిలో దిగి మునిగి స్నానం చేసింది. ఒంటిబట్ట ఉతుక్కుంది.కొడుకుని ఎత్తుకుని ఊళ్ళోకి నడిచింది. తన తొలి కానుపు, తన కన్న బిడ్డను గుండెలకు హత్తుకొని. ఇది అమృతసంతానం అవతరించే విధానం.

నవలకొక నాయికానాయకులుండాలంటే, ఈ నవలలో వాళ్ళు దివుడు, పుయు. కాని కథ మొదలయేటప్పటికే వారిద్దరి మధ్య దూరం ఏర్పడింది.ఈ నవలలో కథానిర్మాణంలో ఏదైనా అసంతృప్తి కారణం ఉన్నదంటే అది ఈ యిద్దరి దూరం విషయంలో. దూరానికి యిద్దరూ కారణమే. అయినా వ్యక్తులుగా ఇద్దరిలో ఎవరినీ తప్పుపట్టలేని విధంగా నిర్వహించాడు మొహంతి. ఎంత ఆలోచించినా పుయుకు తన తప్పేమిటో తెలియలేదు. దివుడికీ తెలియడంలేదు. ఒకప్పుడు దివుడు పుయును యిష్టపడి వెంటపడి మనసు గెల్చుకుని యింటికి తెచ్చుకున్నాడు. కాని యిప్పుడు తన మనసు పక్కతోవల పోతోంది. తప్పు తనది కాదు.పుయు కడుపుతో ఉన్నప్పుడు తను దగ్గరవబోతే పుయు అగ్గిలా చూచేది. పిల్లాడు పుట్టిన

తరువాత ఎప్పుడూ తండ్రిగా తన బాధ్యతలు పనులు గుర్తుచేస్తుండేది. దివుడు అడివి మనిషి. ఎన్నాళ్ళని ఆగుతాడు? తరువాత ఒకసారి పుయును మన్యజ్వరం పట్టిపీడించింది. కాన్పుతో కాంతి తరిగింది. జ్వరంతో ఎముకలగూడైంది. ఆమె ఈ స్థితి దివుడు దూరం అయిన ఫలితమా ? దూరానికి కారణమా?

అటువంటి స్థితిలో సోనాదేయి అతణ్ని ఆకర్షిస్తుంది. సోనాదేయికి అందం ఉంది. వయసుంది. బిగువుంది. వయ్యారముంది. కోరిక ఉంది. ఇన్నీ ఉండీ వృథా. ఆమె భర్త బాలాముండా 'చేతకాని చచ్చు.' ఆమెకు ఆశ్రయం లేదు. ఆమెది కేలార్ గ్రామం. డొంబుజాతి. డొంబులవృత్తి దొంగతనాలు చేయడం. (ఈ డొంబులు ఒకప్పుడు కాశ్మీరాన్ని ఏలినట్టు చరిత్ర చెబుతుంది. కల్హణుడి 'రాజతరంగిణి' లో ఒక డొంబుజాతి స్త్రీ రాజ్యం చేసినట్టు ఉంది. ఇక్కడ అది అప్రస్తుతం.) సోనాదేయికి వయసొస్తున్న సమయంలో ఆమెకు జరిగిన ఒక ఘటన జీవితాంతం ఆమెను వెంటాడేది. ఒక రోజు ఒక పోలీసు అధికారి ఆమె యింటికి వచ్చాడు, ఎక్కడో ఏదో దొంగతనం జరిగింది, సోదా చేయాలంటూ. పోలీసెందుకు వచ్చాడో యింటిముందు గుమిగూడిన వారందరికి తెలుసు. సోనాదేయి తండ్రి చేతులెత్తి మొక్కాడు. 'మహా ప్రభో! ఆ పిల్లనేం చేయకండి. అదే దొంగతనం చెయ్య లేదు.' ఆ సంగతి పోలీసు అధికారికీ తెలుసు. సోదా చెయ్యాలన్నాడు. నలుగురెదుటా పిల్ల ఒళ్ళంతా తవిడాడు, 'చెప్పు ఎక్కడ దాచావ్ దొంగముండా' అంటూ. 'పద లోపలికి ఏ వంటచేసే చోటో దాచి ఉంటావు,' అంటూ పిల్లను లోపలికి తోసుకుంటూ వెళ్లాడు. కొంతసేపటికి పోలీసు బయటికి వచ్చి 'ఏం దొరకలేదు. ఈ సారికి వదిలేస్తున్నా', అంటూ వెళ్ళిపోయాడు. వెనకనుంచీ సోనాదేయి కళ్ళనీరు కారుతూ వచ్చింది. ఇది ఒక్క సోనాదేయికి మాత్రమే జరిగేది కాదు. అక్కడ ఆడపిల్లలకు సాధారణంగా జరిగేదే. పాలితులు నోరెత్తకుండా తలెత్తుకోకుండా పడిఉండడానికి పాలకుల ఆదిమసాధనం ఈ పౌరుషం. (వాడ్రేవు చినవీరభద్రుడు: 'ప్రశ్నభూమి' లో వస్తువిదే.) ఇది సోనా పూర్వచరిత్ర.

ప్రస్తుతం సోనాపై దివుడు, అతడి చినతండ్రి లెంజు ఇద్దరు కన్ను వేశారు. కాని వారి అంతస్తుకు అంటరాని సోనాతో సంబంధం చిన్నతనం. ఊళ్ళో

తెలియకూడదు. ఒకరికి తెలియకుండా ఒకరు ఇద్దరూ సోనా ఇంటిచుట్టూ దాగుడుమూతలు ఆడుతున్నారు. కాని ఒక్కడూ తన దాహం తీర్చడంలేదు. ఒక్కొకసారి మరో 'ప్రభుత్వాధికారి' అయినా తారసపడలేదు అనుకునేది. ఆ 'అంటరాని' దాని ఆర్తి అంతటిది. (కాళీపట్నం 'ఆర్తి' లో కంటే సోనా ఆర్తి ఎక్కువ అనిపించింది.)

లెంజు భార్య పోయింది. అన్నపోయిన తరువాత అతనికి ఆదరం తగ్గింది. దివుడు అతన్ని మన్నన చేయడంలేదని అతని భావం. దివుణ్ణి దించి లెంజును సావొతా చేయాలని కొందరి యత్నం.

పుయుకు కొడుకు పుట్టాడని ఆమె వూరి వాళ్ళకు తెలిసింది. పుయు పుట్టింటి వాళ్ళెవరూ లేరు. లేరని ఊరు ఊరుకుంటుందా? కావళ్ళతో కానుకలు తీసుకుని వచ్చారు. కొండజాతుల్లో ఊరే ఒక కుటుంబం. బేశుకోదు మిటిం సావొతా కొడుకు. ఉత్సవం. సారా. పాటలు. ఆటలు. ఆ ఉత్సవంలో బేశుకి పుబులికి మనసులు కలిశాయి. తరువాత కొన్నాళ్ళకు బేశు పుబులిని ఎవరికీ చెప్పకుండా తీసుకుని తనవూరికి పారిపోయాడు. ఆ పారిపోవడంలోని ప్రేమ సాహసము నవలలో ఒక గొప్ప వర్ణన. (వాల్టర్ స్కాట్ నవలలలో, కవితలలో ప్రేమ సాహసాలు దీనిముందు చిన్నబాలశిక్ష. కీట్స్ The Eve of St.Agnes వంటి కవితలకు సాటివచ్చే వర్ణన.) దివుడు మండిపడ్డాడు. ఊళ్ళోవాళ్ళంతా ఆగ్రహించారు. కాని వాళ్ళలో ఆడపిల్ల అలా నచ్చినవాడితో పారిపోవడం చేయకూడని పనేమీ కాదు. వాళ్ళకు సమ్మతమే. కొన్ని రోజులకు కోపాలు తగ్గి, దివుడు చెల్లెలిని చూడడానికి వెళతాడు. ఆ సందర్భంలో ఆ అన్నాచెల్లెలి కలయిక నవల మొత్తంలో ఒక ఆర్ద్రమైన సన్నివేశం. ముందు అతిథులందరూ కొత్త పెళ్ళికొడుకుని కుమ్మి పెడతారు (ragging). బేశు నవ్వుతూ, 'చాలా , యింకా కొడతారా?' అంటాడు. పుబులి ఒంటరిగా ఉన్నప్పుడు దివుడు చెల్లెలిని కలిశాడు. చెల్లెలు ఆనందం చెప్పలేనంత. ఆట పట్టించాడు. ' ఏం, వీడెవడో వచ్చి నన్ను అల్లరి చేస్తున్నాడని మీ ఆయనకు చెప్పి కొట్టిస్తావా నన్ను' అంటాడు. ఈ మాత్రం మాటతో ఆమెకు చింతరువ్వతో మొహంమీద చెళ్ళుమనిపించినట్లయింది. భోరున ఏడ్చేసింది. అన్న దగ్గరతీసుకుని తల తడివాడు. అతని కళ్ళు బరువెక్కాయి.

ఈ నవలలో ముగ్గురు నాయకులవి మూడు విశిష్ఠవ్యక్తిత్వాలు. పుబులికి తప్పిపోయిన వరుడు హోర్గుణాకు, సంపాదన ప్రధానం. ఎప్పుడూ వ్యవసాయం, పంటలు, సావుకార్లతో బేరాలు, లాభాలు. స్త్రీ అవసరమే. కాని ప్రధానం సంపాదన. పుబులి విషయంలో ఏమాత్రము తొందరపడలేదు. పుబులి తనదే. తనకోసం ఎన్నాళ్ళైనా కాచుకుంటుంది అనుకున్నాడు. పుబులి బేశుతో పారిపోయినపుడు అతడికి పట్టలేని కోపం రాలేదు. బాధ కలగలేదు. ఆలస్యం చేసినందుకు పశ్చాత్తాపం లేదు. అతడికి పుబులి కాకపోతే మరో పిల్ల. పుబులి భర్త బేశుకోదు ఇతడికి పూర్తిగా విరుద్ధం. అతడిది కుర్రతనం. ప్రేమ, శృంగారం, సాహసం, వేట అతని జీవితం. దివుడు ఈ ముగ్గురిలో సంక్లిష్ట పాత్ర. ధీరనాయకుడు. ధీమా. ఆరోగ్యవంతమైన శరీరం. దాని అవసరాలు గుర్తు చేసుకుంటాడు. ఊగిసలాడుతాడు.

దివుడు సోనాదేయితో తన పినతండ్రి సంబంధం కోరుకోడం సహించడు. ఆ అంటరానిదాని తగులు కుటుంబానికీ ఊరికీ చిన్నతనం. ఒక రోజు సోనా యింటిలో లెంజును తిట్టి ఊరినుంచి తరిమేస్తాడు. లెంజు బందికారా వెళ్ళిపోతాడు. హోర్గుణా అతడికి ఆశ్రయం యిస్తాడు.

మరో ముఖ్యమైన పాత్ర ప్రవేశిస్తుంది. పియోటి. (ఈ నవలలో దుష్టపాత్ర లేదు. ఉంటే అది తెలుగుదేశం. తెలుగుల 'సభ్యత' అమృతపాత్రలో విషబిందువు. తెలుగుదేశం వ్యాపారులు కోదుల అడవుల్ని పెద్ద వలవేసి కప్పేశారు. కోదుల కష్టమంతా పంటరాకముందే పావో పరకో యిచ్చి కొనేస్తారు. పంటరాగానే లారీలెక్కించి కొండకిందికి జారేస్తారు. తెలుగుదేశం నుంచి సవాయిరోగం, కొరుకురోగం కొండలెక్కి వచ్చాయి. ఈ దుష్టపాత్రలో తెలుగుదేశం ఆగ్రహించవలసిందేమీ లేదు. కోరాపుట్ పల్లపుప్రాంతం తెలుగుదేశం కావడం భౌగోళిక ప్రమాదం. geographical accident. మరో కొండప్రాంతంలో మరో పల్లపుదేశం.) పియోటి ఒకప్పుడు కోదులమనిషే. ఆమె తల్లి బతుకు మెరుగు పడుతుందని పల్లపు ప్రాంతాలకు వెళ్లింది. కూతురు అక్కడి సభ్యతలో సభ్యతతో పెరిగింది. అక్కడ బతుకు గడవక తిరిగి కొండలెక్కింది ముసలిది, కూతురితో. హోర్గుణా బాగా గడించాడు. సావొతా తన కూతురు పియోటి హోర్గుణాను వలలో

వేసుకోవాలి అని ముసలిదాని కోరిక. అది అంత సులభం కాదు. పైగా పియొటిది తెలుగు ఆకారం ఆహారం ఆహార్యం. అన్నిటికంటే తెలుగు సభ్యత. డొంబులు తాగినట్టు ఏ యితర కోదు ఆడది తాగదు. పియొటి తాగినట్టు ఏ డొంబు ఆడది తాగదు.

దివుడు పనిమీద ఒకసారి బందికార వెళతాడు. పియొటిని చూస్తాడు. ఇక ఆమెను మరవలేదు. కాని భార్య పియు? ఘర్షణ తనలో చాలాకాలం సాగుతుంది. పుయును తానేమైనా తరిమేస్తానన్నాడా? ఇష్టమైతే తనతోనే వుండొచ్చు. పుయుకు భర్త దూరమవుతున్నాడు. సోనాదేయి కోసం వెళుతుంటాడని తెలుస్తుంది. బాధ పడుతుంది. తన తప్పేమిటో? ఒకరోజు దివుడు యింటికి తిరిగిరాలేదు. ఎక్కడికి వెళ్లాడో? పుయు సోనాదేయి యింటికి వెళ్లింది. సోనా మామకు తెలిసి ఉంటుంది దివుడు ఎక్కడికి వెళ్లాడో. సావొతా భార్య అంటరానిదాని యింటికి వచ్చింది. సోనాకు లోపల సంతోషం. పుయుకు మర్యాద చేసింది. ఆ మర్యాదలో అవహేళన ఉంది. మొగుణ్ణి వెతుక్కుంటూ తనింటికి వచ్చింది ఊరి రాణి!

ఒకరోజు దివుడు సారా కోసం సోనాదేవి మామకు కబురు చేశాడు. ఆ రోజు స్వయంగ సోనానే సారా తీసుకు వచ్చింది. మామకు జ్వరం అంది. సారా అందించింది. చేయి తాకించింది. దివుడు మొగం చీకటిలో కనిపించడంలేదు. తిరిగి వెళ్ళిపోతోంది సోనాదేయి. నాలుగడుగులు వెళ్లి పెద్దగా అరిచింది. ఏమైందో తెలియలేదు దివుడికి. పామో ? కటిక చీకటి. వెళ్లి ఆమెను రెండుచేతుల్లోకి తీసుకుని యింట్లోకి తెచ్చి పడుకోబెట్టాడు. దీపం తెచ్చి వొళ్ళంతా చూశాడు. ఏమైందో తెలియలేదు. దీపం ఆరిపోయింది. అర్ధరాత్రి గడిచిపోయింది. సోనాదేయి తన యింటితోవ పట్టింది.

ఎటువంటి శృంగారసన్నివేశంలో కూడా మొహంతి గడపకు యివతలే నిలబడిపోతాడు.

సోనాదేయికి అది విజయం.'డొంబుముండతో సంబంధమా నీకు' అని చినతండ్రిని తన్నితరిమేసిన దివుణ్ణి వొంచింది. కాని దివుడికి అది రాత్రి గాథ. రాత్రితో గడిచిపోయింది. తెల్లారి పియొటి ఆలోచన.

చివరకు ఒకరోజు పియొటి తల్లి పెట్టిన షరతులకన్నిటికీ ఒప్పుకుని దివుడు పియొటిని ఇంటికి తెచ్చేశాడు. పుయు ఇల్లు వదిలి వెళ్ళిపోయింది, చంకలో బిడ్డతో. పుయును వెళ్ళిపొమ్మనలేదు దివుడు. 'ఉండిపోవచ్చు కదా' అనుకున్నాడు. ఉండిపోవలెననే అనుకుని ఉండవచ్చు. కాని అనలేక పోయాడు. అనుకోడానికి అనగలగడానికి చాలా అంతరం ఉంది.'ఉండిపో' అనగలిగిన ధైర్యం లేకపోయింది దివుడికి. అనలేకపోవడం పుయు వ్యక్తిత్వపు ఎత్తుకు లోతుకు కొలత.

పుయు ఎక్కడికి వెళ్లాలి? తన పుట్టినవూరు మిటిం. అక్కడ తన వాళ్ళెవరూ లేరు. మరి అక్కడికే ఎందుకు?

రామాయణసీత ఎక్కడికి వెళ్లింది? తను పుట్టిన మట్టిని చీల్చుకుని మట్టిలోకే వెళ్లిపోయింది. అలాగే పుయు తను పుట్టిన చోటికే వెళ్ళాలనుకుంది.

పుయు అంటే కోదుభాషలో పూవు. పూవు కంటే మృదువు పుయు. పుయు తను పుట్టిపెరిగిన కొండలకంటే కఠోరమైనది. కొండంత ఎత్తు ఎదిగింది స్వాభిమానంలో, నిశ్చయంలో. తన నీడ తాను తొక్కుతూ కదిలిపోయింది.

'అమృతసంతానం' సభ్యతకు మరో నిర్వచనం. మరో 'సీతాయాశ్చరితం మహత్'.

31-5-2017

## న్యాయపతి శ్రీనివాసరావు

# ఒక అమృతకథనం ముందొక చిన్ని అద్దం

శ్రీ గోపీనాథ్ మహంతి (1914–1991) గారు 1947లో రాసిన ఒడియా నవల 'అమృతర సంతాన్' ని పురిపండా అప్పలస్వామి గారు'అమృతసంతానం' అనేపేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ తెలుగు అనువాదం 1963లో సాహిత్య అకాడెమి వారు అచ్చువేశారు.

గోపీనాథ్ మహంతి గారు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత. ఈ నవలని తన భార్యకే అంకితమిచ్చారు మహంతి గారు.

ఈ నవల నిడివి దాదాపు 600 పేజీలు. 101 అధ్యాయాలు. సగటున అధ్యాయం కేవలం ఆరు పేజీలు.

ఇది పూర్తిగా ఒడిశాలోనికోరాపుట్ జిల్లాలో (జయపురం, పొట్టంగి ప్రాంతాల్లో) నివసించే ఆదిమ తెగవారైన కోదుల జీవనం గురించీ వారి స్థితిగతుల గురించినదే. మహంతి గారి గురించి తెలుసుకోవాలనుకున్న ఔత్సాహికులైన పాఠకులు ఇంగ్లీష్ వికిపీడియా చూడగలరు.

మహంతి గారు ఉద్యోగ రీత్యా ఆ ప్రాంతాల్లో పనిచేయడం మూలాన వారికి దక్షిణ ఒడిశాలోని ఆదిమ తెగల జీవనాన్ని దగ్గరగా పరిశీలించే అవకాశం కలిగింది. ఆ సావాసఫలమే ఈ నవలామృతం. ఇది బాగుందనో చాలా గొప్పగా ఉందనో ఒకటి రెండు మాటల్లో సరిపుచ్చే నవల కాదు.

చదివితే ఏదో అనిర్వచనీయమైన అనుభూతి చెందుతాడు పాఠకుడు. మళ్ళీమళ్ళీ చదువుతాడు.

ముఖ్యంగా దీన్ని గురించి స్నేహితులతో మాట్లాడతాడు. కొన్ని మాటలైనా రాస్తాడు. నెమరువేసుకుంటాడు.

నవలలోని ప్రతి పాత్ర రక్తమాంసాలతో జీవం పోసుకున్నదవడంవల్ల కళ్ళముందే ఆ పాత్రలన్నీ తచ్చాడుతున్నట్లనిపించీ తన్మయమైపోతాడు.

ఈ నవల పాఠకుణ్ణి తనలోకి లాక్కుంటుంది.

భూమికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండల మధ్య మన్యంలో ఎప్పట్నుంచో ఉంటున్న కోదుల కథ ఇది.

పురిపండా వారు ఈ నవలని పూర్తిగా కళింగాంధ్ర భాషలో రాయడంవల్ల ఈ అనువాదమూ అక్కడి ప్రజలు మాట్లాడుకునే భాషా పరిపుష్టం చెందాయి.

నా మటుకు నాకు మళ్ళీ రాయగడ, గుణుపురం వెళ్ళి అక్కడే ఉంటున్నట్టుంది.

ఇక జయపురం, కొరాపుట్ వాళ్ళకి ఎలా అనిపిస్తుందో!

ఇక ఆ ప్రాంతపు ఒడియా పాఠకులైతే మహంతి గారి రచనని జీవితాంతం నెమరువేసుకుంటూ ఉంటారేమో.

పురిపండా గారు వాడిన కొన్ని మా ప్రాంతపు పదాలు చూడండి. 'మెడ్డెయ్యడం, గందిక, జల్లుకోవడం, సిర్ర, దీవి (దీవేసింది అంటే మా పక్క దిగులూ, బెంగా అనే అర్థం), సూదికొండ, సాపుచెయ్యడం, చపాయించడం (అంటే ఏదో ఎత్తుకు పారిపోవడం), పారొచ్చేడు....' నవలంతా ఇలాగే.

వీటన్నికీ ఆన్ లైన్ ఆంధ్రభారతి నిఘంటువులో అర్థాలు దొరుకుతాయి.

చిత్రం. ఆంధ్రభారతి వాళ్ళు కొన్ని పదాలకి అర్థాలు వివరిస్తూ పురిపండా వారి ఈ రచన నుంచే వాక్యాలు సంగ్రహించారు.

ఇది ప్రధానంగా కోదుల మన్యంలోని 'మిణి అపాయు', 'మిటిం', 'బందికార' అనే కుగ్రామాల్లో ఉంటున్న వాళ్ళ కథ.

కోదులకీ మతం ఉంది. Myths ఉన్నాయి. పైన ధర్మువు (సూర్యుడు) కింద ధర్తనీ (ధరిత్రి) ఉన్నాయి. పురోహితులున్నారు. పూజారులున్నారు. మంత్రాలు చదివి వ్యాధులు నయం చేసేవారున్నారు. గ్రామవాసులందరికీ పెద్ద (పెద్దబుర్ర) సాహొతా ఉన్నాడు.

ఈ సాహొతాలూ తమ తమ గ్రామ వాసుల గౌరవాల్ని అందుకున్నా సాధారణ రైతులే, వేటగాళ్ళే. ఆత్మలపై, పునర్జన్మలపై విశ్వాసాలున్నాయి. పులి భయం ఉంది. పూర్వం వాళ్ళలో నరబలి ఇచ్చే ఆచారం ఉండేది కానీ కథాకాలానికి అది కనుమరుగైంది. చిల్లంగి ఉంది. బారసాల మంత్రాలున్నాయి. తంతులూ తతంగాలూ ఉన్నాయి. విందులూ వినోదాలు అధికం. చిన్నా పెద్దా సంతలున్నాయి.

కథలో నాగరికసమాజపు సావుకార్లు, గవర్నమెంట్ అధికార్లూ వార్ని ఏంచేసేవారో ఎలాచూసేవారో తెలియచెప్పే వెన్నులో దడ పుట్టించే వివరాలున్నాయి.

ముఖ్యంగా కథనంలో 'కదం తొక్కుతూ పదం పాడుతూ హృదంతరాళం గర్జిస్తూ' రాసిన లయా, కోదుల జీవనవిధానానికి పట్టిన నిలువెత్తు దర్పణం ఉన్నాయి.

రచయిత close and fine observer గా నిలుస్తాడు. ఎక్కడా రచయిత judgment కనిపించదు.

ఇక కథలోకొద్దాం. కథాకేంద్రం 'మిణి అపాయు' అనే కోదు గోష్ఠి (గ్రామం). అయిదువందల కొంపల ఊరు.

దానికి అనుబంధంగా దగ్గిరున్న మిటిం, బందికార ఊళ్ళు.

కథలో పాత్రలన్నీ ప్రధానమైన పాత్రలుగా కనిపించినా సాహొతాల 'గాథల'కే ప్రాధాన్యత కనిపిస్తుంది.

సాహొతాలైనా మగవాళ్ళు ఆడవాళ్ళ విషయంలో కాస్త మొహమాటస్థులు.

స్త్రీ తనదైన భాషలో కాస్త ఇష్టం ప్రకటించినా ఒక అడుగు ముందుకేస్తారే గానీ రెండో అడుగు వెయ్యడానికి జంకుతారు.

ఈ విషయం స్పష్టంగా మనకి తెలుస్తుంది.

సరబు 'మిణి అపాయు' గోష్ఠికి సావొతా, ఎనభయ్యేళ్ళ వాడు.

(*Note*: ఇతను ఎనభయ్యేళ్ళ వాడనడంతో కొన్ని చిన్నచిన్న చిక్కులు ఎదురవుతాయి. అవి వ్యాసం పూర్తయాక చర్చిద్దాం.)

అతని కొడుకు దివుడు, కోడలు పుయు, కూతురు పుబులి, తమ్ముడు లెంజుకోదు.

అక్కడికి దగ్గర్లోనే (అంటే ఉదయం బయల్దేరితే నడుచుకుంటూ వెళ్ళి మళ్ళీ సాయంకాలానికి తిరిగొచ్చేంత దూరంలోనే)

ఉన్న ఇంకో రెండు కోదు గోష్ఠలు (గ్రామాలు) 'మిటిం', 'బందికార' ఉన్నాయి.

మొదటి అధ్యాయంలోనే సరబు చచ్చిపోతాడు. చనిపోయేముందు అతని స్వగతంలో ఎన్నో విషయాలు తెలియజేస్తాడు రచయిత.

కోదుల పల్లం భూములు పోయి వాళ్ళు కొండలెక్కారు. అంతా సర్వనాశనమైపోయింది. కానైతే ఎంత బాగున్నాయీ కొండలు, ఈ నేల. ఇక్కడి ఝోలాలు (గెడ్డలు). ఇక్కడి మాంసంలో రుచి ఉంది. సారాలో నిషా ఉంది. (Life is beautiful!). నా ఆత్మ మళ్ళీ ఇక్కడే పుట్టాలి అనుకుంటూ ఖాయిలా పడ్డ సరబు సావొతా ప్రాణాలు విడిచాడు.

అప్పటికి అతని కోడలు పుయు తొమ్మిదో నెల గర్భిణి. అంతా ఏడ్చారు. శవసంస్కారం జరిగింది.

మర్నాడు పుయు ఒక్కతే అడవిలోకి దుంపా దుగ్రా తెచ్చిందికి వెళ్ళింది. అడవిలోనే ఆమెకు నొప్పులొచ్చాయి.

బిడ్డని ప్రసవించి ఒక రాతిముక్కతో బొడ్డు కోసి కాసేపాగి గెడ్డలో స్నానం చేసి బిడ్డనెత్తుకొని (మగ బిడ్డ) ఇల్లు చేరుకుంది.

బిడ్డ ఏడ్చాడు. పుయు నవ్వింది.

దివుడు ఇప్పుడు సాహౌతా. దివుడుకి భార్యంటే ఏమంత అనురాగం లేదు. ఒకప్పుడున్నా ఇప్పుడు మందగించింది. ఆమెపట్ల విముఖుడయ్యాడు. ఏమూలో కాస్త జాలీ అభిమానం లేకపోలేదుగానీ ప్రేమ లేదు.

లెంజుకోదుకి అన్న పోయాక ఏదో అభద్రత. లెంజుకోదు భార్య (రుక్నీ) ఏనాడో పోయింది. తనో నలభయ్యేదేళ్ళ ఏకాకిప్పుడు.

పుబులుకి పుయుకి ఒకళ్ళంటే ఒకళ్ళకి వల్లమాలిన ప్రేమ. బిడ్డడు పుట్టినట్టు పుయు తన పుట్టినూరు 'మిటిం' గోష్ఠికి వర్తమానం పంపింది.

ఇటువంటి వార్తాహరి ఘర్షాముండా (ఇతన్ని బారికి అంటారు) అనే డొంబు జాతివాడు, ఈ గోష్ఠిలోనే ఉంటాడు.

ఊరి డిసారి (జ్యోతిష్కుడు) యోగం పెట్టాడు. బెజుణి (ఈమె మంత్రాలు చదువుతుంది) బిడ్డకి 'హాకినా' అని పేరు పెట్టింది.

మంత్రాలు చదివింది. ఒక్కొక్క పేరూ చదువుతూ అక్షింతలు విసిరింది.

ఏ పేరు పలుకుతున్నప్పుడు బియ్యం నిటారుగా నిలబడ్డాయో అదే బిడ్డ పేరు.

అంతా పండగ చేసుకున్నారు. సారా తాగారు. మాంసం తిన్నారు. పొగాకు పీల్చారు. ధాండీలూ (కోదు కన్యలు), ధాండాలూ (యువకులు) గెంతారు.

నాట్యాలు చేశారు.

## 2

**పు**ష్యమాసం పంటలు కోతకొచ్చిన వేళ కోదు గోష్ఠల్లో ఆనందం కన్నా సాహుకార్లొచ్చి పంటని ఎంతో చవగ్గా ఎగరేసుకుపోతారనే హడలే ఎక్కువ.

నిస్సహాయులు వాళ్ళు. శిస్తులకనీ, తనిఖీకనీ గవర్నమెంట్ వాళ్ళూ వస్తారు. వాళ్ళన్నా హడలే.

ఇదిగో ఇటువంటి వేళనే బేశుకోదు (మిటిం పెద్ద రఘు సాహొతా కొడుకు) పుబులుని చూడ్డానికి వస్తాడు.

ఇద్దరి మధ్యా సన్నగా ఏకాంతంలో కబుర్లూ, ఏదో కమామీషూ.

కోదు కన్యల్లో స్వాభిమానం ఆత్మగౌరవం మెండు. పురుషుల అదుపాజ్ఞల్లో వాళ్ళెప్పుడూ ఉండరు.

నచ్చిన యువకుడికి చేరువవుతారు, నచ్చకపోతే ఛీూడించిపారేస్తారు.

దివుడుకి తనకేం అక్కర్లేదో తెలుసు (పుయు అక్కర్లేదు) కానీ ఏంకావాలో తెలీదు.

ముందు సోనాదేయి.

(ఈమె డొంబు, డొంబు జాతి పని చెయ్యరు. దోపిడీలు చేస్తూ విశృంఖలంగా జీవించే తెగ. ఈమె భుర్షాముండా కోడలు, ఈమె భర్త బాలముండా ఒక చేతకాని దద్దమ్మ) వెనకపడతాడు. ఫలించదు. దివుడుకి తనకెవరుకావాలో తెలియదు.

సోనాదేయి వెనక లెంజుకోదు కూడా పడతాడు. అదీ ఫలించదు.

సోనాదేయి డొంబు జాతిది అవడంవల్లనో ఆమెకి ఒకానొకదశలో లెంజుకోదు నచ్చకపోవడంవల్లనో, ఏదో అటువంటి కారణమే ఉంది.

బందికార సాహొతా హోర్గుణా ముందు పుబులినే తనకు సరైన జోడీ అనుకుంటాడు. పుబులీ అలాగే అనుకుంటుంది.

అయితే హోర్గుణాకి ప్రేమని వ్యక్తపరచడం పండించుకోవడం ఆట్టే తెలీవు. చివర్లో పుబులిని బేశుకోదు 'ఉదులియా' (అంటే నచ్చిన స్త్రీని లేపుకెళ్ళిపోవడమే) పద్ధతిలో తీసుకెళ్ళిపోతాడు.

మిణి అపాయు గ్రామస్థులకి, ముఖ్యంగా దివుడుకి కోపం వచ్చినా అది తాటాకు మంటే. ఏమీ అవదు. కోదు సమాజంలో స్త్రీ ఇచ్ఛకి విలువ జాస్తి.

సోనాదేయితో బెడిసికొట్టిన తరవాత దివుడు పియోటి (ఈమె కోదుదే అయినా కొన్నేళ్ళు పల్లంలో తెలుగు భూముల్లో గడిపింది) వెనక ప్రణయతప్తుడై

పడతాడు. అది ఫలిస్తుంది, ఎలా అంటే పియోటి తల్లి అంతా పసిగట్టి అడ్డుకొని కూతురి భద్రతకై క్షేమానికై ఎన్నో ప్రశ్నలడిగీ ఎన్నో వాగ్దానాలు పుచ్చుకుంటుంది. కోదు తల్లులు కూతుర్ల తల్లులు.

నెలలబిడ్డడు చేతిలో ఉన్న పుయు మొగుడు రెండో పెళ్ళాన్ని ఇంటికి తేవడంతో పుయు హతాశురాలై మూర్ఛపోయి మరి ఇంటికి వెళ్ళదు.

ఎంతమంది ఎంత సర్ది చెప్పినా వినదు. హాకినాని ఎత్తుకొని పుట్టింటి వేపు ప్రయాణం కడుతుంది. ఏదో గొణుక్కుంటుంది.

'జీవితంలో రుచి ఉంది. చావులేదు. దుఃఖం లేదు.'

ఇదే నవలలో ఆఖరి వాక్యం!

ఇందులో జంటల కథ నేను త్వరత్వరగా చెప్పేశాను కానీ ఇదంతా జరగడానికి నవలాకాలం (అంటే దాదాపు పది నెలలు) పడుతుంది.

## 3

**కో**దుగోష్ఠుల్లో కేవలం ఆడామగా మధ్య ప్రణయసంబంధాలే కాదు. పొలాల సాగు ఉంది. వేటలున్నాయి. సంతలున్నాయి.

సాహుకార్లు రావడం, వాళ్ళు పంటని ముందస్తుగానే చవగ్గా బేరం చేసుకొని తీసుకుపోవడం ఉన్నాయి. సావుకార్లు బేరసారాలకొచ్చినప్పుడు చిన్నచిన్న జాగర్తలు తీసుకుంటారు. సావొంతాలకి చుట్ట ఇచ్చి వెలిగించడం, కోదుపడుచులపై కన్నెత్తి చూడకపోవడం వంటివి. దివుడు చవక బేరంకి పడిపోయి ఒప్పేసుకుని పంటని అమ్మేసుకున్నా హార్గుణా చూద్దాంలే అని దాటేస్తాడు. హార్గుణాకి ఇటువంటి విషయాల్లో కాస్త తెలివి హెచ్చు. తనకి పల్లంలో మేనమామ ఇల్లు ఎరిక ఉంది మరి.

ప్రతియేడూ శిస్తులకీ తనిఖీకి వచ్చే ఫారెస్టు ఆఫీసరు (ఫారాస్థీ) ఆ ఏడూ వచ్చాడు. మామూలుగా కాదు, బందోబస్తుతో కాయితాలతో.

కోదులకి కాయితాలంటే హడలు, భయం. తెలివైన ఆ ఫారాస్థీ సంచిలో ఓ బొమ్మ ఉంది. అది తిరపతి దేవుడు.

దానిమీద ప్రమాణం చేయించి (కోదులు అబద్ధం ఆడరు. ప్రమాణం చేయిస్తే అసలే ఆడరు) ఎవరు ఎంత అడవిని సాగు చేసారో ఎంత పంట పండిందో, ఎంత అడవి కాలిందో లెక్కలన్నీ వాళ్ళ నోటితోనే కక్కిస్తాడు. వివరాలు చూడండి.

వస్తూవస్తూనే

'ఏంరా లంజికొడుకులూ మీరు అడివికొట్టేసి నన్ను ఎండలో పరిగెత్తిస్తార్రా? ఉండండి మీ పని పట్టిస్తాను.

ఏంరా సావొతా లంజికొడకా! కొత్తగా సావొతా అయావని అడివంతా కొట్టేసి పనివాడితనం చూపిస్తున్నావుకదూ! ఉండు ఉండు. డొంబుని నీనెత్తి మీద సావొతాచేసి కూచోబెడతాను చూద్దువుకాని."

అంటాడు.

ఆ గద్దింపుని కోదులు ఇంకోలా అర్థంచేసుకుంటారు.

ఆ అర్థం ఏమిటంటే

'అన్నీ సిద్ధంచేశారా? తిండీ బసా మామూళ్ళూ – వీటిలో ఏమీ ఇబ్బంది ఉండదు కదా? సన్న బియ్యం, మంచి కమ్మని నెయ్యి, మేకా, కోళ్ళూ జాగ్రత్తచేశారా?'

ఆ దృశ్యానికే ఆడాళ్ళు దాక్కున్నారు. పిల్లలు పారిపోయారు. పెద్దలు నానాసేవలూ చేస్తూ అధికారి కాళ్ళావేళ్ళా పడ్డారు. మెత్తబడతాడా అధికారి?

'సాలా లంజికొడకా ఏంరా ఏమిటి నరికావురా? ఏం రా జంతువుల్ని చంపావురా?"

అధికారి దగ్గర అన్ని లెక్కలూ ఉన్నాయి. గారదు (అధికారి అసిస్టెంట్) లెక్కలన్నీ ఏకరువు పెట్టాడు.

బెజుణి దివ్యదృష్టినీ, డిసారి చుక్కలలెక్కనీ మించిపోయిందీ లెక్క.

ఆ రాత్రికి అక్కడే విడిది చేసి మర్నాడు తన అసలు పని మొదలెట్టాడు అధికారి. అన్నాడు.

"వినండి కోదులూ. మీరంతా నీళ్ళుపోసుకు వచ్చారు. ఒక్కొక్కరూ వెళ్ళి తిరపతి దేవుడి తలమీద చెయ్యేసి ఎవళ్ళు ఎక్కడ ఎంత అడివి కొట్టారో స్పష్టంగా చెప్పెయ్యండి."

కోదులంతా నిశ్శబ్దం. చడీచప్పుడూ లేదు. గుప్‌చిప్. అనుకున్న ఆపద వచ్చేసింది. దేవుణ్ణి ముట్టుకొని ఎలా ప్రమాణం చేస్తాం అనుకుంటారు.

అధికారి ఒత్తిడి తేగానే ఒక కోదు (జాంబా కోదు) అరిచాడు.

'మహాప్రూ, మహాప్రూ, నీ ఉచ్చా పియ్యా తింటాను మహాప్రూ.'

ఇంత మాటన్నా అధికారి అధికారే. ప్రమాణాలు చేయించి విషయాలు వెళ్ళగక్కించీ వివరాలు రాసుకొని నష్టపరిహారం లెక్కలువేసాడు అధికారి.

కావుళ్ళు కావుళ్ళు దినుసులు తెచ్చిస్తున్నారు కోదులు. అయినా నష్టపరిహారం లెక్క వొదల్లేదు అధికారి. ఏదో రాసేస్తానని కోర్టు భయం చూపించాడు.

చివరికి కోదులు తమ రెండుగదుల ఇళ్ళల్లోని రెండోగది (చీకటిగది)లో వెదురుబొంగులో ప్రాణప్రదంగా దాచుకున్న ఖజానాని తెరిచి, గొట్టం తెరవడానికి చేతులు రాక, కన్నీటి ధారలు కారి తప్పనిసరై తమ తమ పెన్నిధిని అధికారికి రూపాయలుగా సమర్పించుకున్నారు.

అధికారి రశీదులు ఇచ్చాడు.

కోదు చదవలేడు.

అధికారి తను వెళ్ళేముందు ఒక పరక (అర్ధణా) పారేసి అన్నాడు.

"ఇందరా సాలా సావొతా! ఇనాం పుచ్చుకో. కాకపోతే ఎవడైనా వస్తే 'మేం ఇది ఇచ్చాం అది ఇచ్చాం, ఇనాం డబ్బులు ఇచ్చాడుకాదు, వెళ్ళిపోయాడు ఫారాస్థీ' అని చాటతావు, లంజకొడకా"

వెళ్ళిపోయాడు అధికారి.

వనరులున్న అమాయకుల్ని దోపిడీచేసే అవకాశం వస్తే అందరూ చేసేవాళ్ళే.

ఆ చేసేదికూడా వాళ్ళ ఎంగిలి తింటూ వాళ్ళని తిడుతూ తన్నుతూ వాళ్ళ సంవత్సరకాల కష్టాన్ని ఆబగా ఆశగా దొబ్బుకుపోయి ఓ పరక (అర్ధణా) వాళ్ళమొహాన కొట్టడం! తిట్టడం!

ఎంతో సహజమైన చిత్రీకరణలతో విలక్షణమైన, విశిష్టమైన మహాగ్రంథమీ అమృతసంతానం.

ధన్యులు శ్రీ మహంతి గారు. ధన్యులు శ్రీ పురిపండా గారు.

ఫలశ్రుతి? మీరే చెప్పాలి. నవల చదివి చెప్పండి.

*Note:*

నేనో చిన్న వివరణ ఇచ్చుకోవాలి. సమీక్షలో సరబు సావొంతా ఎనభైయేళ్ళవాడనడంతో చిన్నచిక్కు ఎదురౌతోంది అని రాశాను.

అదేంటంటే తనకి ఎనభైయేళ్ళయితే తన తమ్ముడు లెంజుకోదుకి నలభైయ్యేదేళ్ళేనా? అంటే అన్నదమ్ములికి ముప్ఫయ్యేదేళ్ళ ఎడముందా? తన కొడుకు దివుడూ, కూతురు పుబులీ చిన్నవాళ్ళే, కథాకాలానికి.

రచయిత చెప్పినదాని ప్రకారం చూస్తే వాళ్ళంతా ఇరవైయేళ్ళకే పెళ్ళిళ్ళు చేసుకునేవారు. ఎక్కడా ఎవరూ ఏ రెండో భార్యకో పుట్టినట్టూ లేదు. ఈ చిక్కుంది.

1-7-2017

## శ్రుతకీర్తి

# కళ్లకు కట్టిన సుఖదుఃఖాలు

**ఒ**రిస్సా కొండ ప్రాంతాలలో నివసించే కోదుల జీవిత విధానం, వారి కష్టసుఃఖాలను కళ్ళకు కట్టినట్టు చిత్రించిన పుస్తకం అమృతసంతానం. ఇది చదివినంత సేపు కోదుల జీవితంలో మనమూ భాగస్థులమౌతాం. వాళ్ళతో పాటు అడవి అందాలను ఆస్వాదిస్తూ ఆడిపాడుతాం, ప్రమాదాల్లో భయంతో వణికి పోతాం, వారి జ్వరాలను బాధలను చూసి ఏడ్చేస్తాం, వారికి జరిగే అన్యాయాన్ని దోపిడీని చూసి మన పిడికిళ్ళు బిగిస్తాం, వారి ధైర్య సహనాలకు మోకరిల్లుతాం, వారి అమాయకత్వానికి జాలిపడుతాం.

కెరటాల్లా కనబడుతున్న సూదిసూది పర్వతాలూ, లోతుల్లో లోయల మధ్య భీకరారణ్యాలలో నాలుగువేల అడుగుల ఎత్తున అతి ప్రాచీన కోదు గ్రామాలు వున్నాయి. వారి భాష కుభి. కోదు కష్టించి పనిచేసే ఆత్మాభిమానం కల రైతు. ఎవరికి ఆపదవచ్చినా గ్రామానికి ఆపదే అనుకుని సమిష్టిగా ఎదుర్కుంటాడు. వ్యక్తి సుఖంగా వుంటే గోష్ఠి సుఖంగా వుంటుందనే నమ్మకం కోదుది. మన్యం కొండలా ఉన్నతమైన వాడు, ఆకాశంలా ఉదారుడు కోదన్న.

కోదు గ్రామనాయకుడు 'సావోతా'. ఇతని సేవకుడు, అనుచరుడు 'బారికి'. చుక్కల లెక్కలు చూసి యోగం (ముహూర్తం) నిర్ణయించే వాడు 'డిసారి'. నృత్యం చేస్తూ అన్ని పూజలూ నిర్వహించేది 'బెజుణి'. ప్రాణాలు అడ్డేసైనా తమ విధులను సక్రమంగా నిర్వహిస్తారు వీరందరూ. జీవనం కంటే సంస్కృతే గొప్పదని భావిస్తాడు

కోదు. జీవనం ఒక మనిషిది. సంస్కృతి లక్షల మందిది. తనవెనుక వొక జాతితాలూకు సంస్కృతి చరిత్ర వుంది అని నమ్మకాలను, పద్ధతులను నిష్టగా పాటిస్తాడు. ఏ కష్టంలో అయినా ఆదుకోడానికి మీద దర్మ (ధర్మదేవత ), కింద దర్తని (భూమి) దేవతలున్నారని నమ్ముతాడు కోదు.

ఋతువులను బట్టి అనేక పండగలు జరుపుకుంటారు కోదులు. పుష్యమాసం చివర్లో మెరియా పూజలో ఊరికి మంచి జరగాలను బలి ఇస్తారు. ఒకపుడు నరబలి చేసేవారట, ఇపుడు పంది అది లేకపోతే ఎలుక రక్తంతో 'దర్మ', 'దర్తని'లను ప్రసన్నం చేసుకుంటారు. ఆషాడం వెళ్ళి పోయే సమయంలో పులిదేవతను శాంతింప చేయటానికి మామిడిటెంకలు చిదక్కొట్టే పండగ చేస్తారు. దీనితో మనుషులు, పశువులను పులి ఎత్తుకుపోడం ఆపుతుందని వాళ్ళ నమ్మకం. వ్యవసాయం పనులు బాలీపూజ చేసి మొదలు పెడ్తారు, కోతలు అయ్యాక వచ్చే ఆటవిడుపు చైత్రంపండగ సరదాల సమయం. ప్రతి పండగలో మాంసం, ఇప్పపూలతో వండిన సారా, కల్లులతో విందులు చేసి రాత్రంతా నాట్యం చేస్తారు. ఆట పాటలతో సందడి చేస్తారు. ధాండీ, ధాండాల (పెళ్ళి కాని యువతీ యువకులు) సరదాలకు పండగల్లో ఎంతో స్వేచ్ఛ దొరుకుతుంది. వేట కూడా పండగల్లో భాగమే.

కొందులకు మరో సరదా సంత. వేరు వేరు ఊర్ల ధాండాలు, ధాండీలు గుంపులు గుంపులు గా సంతకు బయలు దేరుతారు. నిజానికి సంత ఒక వంకనే, సరైన జోడీ దొరకొచ్చు లేదా అందరితో సరదాగా గడపొచ్చని ఎంతో దూరాలు ప్రయాసకోర్చి వెళ్తారు. వాళ్ళ సంభాషణ అంతా పాటల రూపంలోనే వుంటుంది. ఒక గుంపు పాట వినగానే మరో గుంపు సమాధానం పాటలోనే ఇస్తుంది. రంగు రంగుల బాట సంతదారి. రంగుల రాజ్యం సంత.

కోదుల పెళ్ళి విషయానికి వస్తే ధాండా, ధాండీ ని మెప్పించి పెళ్ళికి ఒప్పించాలి. తుది నిర్ణయం అమ్మాయిదే. తను ఒప్పుకున్నాక వాళ్ళ ఇంటివాళ్ళకి కన్యాశుల్కం ఇచ్చి పెళ్ళి చేసుకోవాలి. ప్రేమజంట చెప్పకుండా వెళ్ళిపోతే ఉదూలియా (రాక్షస వివాహం) అంటారు. పెళ్ళిలో సరదా అంతా ఇంతా కాదు. పెళ్ళికైనా, బిడ్డపుట్టినా ఎన్నో బహుమతులతో పాటలు పాడుతూ గుంపులు

గుంపులుగా పుట్టింటినుండి అతిథులు వస్తారు ఊర్లోకి. ఆ పాటలకు పాటలతోనే సమాధానమిస్తూ బాజాభజంత్రీలతో ఆహ్వానిస్తారు ఊరి వాళ్ళంతా. పాట పండగల్లోనే కాదు వారి జీవితంలో భాగంగా వుంటుంది. కోదులకు అతిథి మర్యాదలు చాలా ఎక్కువ. ఊరంతా కలిసి గౌరవించి వారికి విందు ఇస్తారు. ఎన్నో కబుర్లు చెప్పుకుంటారు. అతిథి మర్యాద వాళ్ళనుండి నేర్చుకోవలసిందే .

కోదుల ప్రధాన వృత్తి వ్యవసాయం. అడవిని నరికి కాల్చి భూమిని సాగు చేయడాన్ని పోడు చేయడం అంటారు. పాత భూమితో పాటు కొత్తగా పోడు చేసిన భూమిలో ఎంతో కష్టించి పంటలు పండిస్తాడు కోదు.కానీ అతనికి మిగిలేది చాలా తక్కువ. సంతకు వెళ్ళి తను అమ్మేవి పెద్దకుంచంతో, కొనేవి చిన్నకుంచంతో. పంటచేతికి రాకముందే షాహుకార్లు వచ్చి మాయమాటలు చెప్పి అతి తక్కువ ధరకు వొప్పించి బయానా ఇచ్చిపోతారు. ఫారెస్టరు, అమీను లాంటి ఆఫీసర్లు వచ్చి పోడు చేయడం, వేట నేరమనీ బెదిరించి హింసించి వాళ్ళ దగ్గర్నుండి పశువులూ, ధాన్యం, పళ్ళే కాక డబ్బులు కూడా వసూలు చేసి ఊర్ని కుదేలు చేసి పోతారు. ఆఫీసర్ల వేధింపులు, పులి భయం, ఆపకుండా పడే భారీ వానలతో జ్వరాలతో చాలా బాధలు పడుతాడు కోదు. కానీ ధైర్యం కోల్పోడు. ఏదన్నా సందేహం వస్తే తీరేదాకా ప్రయత్నిస్తూనే వూంటాడు. తీరకపోతే దిగులుపడతాడు. ఆ ప్రయత్నమే అనేక కష్టాలనుండి ప్రమాదాల నుండి కాపాడుతుంది. ఆపద గడిచిపోతే ఆపకుండా నవ్వుతాడు కోదు.

> ‘ఒకపుడు కోదులు రాజులుగా ఉన్నపుడు యుద్ధం చేసేవాళ్ళు. యుద్ధం గురుతులు బాజాలున్నాయి, నాట్యముంది, యుద్ధం లేదు. పెట్టుబడిదార్ల అన్యాయాలు ఎదిరించటానికి కోదులకి తగిన సర్దారు రాముడు దొరికాడు. చెదురు మొదురుగా వున్న కోదులను దగ్గరికి చేర్చి పెట్టుబడిదారి సభ్యతను ఎదిరించి యుద్ధం చేశారు. దాన్ని తలకిందులు చేసారు. తరువాత ఆ దరిద్రనాయకులే రాజులయి తిరిగి అదే పెట్టుబడిదారి సభ్యత స్థాపించారు.”

అని వృద్ధసాహౌతా తను విన్న విషయాలు, కోదు జాతి చరిత్రను తలుచు కుంటాడు.

ఆరువందల పేజీల అమృత సంతానంలో ఇలా అంతర్లీనంగా కోదుల సంస్కృతి, జీవనవిధానం చూపిస్తూ ఒక సాహౌతా కుటుంబం చుట్టూ అల్లుకున్న కథ వుంది.

మిణి అపాయ అనే గ్రామపు సాహౌతా సరబు. అతని కొడుకు దివుడు, కోడలు పుయు, కూతురు పుబిలి , తమ్ముడు లెంజు. ఎనభై ఏళ్ళ సరబు సాహౌతా మరణంతో కథ ప్రారంభమౌతుంది. తండ్రిపోయాక దివుడు సాహౌతా అవుతాడు.

అడవిలో దుంపలు తవ్వుకు రావడానికి వెళ్ళి , ఒంటరిగా బిడ్డను కని దారిలో ఏటిలో శుభ్రపరుచుకొని ఊర్లోకి వచ్చి అందరినీ ఆశ్చర్య పరిచిన ధైర్యవంతురాలు పుయు. బిడ్డతోనే లోకంగా వున్న పుయు నెమ్మదిగా భర్త ప్రేమకు దూరమవుతుంది. ఎంత ప్రయత్నించినా ఒకప్పుడు వున్న బంధం వారి మధ్య తిరిగి ఏర్పడదు. దివుడు తాగుడుకు, బారికి కోడలు సోనాదేయికి ఆకర్షితుడవుతుంటాడు .

పుబులిని పక్క ఊరు బందీకార సాహౌతా హోర్గుణాకు ఇచ్చి పెళ్ళి చేయాలనుకునేవారు రెండు గ్రామాల వారు. పుబులి అతనికోసం కలలు కంటూ ఎదురు చూస్తుంది. అతనికీ ఆమె అంటే ఆకర్షణే. కానీ వ్యవసాయం వృద్ధి చేయాలి, బండి కొనాలి, సభ్య సమాజంలో లాంటి ఇల్లు కట్టుకోవాలి అనే ధ్యాసలో పడి ఎటుపోతుందిలే పుబులి అని పెద్దగా పట్టించుకోదు. పుయు కి బిడ్డపుట్టిందని పుట్టిన వూరు మిటిం నుండి చూడడానికి వచ్చిన గుంపులోని దేశుకోదు పుబులిని ఆకర్షించి మెప్పించి ఉదులియా తీసుకెళ్ళి పెళ్ళి చేసుకుంటాడు

లెంజుకోదుకు పెళ్ళైన కొత్తలోనే భార్యను పులి ఎత్తుకు పోయింది. భర్తను పులి ఎత్తుకు పోయిన యువతిని మాత్రమే అతను పెళ్ళిచేసుకోవచ్చు. అలా దొరకక అవివాహితుడుగా వుండిపోయి అన్నకుటుంబంతో కలిసివుండేవాడు. అన్న వున్నన్ని రోజులూ ఆప్యాయంగా వున్న అతను తర్వాత దివుని మీద కోపం పెంచుకుంటూ వుంటాడు. తన కంటే చిన్నవాడు సాహౌతా అయి తనను చిన్నచూపు చూస్తున్నాడని బాధపడేవాడు. ఒంటరితనంతో, తీరని కోరికలతో బాధపడి ఆత్మన్యూనతకు లోనవుతాడు. డొంబు జాతికి చెందిన సోనాబాయితో చనువుగా వుంటున్నాడని లెంజుదద్దిని ఊరినుండి వెళ్ళగొడతాడు దివుడు సాహౌతా. అంత

నిర్మలమైన అడవిబిడ్డల్లో కూడా కుల వివక్ష బాధించే విషయమే. అందరితో పాటు సమానంగా పనిచేసుకొని బతికే సామాన్యమైన సాహౌతా కొన్ని సార్లు జనాలపై తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమూ మనసును ఇబ్బంది పెడుతుంది. కానీ అలా హీనంగా చూసినందుకు తనకోసం వచ్చిన దివుణ్ణే తిరస్కరిస్తుంది సోనాబాయి. అవమానంతో కుంగిపోయి కాస్త నెమ్మదిస్తాడు ఆ సంఘటనతో దివుడు.

చిన్నతనంలోనే తల్లిదండ్రులతో తెలుగుదేశానికి వలసవెళ్ళిన పియోటి , తండ్రి మరణంతో తల్లితో పాటు సొంత ఊరు బందీకారకు చేరుకుంటుంది. నాగరికత అలవాటైన ఆమె కోదులతో కలిసి వారిలా పూసలు, పూలు అలంకరించుకొని వారిలా పనులు చెస్తూ బతకడానికి చాలా ఇబ్బంది పడుతుంది. హోర్గుణా సాహౌతాను ఆకర్షించటానికి ప్రయత్నించి విఫలమయి, దివుడు సాహౌతాతో నిజంగా ప్రేమలో పడుతుంది. పియోటిని ఎంతగానో ప్రేమించి భార్యగా ఇంటికి తీసుకొస్తాడు దివుడు. అది చూసిన పియు కుప్పకూలిపోతుంది. తనకోసం ఏమీ వద్దు కాని తన కొడుకు కోసం అన్నీ కావాలి. ఇంత నిరాదరణ లో ఎలా మనిషవుతాడు తన హాకినా అని ఆలోచిస్తుంది. దుఃఖం నిండిన ఆమె సంకల్పంలో దేవతల ఉజ్వలరూపం సన్నిధానమయింది. గుండె లోతుల్లో తన ప్రశ్నలకు సమాధానం దొరికింది. 'చీకటి తర్వాత వెలుగొస్తుంది.' బతికుండాలనే మానవ సహజమైన ప్రవృత్తి పరాజయం స్వీకరించదు. చచ్చిందాకా ఓటమిలేదు. కథ మారలేదు కానీ ఆమె లోపల జవాబు దొరికింది. కుదుటపడిందామె. హాకినాను ఒళ్ళో పెట్టుకొని శాంతి పొందింది. బిడ్డ కోసం శక్తి తెచ్చుకొని, ఇద్దరు భార్యలలో ఒక దానిలా పడివుండకుండా తన కాళ్ళమీద తను ధైర్యంగా నిలబడగలనని నిర్ణయించుకోవడంతో పుస్తకం ముగుస్తుంది.

ఇలా కోదుల సంస్కృతినే కాకుండా వివిధ వ్యక్తుల మధ్య బంధాలనూ, వారిలో అంతస్సంఘర్షణనూ , తాత్వికచింతననూ కూడా ఎంతో అద్భుతంగా చూపించారు గోపీనాథ మహాంతి.

22-7-2017

## నరుకుర్తి శ్రీధర్
## ఏ పురాతన దుఃఖమో కమ్మేసింది

**చా**లా రోజుల తరువాత ఆరొందల పేజీల పైచిలుకు పుస్తకం , అదీ jpg నించి pdf కి మార్చ బడిన పుస్తకం, పూర్తి చేసాను. ఎంతో ఇష్ట పడితే తప్ప చేయలేని పని. ఇంచు మించు డెబ్బై ఏళ్ల క్రితం ఒరియా లో గోపీనాథ మొహంతి చే రాయబడి , 1954 లోనే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన పుస్తకం. ఈ పుస్తకాన్ని పురిపండా అప్పలస్వామి గారు తెలుగు లోకి అనువదిస్తే, 1963 లో మా రాజమండ్రి లోనే ముద్రించారు. నాకీ పుస్తకాన్ని పరిచయం చేసింది చినవీరభద్రుడు గారి facebook పోస్ట్. కథానిలయం లోని హార్డ్ కాపీ ని pdf గా చేయించారు. ఈ మధ్యనే సాహిత్య అకాడమీ వారు Dynasty of immortals అని ఇంగ్లీష్ లోకి అనువదింప చేసారు. ఇంకా మార్కెట్లో దొరుకుతున్నట్లు లేదు. సమీక్ష రాస్తే, చినవీరభద్రుడుగారు ఇస్తానన్న బహుమతి కోసం కాక పోయినా, నా అనుభూతి పంచుకుందామనే కోర్కె తోనే ఇది రాస్తున్నాను. అంత గొప్ప పుస్తకాన్ని సమీక్ష చేసేటంత జ్ఞానం గానీ, భాష గానీ నాకు లేదు. అందుకే దీన్ని సమీక్ష అనే కంటే 'నాకర్థమయిందేదో.. అది' అంటే సరిపోతుంది. అంతా ఒక్కసారే రాయలేను కాబట్టి చిన్న చిన్న భాగాలుగా రాస్తాను.

ఈ పుస్తకం కల్పన అనలేము. రచయిత తాను చూసిన గిరిజన సంస్కృతి ని, మనిషి జీవితం లోని వివిధ సందర్భాల్నీ, ఆకాంక్షలనీ, అనుభవాలనే (చావు-పుట్టుక-పెళ్లి-పండగ-సంబరం-వియోగం-పర సంస్కృతీ సంపర్కం)

వస్తువుగా...తూర్పు కనుమలూ, దట్టమైన అరణ్యాలనే కాన్వాస్ గా ... మారుతున్న ఋతువులనే కుంచె గా ... తీసుకుని, ఆవిష్కరించడానికి చేసిన ప్రయత్నం అని చెప్పవచ్చేమో! ఆ ప్రయత్నంలో రచయిత ఎక్కడా పాత్రలపై సానుభూతిని ప్రదర్శించడు. సంఘటనలలో నాటకీయత కోసం ప్రయత్నించడు. సాధారణ జీవితం లోని నాటకీయత నే చదవగలిగేలా రాయడం రచయిత గొప్పదనమే! అనువాదం ఒక్కో సారి శ్రీకాకుళం మాండలికం లోనూ , ఒక్కోసారి ప్రామాణిక భాష లోనూ నడుస్తున్నట్టనిపించినా, పాఠకుడి అనుభూతిని తగ్గించలేదనే అనిపించింది. అనువాదకుని పురాతన కథాశిల్పం, కీ.రాజనారాయణ రాసిన 'గోపల్లె' ని అనువదించిన నంద్యాల నారాయణ రెడ్డిగారి శైలిని గుర్తు చేస్తుంది.

ఈ పుస్తకం చదువుతున్నప్పుడు గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్ రాసిన One Hundred Years of Solitude (1967) చదువుతున్నప్పటి అనుభూతి కలిగింది. నిజానికి దానిలా ఇది మాజికల్ రియలిజం కాదు కాని, ఏదో మేజిక్ మాత్రం ఉంది. లేకపోతే, ఒరిస్సా, ఆంధ్ర సరిహద్దుల మధ్య నివసించే ఒక కొండ జాతి (కోదు) మనుషుల జీవనం పై , ఎటువంటి నాటకీయతా లేకుండా రాసిన ఆరొందల పేజీల పుస్తకం నన్నెలా చదివింప చేస్తుంది? గొప్ప రచయిత, కవి కూడా అయి ఉంటాడని నేనను కుంటాను. తూర్పు కనుమల్లో ఎక్కడో మారుమూల గిరిజన గ్రామాల ప్రజల జీవన విధానాన్ని , ఋతువులతో బాటు మారే వారి వృత్తులనీ, ప్రవృత్తులనీ, చిత్తవృత్తులనీ నేపథ్యంగా తీసుకుని ఆవిష్కరించేవాడు. కవి కాక ఎవడు?

**అమృత సంతానం : చావు**

'మణిఅపాయి' గ్రామం లోని 'మణి అకా' గోత్రానికి చెంది, 'కుభి' భాష (తెలుగు లాగే మధ్య ద్రావిడభాష అని గుర్తు) మాట్లాడే 'సరబు' సావోతా (గ్రామ పెద్ద) మరణం తో కథ ప్రారంభమవుతుంది. విచిత్రమేమిటంటే, మొదటి అధ్యాయం లోనే చనిపోయినా , సరబు సావోతా వ్యక్తిత్వం మాత్రం పురాతన గిరిజన సంస్కృతీ సౌరభాల్ని వెదజల్లుతూ పుస్తకమంతా పరుచుకునే ఉంటుంది. ఈ గ్రంథానికి అతనే కథానాయకుడనిపిస్తుంది. చావు ముంగిట్లో, సరబు సావోతాకి పురాతన గాథలన్నీ గుర్తుకొస్తాయి. రామాయణంపై ఇప్పటి వరకూ నేనెప్పుడూ చదవని ఒక దృష్టి కోణం నన్ను ఆశ్చర్యానికి లోనుచేసింది.. రాముడిని పేద ప్రజల

తరపున పోరాడిని వాడిగా, గిరిజనుల్లో ఉన్న నమ్మకాన్ని రచయిత ప్రస్తావిస్తాడు.

చనిపోయిన వ్యక్తి డుమా (ఆత్మ) మళ్లీ మనిషిగా పుడుతుందని 'కోదు' పూర్తిగా నమ్ముతాడు. సరబు సావోతా మనవడు (హాకినా), 'సరబు డుమా' గా గిరిజన గోష్ఠి (సంఘం) నమ్ముతుంది. (ఆంధ్రుల్లో విస్తృతంగా ఉన్న, తాత పేరు మనవడికి పెట్టుకునే ఆచారం ఇలాంటిదే అయ్యుంటుంది.) ముంచుకొస్తున్న చావు సరబు సావోతాని తాత్వికుడిగా మారుస్తుంది. 'పోతే పోయింది. ఇది పాతపడిపోయింది. పనికిరాని శరీరం. దీన్ని పారేసి మరొకసారి పుట్టడం మంచిది. పుట్టడం మనచేతిలో మాట. కనక విచారం లేదు' . (రామాయణ కాలం నుంచీ ఉన్న 'కోదు' కి గీతాసారం తెలియడంలో ఆశ్చర్యం లేదేమో!) ఇదే 'కోదు' ధైర్యం. 'కోదు' కి మరణం లేదు. బహుశా రచయిత ఈ గ్రంథానికి 'అమృత సంతానం' అని పేరు పెట్టింది ఇందుకే కావచ్చు.

4-8-2017

# 2

## అమృత సంతానం : పుట్టుక-పెళ్లి-సంబరం

### పుట్టుక

సరబు చనిపోయిన తరువాత,అతని కొడుకు దివుడు, సావోతా (గ్రామ పెద్ద) అవుతాడు. దివుడి భార్య 'పుయు'. నిండు గర్భిణి గా అడవికి వెళుతుంది. తొమ్మిది నెలల నిండు చూలాలామె. అలికిడి లేని అడవి. పైన ధర్ము (సూర్యుడు) ఉన్నాడు. కింద 'దర్తనీ' ఉంది. ఆదిదేవుళ్ళు. అందుకే పుయు కి భయం లేదు. కడుపులో ఉన్న జీవి ఎన్నాళ్ళ నుంచో తోడుగా ఉంది. నొప్పులు ప్రారంభమయ్యాయి. పిలిస్తే పలికే దిక్కు లేదు. భయం పీకల దాక వచ్చినా గుండె రాయి చేసుకుంది పుయు. ప్రకృతితో యుద్ధం చేయందే మనిషికి ఏది దొరకదు. తన యుద్ధం తానే చేయాలి.

ఆ దుర్గామారణ్యంలో నాలుగు వేల అడుగుల ఎత్తు కొండపై కొత్తగా కోదు బిడ్డ పుడుతుంది. పుయుకి వినికిడి వల్ల, చూడడం వల్ల ఎన్నో విషయాలు

తెలుసు. ఒక రాతిముక్క తీసుకుని పిల్లాడి బొడ్డు కోస్తుంది. తెలిసిన మందు ఆకు పసరు పూస్తుంది. ఒక మందు వేరు తానూ తిని పిల్లాడికి కొంచెం నాకించి, ఏటిలో శుచీ శుభ్రమై ఇంటికి బయలు దేరుతుంది.

'బెజుణి' (మంత్రసాని/మంత్రగత్తె) పిల్లాడికి పేరు పెడుతుంది. సరబు సావోతా మళ్ళీ పుట్టాడని కోదు గోష్ఠి (సంఘం) నమ్ముతుంది.

నిజానికి ఇదంతా నవలలో ఒక కవిత్వంలా నడుస్తుంది. రచయితతో బాటే పాత్రలూ , పాఠకుడూ ప్రకృతిలో మమేకమై విస్మయాశ్చర్యాలకి లోనవుతారు.

## పెళ్లి-సంబరం

కోదు సంస్కృతిలో పెళ్లి పూర్తిగా ధాండీ (కుర్రది) ఇష్టం. ధాండీకి నచ్చక పోతే ఇక అంతే. ధాండా (కుర్రాడు), ధాండీలు పెళ్ళికి ముందే వెన్నెల రాత్రుల్లో కలుసుకోవడం అత్యంత సహజం. రాక్షస వివాహం (ఉదూలియా) కూడా సమ్మత మైన వివాహ పద్ధతే! కోదు సంస్కృతిలో విడాకులు కూడా సహజ విషయమే. పిల్లలు తండ్రి బాధ్యత. (అత్యంత సహజమైన ఈ పద్ధతి మన ఆధునిక సమాజం నించి ఎప్పుడు మాయమైంది?)

దివుడు చెల్లి పుబులి. పుబులికి బందికార గ్రామ సావోత అయిన హోర్గుణా కిచ్చి పెళ్లి చేయాలని చిన్నప్పుడే నిర్ణయిస్తారు. పుబులి మనసులో బేశుకోదు ఉంటాడు. అన్నకి చెప్పకుండా పుబులి, బేశుకోదుతో ఉదూలియ(లేచిపోవడం అనాలేమో!) వెళ్ళిపోతుంది. అన్న కోపంతో ఊగిపోతూ బేశు కోదు గ్రామం (మిటిం) పై దండెత్తి అందరినీ నరుకుదాం అంటాడు. గ్రామ పెద్దలు, తోటి ధాండాలు అతన్ని వ్యతిరేకిస్తారు. ఉదూలియ (రాక్షస వివాహం) కోదు సమాజంలో సమ్మతమనే విషయాన్ని గుర్తుకుతెస్తారు. గ్రామంలో సావోత అందరికంటే ఎక్కువ. అయినా మిగతా వారు అతన్ని వ్యతిరేకించవచ్చు . సమాజ కట్టుబాట్లు రాయని చట్టం లాంటివి. గ్రామ పెద్ద కూడా దాని పరిధి లోనే ఉండాలి.

కొన్ని రోజుల తరువాత . అన్న చెల్లిని చూడడానికి వెళతాడు. సంప్రదాయ బద్ధంగా తన కోపాన్ని ప్రదర్శిస్తాడు. 'బేశుకోదు' తండ్రి, కన్యాశుల్కం చెల్లించడంతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. 'డిసారి' (పురోహితుడు) యోగం చూసి పెళ్లి

సమయం నిర్ణయిస్తాడు. డిసారి వధూవరుల పాదాలు తొక్కిస్తాడు. 'బెజుణి' (మంత్రసాని/మంత్రగత్తె) వధూవరుల శిరస్సులు రెండూ ఒక్క దగ్గరకు చేర్చి మంత్రించిన నీళ్ళు చల్లడంతో పెళ్లి ముగుస్తుంది.

కన్యాశుల్కం గా ఇచ్చిన కల్లు, గొడ్డు మాంసం, ధాండా , ధాండీల పాటలు, నృత్యాలతో సంబరం జోరందుకుంది.

మనుషులు పుడతారు. పెరుగుతారు. పెళ్ళిచేసుకుంటారు. ముసిలాళ్ళవుతారు. ఈ పెళ్ళిలో ముసిలాళ్ళు కూడా చెప్పే విషయం ఉంది. ముసిలాళ్ళ పాట దుఃఖ పూరితమయితే అవుగాక.

జీవనం ఉండబట్టి కదా !
ప్రాణం ఉండబట్టి కదా!
ఇలా ఆనందం కలిగింది !
ఇలా సరదా కలిగింది !
ఈ మర్త్యలోకంలో
అతి దుఃఖం ఉన్నవాళ్ళే హెచ్చు.
చిన్నప్పటి నుంచి దుఃఖమే మనిషికి .
వెదురుచెట్టు వూగి వూగి చస్తుంది.
రైతు తిరిగి తిరిగి చస్తాడు.
మనిషి దుఃఖం కారడివిలో దూరతాడు
భుజాన గునపం వేసుకుని
తలమీద తట్ట పెట్టుకుని కోదు కాపురం

'లోకంలో దుఃఖమే హెచ్చు. ఆయుర్దాయమున్నంత వరకూ సరదాగా గడిపెయ్యడమే మంచిది'.

'కోదు' పెళ్ళిలో పాడుకునే పాట అది. ఏ అతీత కాలం నాటి ధ్వంస చరిత్ర తలుచుకుని అభిమానంతో పాడుకున్న గీతమో ఇది. కోదు కి ఈ రోజు గత చరిత్ర జ్ఞాపకం లేదు. తన తాత తండ్రులు పాడారు కనుక తానూ పాడుతున్నాడు. జీవనం కంటే సంస్కృతి గొప్పదని భావిస్తాడు. జీవనం ఒక్క మనిషిది. సంస్కృతి లక్షల మందిది. గోష్ఠి

(సంఘం) కి చెందిన వాడతడు.

పాఠకుడి మనసు దుఃఖమూ, ఆనందమూ కాని అతీతస్పందనలకి గురవుతుంది. జన్మతః రైతు బిడ్డనయిన నన్ను ఏ పురాతన దుఃఖమో కమ్మేసింది.

**అమృత సంతానం : ఇక్కడ లేనిది !**

ప్రపంచంలో ఎక్కడైనా మనుషుల సహజ స్వభావం ఒక్కలాగే ఉంటుందని నా నమ్మకం. నా అనుభవాలు అటువంటివి. సంస్కృతిలోనూ, ఆచార వ్యవహారాల్లోనూ తేడాలుండవచ్చు. ఇతమిత్థంగా చెప్పలేని వివిధ సామాజిక, ఆర్థిక, భౌగోళిక మైన కారణాలు బహుశా మనుషులు భిన్నమైనవారనే భావనని కలిగిస్తుండవచ్చు.

గిరిజనులపై నాకున్న అవగాహన అతిస్వల్పం. విశాఖపట్నం నుంచి అరకు తరచుగా వెళ్ళే నేను recreation కోసమే తప్ప గిరిజనుల స్థితిగతుల గురించి పెద్దగా వాకబు చేయలేదు. యాత్రికుల కోసం ధింసా డాన్స్ వేసే అమ్మాయిల గ్రూప్ లో మద్యం సేవించి వారితో బాటు డాన్స్ చేసాను.ఆ వాతావరణం కొంచెం కృతకంగా అనిపించినా ఆ నృత్యంలోని రిథం, వాళ్ళు ఉపయోగించే డప్పు శబ్దం, పిల్లన గ్రోవి మాత్రం నన్ను వేరేలోకాలకు తీసుకుపోయేవి. అవి ఏ పురాతన శబ్దాలో ! ఊరు జ్ఞాపకం వచ్చి మనసు బెంగతో మూలిగేది. చేస్తున్న నాట్యం ఆపేసి వాళ్లనే చూస్తూ ఉండిపోయే వాడిని . మధ్య మధ్యలో 'ఓ..ఓ.. ఓ...' అని అరుస్తూ వారు చేసే నాట్యం ఒక అపూర్వమైన భావావేశానికి లోను చేసేది. తాగిన మత్తుని మించిన దేదో నా శరీరాన్ని పూర్తిగా ఆక్రమించేది. మధ్య మధ్యలో యాత్రికులలో డబ్బులు ఇచ్చిన వారిని గట్టిగా అరుస్తూ పొగిడే వారు. అప్పుడే, నేను మత్తు నుంచి బయటపడి కొంత అసహనానికి గురయ్యేవాడిని. రంగూ, రూపాల్లో భిన్నంగా కనిపించినా, పల్లెటూళ్ళలో, నాటకం మధ్యలో, డబ్బులిచ్చిన వాళ్ళని విపరీతంగా పొగిడే నాటక కళాకారులకీ వీరికీ తేడా కనిపించేది కాదు.

ఈ పుస్తకం గిరిజనం పై నాకున్న అభిప్రాయాన్ని పూర్తిగా మార్చింది. వారి సమాజమూ మనలాంటిదే. అక్కడా మూఢనమ్మకాలున్నాయి. జాతుల భేదం ఉంది. నిమ్న జాతులున్నాయి(డొంబు జాతి). స్వల్పంగానే అయినా ఉన్నత, నీచ వర్గ భేదాలున్నాయి.మన పురోహితుని లాగే 'డిసారి' ఉన్నాడు. మంత్రగత్తె

లున్నారు. భయపెట్టే అధికారులున్నారు. దోచుకునే షావుకార్లున్నారు. ప్రేమలూ, పెళ్ళిళ్ళూ, విడిపోవడాలూ, అనుమానాలూ, భయాలూ, కోపాలూ, నిస్సహాయతలూ ఉన్నాయి. నాగరిక ప్రపంచంపై మోజు ఉంది. వీరులూ, భీరులూ మన నిష్పత్తి లోనే ఉన్నారు.

కాని వారిలో కాలాన్ని బట్టి మారని ఆదర్శం ఉంది.

సభ్యత అనే ముసుగు వేసుకుని ముస్తాబు బురఖా కింద కపటం దాచుకోవడం అక్కడ లేదు.అలా బతకడం అక్కడి జనం నేర్చుకోలేదు. కనకనే వాళ్ళది అసభ్యత. అక్కడా అరిషడ్వర్గాలున్నాయి. అక్కడా కంపుంది. మైలా ఉంది. అన్నీ చోట్లా ఏముందో అక్కడా అదే ఉంది. కాని అక్కడి అడవి కెరటాల్లో మానవ హృదయం లోని మూలస్వరూపం నాట్యం చేస్తుంది. అందుకని అక్కడి గాలి తగిల్తే గాయం మానిపోతుంది. ఎండ తగిలి, వానపడి గట్టిపడుతుంది కాయం. వెలుగు పడి మనస్సులోని వేదన నిమ్మలిస్తుంది. దుఃఖం ఊరిచెరువు ఊబిలా మారదక్కడ.హతాశులైన మానవుల దుర్దశను విశాల ప్రకృతి పరశు మణిలా పనిచేసి బాగుపరుస్తుంది. దౌర్జన్యం ఉంటే ఉండు గాక, హోరు గాలి తిరుగుబాటు చేస్తే చేసింది గాక.. మానవ హృదయంలో కోమలరాగం మోగుతూ ఆగదక్కడ.

బహుశా పూర్వం మనమూ అలాగే ఉండే వాళ్ళమేమో! ప్రకృతినుంచి పెరిగిన దూరం మనల్ని మరింత దుఃఖపు ఊబిలోకి నెట్టిందేమో!

నేను రాసిన పరిచయంలో అద్భుతంగానూ, మనోహరం గానూ ఉన్న వాక్యాలు ఇంచుమించుగా అన్నీ పుస్తకం లోనివే. ఇలాటివి ఈ పుస్తకంలో ఎన్నో!

10-8-2017

## సుశీల నాగరాజ

# రుద్రరమణీయం

**అ**మృతసంతానం పుస్తక సమీక్ష! 'ప్రకృతి', 'రుద్ర రమణీయం'. ఈ రెండు ముఖాల దర్శనం, అర్థం, వివరణ, ఈ 'అమృతసంతానం' పుస్తకం చదువుతుంటే అనుభవానికి వచ్చాయి. 'రుద్రం రమణీయం'. రెండూ!

ఇంకొక్క విషయం ఇక్కడ చెప్పాలని అనిపిస్తుంది. లక్ష్మి గారు 'సంస్కృతి' అంటే ఏమిటి అనే విషయం గురించి మాట్లాడేటపుడు ఎంత విశాలమైన సార్వత్రిక మైన అర్థం వివరించారు. మన చుట్టూఉన్నది సంస్కృతి. అది ప్రకృతి. ఆ ప్రకృతి స్వార్థరహితమైనది. దీనికి వికృతి మనిషి. స్వార్థపూరకమైనవాడు. వీటి రెండింటి నడుమ ఉన్నది సంస్కృతి. మనిషి ప్రకృతికి సన్నిహితంగా ఉన్నప్పుడే సంస్కరింప బడతాడు. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు భారతదేశానికి ఉన్న ముఖ్యమైనతేడా ఆ దేశాల సంస్కృతి నగరాల్లో నుంచి పుట్టుకొచ్చినవి. భారతదేశంలో మాత్రం సంస్కృతి తపోవనాలనుంచీ, అరణ్యాలనుంచీ పుట్టినది. అందుకే మన భారతీయసంస్కృతి విభిన్నం! నేనెప్పుడూ ఈ కోణంలో ఆలోచించనేలేదు!

ఈ పుస్తకం చదువుతుంటే ప్రకృతి వికృతికి మధ్యఉన్న సంస్కృతి తెలిసివచ్చింది. చరాచరజగత్తు లో కలిసి జీవించటం మనిషి ఎప్పుడైతే నేర్చుకుంటాడో అప్పుడు మానసిక సంస్కారం పొందుతాడు! అలాంటి మానసిక

సంస్కారం ఏర్పడినపుడు మనిషి తన సాటి మనిషిని తనతో సమానంగా చూడగలుగుతాడు. ఎంత అర్ధగర్భితం! ఎంత సత్యం !

సత్యం, శివం, సుందరం!

'అమృతసంతానం' పుస్తకం గురించి వాడ్రేవుగారు రాసినది చదివినప్పటి నుంచి చదవాలని. ఆ అవకాశం వారే కల్పించారు. వారికి ధన్యవాదాలు! పుస్తకం డౌన లోడ్ చేసుకుని సాంకేతిక విషయాలన్నీ సవరించుకుని చదవటానికి కొంచం సమయమేపట్టింది. ఇంతలోపే శ్రుతకీర్తి సమీక్ష రాసి పెట్టేశారు. మొదటి స్థానం ఆమెకే!

'తల్లీ నిన్ను దలంచి పుస్తకం చేతన్ బూనితి' అంటూ చదవటానికి ప్రారంభం! అందులోని పరిసరాలు, పేర్లు , విషయానికి పొందుకోవటానికి కొంచం సమయం తీసుకుంది.అయినా పేర్ల విషయంలో చివరివరకు కొద్దిగా గందరగోళం గానే ఉన్నింది నాకు! గిరిజన ప్రజలు అన్న పేరు వినటమేకానీ. ఏదో పుస్తకాల్లో చదివి పిసరంత తెలిసినది అంతే. వారూ వారి జీవితం గురించి ఎక్కువగా ఏమీ అవగాహన లేదు. ఈ పుస్తకం గిరిజనులను తెరిచిపెట్టింది. వారు, వారి జీవితం, వారి పరిసరం,వారి ఆచారవిచారాలు, వారి పోరాటం, దినదిన గండంలాంటి వారి జీవితం, ప్రకృతిలో మమేకమైన వారి గురించి చదువుతుంటే గగుర్పాటు, భయం, ఆందోళనా, దయ, ఇలా ఎన్నో భావాలు మనసును ఆవరించాయి!!

అమృతసంతానుల నమ్మకాలు, అభిప్రాయాలు, వారి బంధం, లీనం, సర్దుబాటు, పోరాటం ప్రకృతితో ఇవి నన్ను చాలా ఆకట్టుకున్నాయి మరియు మధ్యవర్తుల, అధికారుల శోషణ చదువంతుంటే కళ్ళలో నీరు నిలిచాయి. 'మంచి' అన్న దానిపై వారి నమ్మకం. మంచి మనిషి ఆత్మతో పుడితే దీర్ఘాయుష్మంతుడని. పునర్జన్మ వారికి జీవన సత్యం, జీవన సుందరం. పాత శరీరంపోతే క్రొత్త శరీరం వస్తుంది. పిల్లల దృష్టిలో తల్లిదండ్రులు ఎన్నడూ ముసలివారుకారు! వారి వేదం ప్రకృతితో యుద్ధం చేయనిదే ఏదీ దొరకదు. తన యుద్ధం తనే చేయాలి. చావుకి భయపడకూడదు ఇది వారి సామాన్య జ్ఞానం! వారి వ్యక్తిత్వానికి ప్రతిరూపం.

ప్రకృతి కి తెరచుకున్న మనుష్యులు, మనస్సులు వారివి..అడవే వారి ఇల్లు- వారి విహారభూమి- వారి వనదేవత. వారికి కాయకష్టం కష్టం కాదు. ఆంతరిక మైనదే అగ్నిపర్వతం! బ్రతకటమే వారి ఆనందం! విశ్వాసమే వారి బలం! గిరిజన స్త్రీలు చాలా ధైర్యంకలవారు.తమ మనసుకు నచ్చినట్లు నడుచుకోవటమే వారి ఆదర్శం! మనసులు కలవటమే పెళ్ళికి పునాది. మనసు బెడిసిపోతే 'నాను కుమి', నాకు ఇష్టంలేదు. అంత సరళంగ వివాహబంధం తెగిపోతుంది. మనస్సుల్లోని ఉగ్రమైన అపేక్షే సంయోగంకల్పిస్తుంది. మనసుకు నచ్చిన మగవాడితో లేచిపోవటమూ ఉంది. సంకోచమూ లేదు- కట్టుబాటూ లేదు!, సర్వస్వతంత్రులు! గిరిజన స్త్రీలు ఎంత ధైర్యవంతులు, నిబ్బరమున్నవారంటే అడవికి వెళ్ళిన నిండు చూలాలు ఒంటరిగా బిడ్డను కని, ఏటిలో తను బిడ్డ ఇద్దరూ శుభ్రంచేసుకుని ఇంటికి వస్తుంది! వారి ఆరోగ్యం, శక్తి, ఆత్మస్థైర్యం శ్లాఘనీయం! ఛందోహీనమైన చిత్ర బాహుళ్యమే వీరి తీరు..నాకు ఆశ్చర్యం కలిగించింది...

వారికి కులగోత్రాలు పేర్ల చివర గోత్రం. ఒకే గోత్రం లో పెళ్ళిళ్ళు చేసుకోరు. వీరికి అరిషడ్వార్గాలున్నాయి! కంపుంది, మైలా ఉంది. గాలితో గాయం మానిపోతుంది. వెలుగుతో వేదనమాసిపోతుంది. వారికి ప్రకృతే సర్వం! మానవుల దుర్దశను ప్రకృతి పరసుమణిలా బాగుచేస్తుంది! వారి హృదయం సదా కోమలరాగం ఆలాపిస్తూఉంటుంది. భగవద్గీత వల్లించరు. ఆనందోబ్రహ్మ! ఋతువులు వారి క్రియ కర్మలో ప్రముఖపాత్ర. ఈ నడుమ క్రమంగా పండుగలు ఆచరిస్తారు. నాట్యం వారి దినచర్యలో ఒక భాగం!

నీది నాది అనే భావం ఉండదు. స్వార్థం లేదు! ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకుంటారు. తాటాకుల పంచాంగం ఉంది. జోతిష్యంపై నమ్మకం. మూఢ నమ్మకాలు వారిలో. నలుపు అశుభమని నమ్ముతారు. వినాయకుడు గృహదేవత! ఆకాశంలో సూర్యుడు భూమిపై మనిషి రాజు! ఎప్పుడూ భోగమే. మనిషిని బాధించే విరహం లేదు. పెళ్ళిని ఒక బాధ్యత గా భావిస్తారు. మనుష్యులందరూ ఒకే జాతి అన్న భావం! కన్యను ఎత్తుకపోయి వివాహం చేసుకోవటమూ ఉంది. అది రాక్షస వివాహం!

బదిలిసాగు పద్ధతి. అడవిని కాల్చి సాగు చేస్తారు..వారు కష్టపడి పండించిన పంట గద్దల్లా వచ్చి అధికారులు, సాహుకారులు తన్నుకుపోతారు. వారి అమాయకత్వాన్ని, దేవునిపై ప్రమాణంచేయించి వారిని భయభ్రాంతుల్ని చేసి, వారికి రాని చదువును ఉపయోగించుకుని వారిని దోపిడి చేయటం చదివి చాలా బాధ కలిగింది. మనిషి మనిషిని దోపిడీ అన్నది అనాదికాలం నుంచి ఉన్నదేనా! ధనవంతులు పేదలను! బలవంతులు బలహీనుల దోపిడి. నాకు మనసును కలచివేసింది! వారు పండించిన దానిని అమ్ముకోవటానికి పన్ను! ఇలా ఎన్నో విధాలుగా గిరిజనులదోపిడి. గిరిజనులు అడవిలో విత్తులై, మొక్కలై, మహా వృక్షాలుగా పెరిగినవారు. వారు అడవి బిడ్డలు. వ్యవసాయానికి లెక్కలు , చెట్లు కూలిపోయినందుకు లెక్కలు, ప్రాణులు చచ్చినందుకు లెక్కలు, పండిన పంటకు లెక్కలు! వారి కష్టాన్ని లెక్కలువేసి దోపిడి చేసి వారికి ఇచ్చే రసీదులో ఏముందోకూడా తెలియని అమాయకత్వం! ఆ అమాయకత్వాన్ని డబ్బులుగా మార్చుకునే రాతిమనసున్న అధికారులు! ధనవంతులు! గిరిజనులు తమ రక్తం కల్తీ లేకుండా నిలుపుకుంటుంది. వారి సంస్కృతి హిమాలయంకన్నా గొప్పది! స్త్రీలకు ఆత్మసమ్మానంఉంటుంది. కుటుంబవ్యవస్థ బలంగా అల్లుకున్న వ్యవస్థ!

అభివృద్ధి పేరుతో అనేక మార్పులు! రోడ్లు. యువ సభ్యత తాండవమాడుతూ ఉంది. జాతి చెడిపోతూంది. రక్తం కల్తీ. అడవి శబ్దాలు ఆగిపోతున్నాయి! మనుష్యులు ఆటవస్తువులైపోయారు!

గిరిజనుల జీవితం ముఖ్యంగా నిప్పుపై ఆధారపడి ఉంటుంది.

ప్రేమలేని జీవితం ఏం జీవితం అనుకుంటారు.అందరూ సమానం. రాజూ పేదా అన్న భేదభావంలేదు.

గిరిజనుల జీవనంపై అల్లిన ఈ పుస్తకం గ్రామపెద్ద 'సావోతా' వారి కుటుంబం చుట్టూ తిరుగుతుంది.కొడుకు దివుడు అతని భార్య పుయు, కూతురు పుబిలి. సావోతా మరణంతో కథ మొదలవుతుంది.

దివుని భార్య పియు, బిడ్డ పెంపకంలో, భర్తకు దూరమవుతుంది. చివరికి దివుడు చాలా మానసిక సంఘర్షణతో పియొటిను భార్యగా ఇంటికి తీసుకుని

వస్తాడు. దానితో పియు నిశ్చేష్టురాలవుతుంది! లేచి నిలబడుతుంది. కాళ్ళకింద దృఢమైన భూదేవి భరోసా! మనకు మనం స్వయంగ కలిగించుకోకపోతే మనకు బాధ కలిగించడం ఎవరి తరమూ కాదూ! ఓటమి స్వీకరించని దిట్టతనం. ధైర్యంగ బిడ్డను తీసుకుని ముందుకు అడుగు వేస్తుంది! అడవినే ఆమెకు అండా దండా అన్న విశ్వాసంతో చీకటిని చీల్చుకుని వెలుగువేపు నడుస్తుంది సాహోతా కోడలు పియు!!!

పుస్తకంలో అధికారుల, సాహుకారుల exploitation గురించి మాత్రమే నేను రాశాను. కొందరు మంచి అధికారులవలన ఎంతో, ఎన్నో పనులు వారికోసం జరుగుతున్నాయి! అందుకే 'ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు'.

7-8-2017

# నౌదూరి మూర్తి
# హృదయానందం రెణ్ణాళ్ల వేడుక

ప్రతి రచనా ఒక వైయక్తిక సత్యాన్ని ప్రతిపాదించేదే. ఆ ప్రతిపాదించే సత్యంలోని సాంద్రతా, విశ్వజనీనతా, పాఠకుణ్ణి వస్తువుతో మమేకం చేసి పురాస్మృతులనో, ఆత్మీకరించుకున్న అనుభవాలనో జ్ఞప్తికి తెస్తూ రచయితతోపాటు ముందుకి నడిపిస్తాయి. శ్రీ గోపీనాథ మహంతి గారి అమృతసంతానం అచ్చం అలాంటి పుస్తకం. (ఈ పుస్తకాన్ని 4 నెలల క్రిందట మిత్రులు వాసుగారి దగ్గర తీసుకున్నా, దీర్ఘకాలం కొనసాగిన అనారోగ్యం కారణంగా అంచెలంచెలుగా చదవవలసి వచ్చింది. పుస్తకాన్ని అందించినందుకు కృతజ్ఞతలతో పాటు, ఆలస్యానికి క్షమాపణలు.)

ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ, 30 సంవత్సరాలు పైబడి నేను జాతీయ నమూనా సర్వేక్షణా సంస్థలో (National Sample Ssurvey Organization) లో పనిచేసినప్పటి అనుభవాలు కళ్ళకు కట్టేయి. అప్పట్లో పాడేరు, అరకు (సుంకరిమెట్ట), జి. మాడుగుల, చింతపల్లి, హుకుంపేట, మొదలైన సంతలలో Central Statistical Organization (CSO) వారి అధ్వర్యంలో జరిగే Rural Price Collection కీ, ప్రతిఏడూ జరిపే వార్షిక సర్వేలకీ పరిశీలకుడిగా, పర్యవేక్షకుడిగా వెళ్ళినపుడు, విశాఖపట్నం నుండి పాడేరు వరకే బస్సు సదుపాయం ఉండేది. అదికూడా ఒక్క బస్సే. పాడేరులో రెండుగంటలు ఆగేది. అక్కడ వసతి సదుపాయం కూడా ఉండేది కాదు. పెదబయలు, ముంచింగిపుట్టి, ఇంకా లోపలికి వెళ్ళాలంటే

కాలి నడక, లేదా అప్పుడప్పుడు గిరిజన కార్పొరేషను వారి లారీలే గతి. ఆ సంతలలో గిరిజనులకు అమ్మే ఇమిటేషన్ వస్తువులు, తూకాలలో జరిగే మోసాలూ, సుంకరిమెట్ట అయితే, దారి కాసి వాళ్ళ దగ్గర కావిళ్ళకి కావిళ్ళు అడవిపంటలు తీసుకోవడం చూస్తే మనసు బాధవేసేది. గిరిజనులకి వాళ్లు మోసపోతున్నారని చెప్పినా, మన మాట వాళ్ళు వినకపోవడానికి, ఈ పుస్తకంలో చెప్పినట్టు (భోగిల జగన్నాథం వంటి) వ్యాపారులకు వాళ్ళు ఇచ్చిన మాటతప్పని గుణం ఒక కారణమయితే, వాళ్ళ నిస్సహాయతా, ఫారెస్టు అధికారుల అరాజకత్వం, అచేతనత్వం మరొక ప్రబల కారణం.

ఈ నవలని నేను మూడు అంచెలలో చదివి విశ్లేషించుకుని ఆనందించేను. ఒకటి ఈ నవల విస్తృత చిత్రణ (canvas); రెండవది వస్తువులోని విశ్వజనీనత; మూడవది అనువాదంలో ఉపయోగించిన భాష, అందులోని మనసు పులకరింప జేసే కవితాత్మకత. కవిత్వేతర ప్రక్రియల్లో కవితాత్మకత ఏమిటని అనుకోవచ్చు. చలం మ్యూజింగ్స్ లో కవిత్వం లేదా? రావిశాస్త్రి, బీనా దేవి కథల్లో కవిత్వంలేదా?

నవలలో బందికార, మణి అపాయు, మిటిం వంటి గిరిజన గ్రామాల పేర్ల ప్రస్తావన ఉన్నా, ఇది కేవలం ఈ మూడుగ్రామాల చరిత్ర కాదు; అవి నిజానికి ఏ గిరిజన గ్రామాలైనా కావొచ్చు. ఇది కోదుల చరిత్ర. కొండకోనల్లో, ప్రకృతి ఒడిలో, నాగరికతకీ దూరంగా ఉండే కోదుల నాగరికతా చిత్రణ: వ్యవసాయపు అలవాట్లు, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ, చావుపుట్టుకల సంరంభాలూ, పులివేటలూ, సంతలకి ధాండాలూ, ధాండీలూ ఆడుతూ పాడుతూ, ఎకసెక్కాలాడుకుంటూ, సరాగాలాడుకుంటూ వెళ్లడాలు, అధికారుల ఆగడాలు, మాటకు కట్టుబడే గిరిజనరైతుని ఆ మాటలతోనే మంచిచేసుకుని, పంట పైరుగా ఉన్నప్పుడే బయానా ఇచ్చి తక్కువధరకి స్వంతం చేసుకునే వ్యాపారుల ఆగడాలూ, (ఇది మనని వేధించి మరీ credi card ఇస్తూ, రేపటి జీతాన్ని ఇవాళే ఖర్చుచేయించి అప్పులపాలు చేసే banks కీ, వాయిదాలపై సమస్త వస్తువుల్నీ అందించే వ్యాపార సంస్థలకీ ఏ మాత్రం తీసిపోదు) ... కోదు గ్రామాల్లో పై గ్రామస్థులకి ఇచ్చే ఆతిథ్యాలూ మొదలైనవెన్నో ఉన్నాయి.

జీవితంలో ఎన్ని ఆశలుంటాయో అన్ని అసంతృప్తులుంటాయి. ఎంత అసంతృప్తి ఉంటుందో అంత దుఃఖమూ ఉంటుంది. అసంతృప్తులతో రాజీ పడి పొందినవాటితో, పొందగలిగిన వాటితో సుఖపడగలిగితే గొప్పే. అలా అయితే మానవజీవితం, మానవజీవితం ఎందుకవుతుంది? కోరికలు జీవనవ్యాపారాలకి మూలకారణం.

'సాయంకాలమైంది' అంటూ కన్యాశుల్కం నాటకం ప్రతీకాత్మకంగా ఆంగ్ల భాషావ్యామోహంతో మన భాషమీది మమకారానికీ, మన సంప్రదాయాల అనుష్ఠానానికీ ముగింపు మొదలయినట్టు, మొదటి అధ్యాయంలోనే ... మిణి అపాయు కుల వృద్ధు, గ్రామ పెద్ద, సర్దారు మృతితో... ఒక తరం మార్పుకి, అధికారం బదిలీకి అ ఊరు ఎలా గురవుతుందో నాందీ ప్రస్తావన జరుగుతుంది.

వయసు, అధికారం, కోరుకున్న భార్య, బిడ్డా ఉన్నా అటు సంప్రదాయం హద్దుల్ని అధిగమించలేక, ఇటు వయసు ఎరజూపే ఆకర్షణలకి తట్టుకోలేక పోవడానికి ప్రతినిధి దివుడు... సరుబు సావొతా కొడుకు. అన్న అజమాయిషీలో ఉన్నంతసేపూ ఒదిగి ఉన్నా, అన్న చనిపోగానే, అన్న అన్నకొడుకు అధికారానికి తల ఒగ్గలేక, పైబడుతున్న వయసుతో రాజీ పడలేక, వయసుకి తగని కోరికలతో సతమతమయే వ్యక్తి లెంజు కోదు; మనసు పడిన వ్యక్తి పెళ్ళిచేసుకునే నిర్ణయాన్ని వాయిదావేస్తూ వస్తున్నపుడు, కోరుకున్నవాడితో పోవడానికి నిశ్చయించుకున్న యువతి పుబిలి, సరుబు సావొతా కూతురు; తన్ను ఇష్టపడి చేసుకున్న దివుడు, బిడ్డపుట్టగానే వచ్చిన శారీరక మార్పులకి తనపట్ల ఉదాసీనంగా ప్రవర్తించినా బిడ్డపట్ల, భర్తపట్లా అనురాగంతో ప్రవర్తిస్తూ, క్షణికమైన ఆవేశంలో వేరయి పోవాలనిపించినా, భర్త ఎప్పటికయినా మారకపోతాడా అని ఎదురు చూస్తూ, చివరకి దివుడు చెప్పాపెట్టకుండా మరొక స్త్రీని వెంటబెట్టుకుని ఇంటికి వచ్చినపుడు, ఆత్మవిశ్వాసంతో, ముందెలా ఉంటుందన్న చింతలేకుండా, నిర్భయంగా తన బిడ్డతో పుట్టిన ఊరు బయలుదేరిన ధీరవనిత పుయు; కోదుగా పుట్టినా, వయసువచ్చేదాకా దిగువదేశంలోపెరిగి, ఆ సంస్కారం వంట బట్టించుకుని, తండ్రి మరణంతో ఆధారంలేక, తల్లి ప్రోద్బలంతో పుట్టిన ఊరు బందికార చేరుకుని, అక్కడి సంస్కారాన్ని అలవరచుకోలేక, తను నేర్చుకున్న

నాగరికతతో బ్రతకలేక, కోదు సమాజంలో ఉంటూనే ఎవరికీ చెందకుండా తోడుకోసం అలమటించే పాత్ర పియుటి; అటు తండ్రీ, కన్యాశుల్కం ఇచ్చి కొనుక్కుని నపుంసకుడైన తన కొడుకు బాలముండాకి కట్టబెట్టి ఇటు మావగారూ మోసగిస్తే, వయసుకీ, అక్కరకు రాని అందానికీ, ఇక్కడి కోదు జాతిచే హీనంగా చూడబడే తన 'డొంబు' జాతి (దొంగలు) ముద్రకీ మధ్య నలిగిపోయిన దీనురాలు సోనాదేయి.

పుష్యమాసం చివరా, మాఘ మాసం మొగనీ ప్రారంభమయే మెరియా పూజతోనూ, పూర్వ ఆచారం నరబలికి ప్రతీకగ ఊరిపెద్ద సరుబు సావొంతా మరణంతో ప్రారంభమయిన ఈ నవల, ఆరు ఋతువుల వ్యవధిలో ప్రకృతి మన్యంకొండలలో గీసే నీటిరంగుల చిత్రాలూ, అక్కడ జరిగిన సంఘటనలూ సంఘర్షణల వివరణలతో సాగి సాగి, చివరకి, ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ, ధైర్యం చిక్కబట్టుకుని, 'జీవనంలో రుచి ఉంది, చావు లేదు. దుఃఖం లేదు' అనుకుంటూ పుయు ముందుకి ఆశావహంగా సాగడంతో ముగుస్తుంది.

నేలా నీరూ, వాళ్ళ కండపుష్టీ, కష్టాలను మరిపించే విప్ప సారాయి తప్ప దట్టమైన అడవిలో, ఏ ఆలంబనా లేక పులిభయం, పాముల భయం, ఎలుగుగొడ్ల భయం, పురుగూ పుట్రా భయం, విషకీటకాల భయంతో పాటు, అంతకంటే ప్రమాదకరమైన ఫారెస్టు అధికారులూ, వ్యాపారులూ వాళ్ళనీ, వాళ్ల ఏడాది శ్రమ ఫలితాన్నీ దోచుకుపోతున్నా, దిగులుతో చితికిపోకుండా, 'దుఃఖం కలిగించే గాయం చూస్తూ వెక్కి వెక్కి ఏడవకుండా' బ్రతకగలుగుతున్నారంటే వాళ్ళు అమృత సంతానం కాబట్టే.

ఇక ఇందులో రచయిత చేసిన పరిశీలనలూ, ప్రకృతి వర్ణనలూ ఏ మహా కవి వాక్కులకూ తక్కువ రావు.

వయసుతోపాటు శరీరంలో వచ్చే మార్పుల్నీ, మనసునీ వర్ణిస్తూ ఒకచోట,

> శరీరంలోని అణువులు మారి మారి, బైటిరూపంలో ఒక కొత్త కళేబరం దాల్చాయి. మనస్సుకి అణువులు లేవు. అదొక పరీవ్యాప్తమైన శక్తి. స్వతంత్రమైనది. కాల్పనికమైనది.

అంటారు.

పొలం పనులు చేస్తున్న గిరిజనులను వర్ణిస్తూ :

హృదయానందం రెణ్ణాళ్ళ వేడుక. ఇవాళ కట్టి రేపు కూలదోసే కట్టడం. మట్టిలోని అంజనాన్ని దేహానికి పులుముకుని పనిచేస్తున్నారు మనుషులు.

'అక్కడ పని శబ్దం వినిపిస్తోంది'

ప్రతి వ్యక్తీ తన సంస్కారం పరిధిలోనే భగవంతుణ్ణి ప్రార్థించినా, ప్రకృతిని అర్థించినా. చక్కగా పెరిగిన పైరుని వర్ణిస్తూ (వలపటా దాపటా రూపాయల కెరటాలూగుతున్నాయి):

నీలిపాం లాగ మెలికలు తిరిగి దట్టమైన ధాన్యం పొలాలు సాగి పోతున్నాయి. ఎన్ని గరిసెల ధాన్యమో అక్కడ పండుతాయి ... ఓహో తల్లీ! జోహారు! నీ పాదాలకి కోటికోట్ల జోహార్లు. నువ్వు పాలించకపోతే ఎక్కడ ఉండే వాళ్లం? ఇలాగే పడుచుగుంటలాగ కలకలలాడుతూ వుండమ్మా! ఇలాగే నీ కళ్ళలో ప్రకాశవంతమైన నవ్వు నాట్యమాడుతూ వుండనీ తల్లీ! చల్లగా వుండనీ! నీ పాదుకలు చల్లగా వుండనీ!

రాబోయే గడ్డు రోజులు గురించి తలుచుకుంటూ భవిష్యవాణి చెప్పే బెజుణి తనలో ఇలా అనుకుంటుంది:

ఎరుగుదునమ్మా ఎరుగుదును. రోజు రోజుకీ హీనావస్థ వస్తుంది. ఎన్ని రకాలో పీల్చేస్తారు పొలాల్లోని పంట. బొందికి తగిలి ఉండీ కూడా తలకాయ పరాయివాడిదవుతుంది. మనిషితనం నిలవదు."

వర్షంలో ఒరిసిపరుతున్న గెడ్డలని వర్ణిస్తూ

అడవి మలుపుల్లో అద్దాల్లాగ కనిపిస్తున్నాయి గెడ్డలు. అడవి దేవతల నీలాటి రేవులవి.

కమ్ముకుంటున్న మేఘాన్ని వర్ణిస్తూ

మసిపూస్తూ పొగరాజేస్తోంది. తేలికగా ఎగిరి ఎగిరి వస్తోంది. ఇలాంటి సమయంలో మనసులోంచి ఏ సందులోంచో గడచిన దినాల చింత... ఎగిరి ఎగిరి వస్తుంది.

రాత్రికురిసిన వాన తెల్లారి తెరిపి ఇచ్చేక:

> ఉదయానికి వానలేదు. మందం మందంగా ఉన్న పొగమంచుమీద వెలుతురు గుండ జల్లుతోంది. ... దూరం కొండమీద అభ్రకం పర్దాలు వేలాడదీసినట్టు ఉంది.

వ్యాపారుల్ని ఉద్దేశించి:

> ఆ అడవిలోనే పులి తింటోంది. క్రింది అడవిలో ఎన్నో పులులున్నాయి.

నోటిమాటతో బురిడీకొట్టించే వ్యాపారులగురించి:

> నోటి మాటల్లో ఎంత ప్రభావం ఉందో వ్యాపారికి తెలుసు. లోకంలో ఇన్ని శరీర యంత్రాలున్నాయి. ఏది దిట్టమైందో ఏది కాదో తెలుసుకుందికి ఆ యంత్రాలకి తాళం చెవులు మనసుల్లో ఉంటాయి. ఆ తాళం చెవులదగ్గరికి చేరుతాయి ఇతరుల మాటలు. కేవలం ఒక్క ఊహ ప్రవేశపెట్టి తాళం తిప్పితే చాలు కోదు దేశంలోని మానవ యంత్రం కూడా పనికిరాకుండా వొరిగిపోతుంది. ఆ చేతిలో సుత్తి తాలూకు వజ్రశక్తీ, ఆ మాంస ఖండాల్లో కొండ ఊడబెరికేసే బలమూ- అన్నీ తాళం చెవితో తుప్పుపట్టేస్తాయి. చేతులు లేవవు.

బయానా ఇచ్చిన గ్రామం మొత్తం పంటని కొనేసిన వ్యాపారి అనుచరుడి గురించి,

> ఆ జంతువు లేచి నిలబడింది. ఏడాది అంతటి కోదుల కష్టార్జితమూ పొట్టలో పెట్టుకుని నిలబడింది. షాహుకారు జాతి ఉపకారి, రైతుజాతికి అపకారి. బహుదూరపు జంతువది.

చేతిలో రొక్కం పడిన తర్వాత కోదురైతు చిత్తవృత్తి గురించి:

> నగదు రూపాయలు కొత్త ఆనందం తెచ్చాయి. ఒక్క రూపాయి పిడికిట్లో పట్టుకుని నిలబడితే... ఎంతో ఇదిగా ఉంటుంది ఘుడియసేపు. రూపాయల వెంట 'నాచినీ దేవత' వచ్చింది.

ఇలాంటివి కోకొల్లలు.

అడవుల్లో ముక్కు మూసుకుని ఆత్మనిర్వాణంకోసం తపస్సు చేసుకునే స్వార్థపరులు కాదు ఋషులంటే; అడవిలో ఆ దిక్కులేని వారిగురించి హృదయంతో స్పందించే సమాజహితులు ఋషులంటే.

నానృషిః కురుతే కావ్యం.

చివరగా ఇందులో నాకు కుతూహలం కలిగించింది అడవుల్లో అజమాయిషీకి వస్తున్నప్పుడు తమ భారీ కాయాల్ని డోలీల్లో పడేసి డోలీల్ని గిరిజనులచే మోయించే సంప్రదాయానికి స్వస్తి పలికించి గిరిజనుల మన్నలను పొందిన సాండర్స్, అల్లూరి సీతారామరాజుని బందీ చేసిన సాండర్స్ ఒక్కరేనా అని.

మళ్ళీ పోస్టు చదువుతుంటే ఇక్కడ అనువాదకుడి పేరు ప్రస్తావించలేదని గ్రహించేను. అది క్షమించరాని అపరాధం. ఇది శ్రీ పురిపండా అప్పల స్వామి (నవంబరు 13, 1904 - నవంబరు 18, 1982)గారి అనువాదం. వీరు ఆంధ్ర, సంస్కృతాలలోనే గాక స్వయంకృషితో ఒరియా, హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషలలో సమధిక పాండిత్యాన్ని ఆర్జించిన బహుభాషావేత్త.

14-11-2017

పద్మజ సూరపరాజు

# తానూ, అడవీ రెండే శాశ్వతం

**అ**మృతసంతానం కొండనవల. నవల మొదటి అధ్యాయం ఆ కొండను చూపుతూ గిరిప్రదక్షిణం చేసే అద్దం. సావొతా తన జీవితపు చివరి క్షణాలలో, మన చేయి పట్టుకుని ఆ అడవిచుట్టూ తిప్పుతూ, తన కొండ అందాలు చూపుతూ, తన జాతినీ దాని చరిత్రనూ, ప్రస్తుత అవస్థనూ, సూచనప్రాయంగా దాని భవిష్యత్ నూ నెమరు వేసుకుని, మనల్ని అక్కడే వదిలేసి వెళ్తాడు మెల్లిగా పిల్లనగ్రోవి కోసం .....

నాలుగు వేల అడుగుల ఎత్తులో, మనం అతనితో పాటు vantage point నుంచి చూడ్డం మొదలు పెడ్తాం.

మద్దిచెట్టుకు ఆనుకుని కూచున్న సరుబు సావొతా, కోదుజాతి కులవృద్ధు, పెద్దబుర్ర, సర్దారు. ఎనభై ఏళ్ళు నిండినవాడు. కోదులకు రాజు లాంటివాడు. ఐదువందల మంది తన గోష్ఠిలో. మొలకు గోచి తలపై చింపిరి జుట్టు. కానీ కోదుజాతి నిధి.

ఊళ్ళో తన జాతివాళ్ళు ధర్తనీ పూజ చేస్తున్నారు. పుష్యమాసం చివర, మాఘమాసం మొదట్లోచేసే పూజ ఇది. చెట్టుకు చేరబడి కలలు కంటున్నాడు. ఉహూ! కలలాగా గతాన్ని చూస్తున్నాడు,

తనది, తన కోదుజాతిది, ధర్తనీ పెద్దకొడుకుది.

తన జాతి కథ. అతడు కొండరాజు. కాని,  అన్నని మోసం చేసి తమ్ముడు రాజైనాడు. తమరాజ్యంలో తామే రాజ్యభ్రష్టులైనారు కొండరాజులు. రాజ్యం లాక్కున్న తమ్ముడి విరోధం క్షమించాడు. విరోధం తమ్ముడికే. అన్న అన్నీ సహిస్తాడు మోసమూ, విరోధమూ కూడా, తల్లి ధర్తనీ లాగా. మన కోదన్న కడుపులో ఆకలి, వీపుపై వాతలు, మనసులో పుండు ఏదీ బయట పెట్టడు. రాజ్యచ్యుతుడైనాడు కానీ భూమి వదిలిపెట్టలేదు.'పేద వాడైనా కోదు రైతు ఆభిజాత్యం ఎక్కువ.'

సరబు సావొంతా ఇటువంటి కొండజాతికి తలమానికం, ఇంకా ఎక్కువే.

(ఈ సావొంతా తమ్ముడు లెంజుకోదు దురాలోచనతో తన అన్నను  మోసం చేసి రాజ్యం లాక్కోలేదు. సరుబు సావొంతా తన తమ్ముడి కి అటువంటి ఆలోచన కూడా రాకుండా ఆదరణ ఇచ్చాడు. తనను మోసం చేయాలనే తలంపు కూడా ఎవ్వరికీ రానీయని నిష్కల్మషుడు.అన్న పోయింతర్వాత లెంజుకోదు తన అన్నని తలుచుకోడంలో యిది స్పష్టం అవుతుంది.అన్న కొడుకు ఆ ప్రాముఖ్యం మన్నించలేదు. అన్న పోడంతో అనాథ అయినాడు లెంజుకోదు.)

ఈ భూమి తనది. చుట్టూచూశాడు. ఎంతందంగా ఉంది మన్యం. అడివి పొగమంచులో కెరటాల్లా కనపడుతున్న సూది సూది కొండలు, స్వచ్ఛమైన ఏర్లు, పచ్చటి అడవులు, పూలు నిండిన చెట్లు, ఒలిసి తేనె పట్లు. తన పూర్వపురుషులు నడిచిన నేలలు, కనిపించినంత దూరం , ఇంకా ఆవల ఉండిన తన వాళ్ళు.

ఇంతలో అంతకంతకూ పెరిగిపోతున్న కోదుల దౌర్భాగ్యం చింతకొచ్చింది.

వాళ్ళపై వాళ్ళ అడివిపై పెట్టబడిదారి పాదం. దాని దోపిడీ. అది ప్రతిఘటించాలని వీళ్ళు చేసిన పోరాటాలు. పూర్వం కూడా రాముడు వీళ్ళను సంఘటితం చేసి అండగా నిల్చి వీళ్ళకోసం యుద్ధం చేసి వీళ్ళను గెలిపించాడట. అన్నీ తలపుల్లోకి వస్తున్నాయి... గెలిచిన స్వాతంత్ర్యం ఇంకోసారి ఇంకొకళ్ళ చేతిలోకి పోవడం తిరిగి బానిసత్వం.

ఎన్నిసార్లు ఖండించినా మళ్ళీ మళ్ళీ మొలుస్తున్న పెట్టుబడి దారి తలలు.

పేదాసాదాఅట్లేఉన్నారు.  భూములుపోతున్నాయి.అన్నం పోతోంది.  జాతి తెగిపోతోంది.

ధర్తనీకి ధర్మకూ బలి ఇచ్చే శక్తి కూడా పోయింది

కోదు అశక్తుడయినాడు.

అయినా బలి ఇచ్చి ఇచ్చి బావుకున్నదేం ఉంది? బదులుగా ఏమీలేదు.

సావొతాకు తన ప్రజలు ధర్తనీకి చేస్తున్న ప్రార్ధన వినిపిస్తోంది.

పులినుంచి కాపాడు, రోగాల్నించి కాపాడు. వానలు కురిపించు. పంటలు పండించు. తిండి దొరకాలి, సుఖంగా ఉండాలి.

కేవలం శుభాకాంక్షలు. అమాయకమైన ఆదిమ భయాలు, కోరికలు.

ఇవన్నీ చూస్తున్న సావొతా తననూ చూసాడు.'తిన్ననైన మనిషి, గుగ్గిలం చెట్టులాగా'. పర స్త్రీకై, భూమికై ఆశపడలేదు, దిగజారలేదు. మురిపెం తన గడచిన స్వచ్ఛమైన జీవితం తల్చుకుంటే. ఇప్పుడు ఒళ్ళు ఖాయిలాగా ఉన్నా లోపల స్వస్థత చెదరలేదు. ఈ శరీరం పోతుందా, పోనీ, ఇంకోటి వస్తుంది, పోయేదేముంది అనుకుంటాడు.

సావొతా ఈ అవలోకనం ఇప్పసారా మత్తు లోంచి కాదు.

మొత్తం తనజాతిదీ, తనదీ జాడ్యమూ, స్వాస్థ్యమూ తెలుస్తున్నాయి. వరాలియ్యాల్సిన దేవుళ్ళు పలకట్లేదని తెలుస్తున్నది. తన జాతికి తప్పని బానిసత్వం, సాహుకార్ల దోపిడీ, తమ వ్యవస్థ అశక్తత అన్నీ కూడా కనిపిస్తున్నాయి. తన అడవిజాతికి అభ్యుదయం లేదని తెలుస్తోంది. తన ఆయువు అయిపోవచ్చింది. ఇక బలి ఇచ్చేందుకు అన్నీ అయిపోయినాయి.

ఈ ఒంట్లో బాధ అని తెలుస్తున్నది. పోతానేమో అనిపిస్తుంది.

ఇటువంటి సంధికాలంలో కోదుల సావొతాకు భయం, బాధ తోచలేదు. తనకొడుకో, కూతురో, పుట్టబోయే వంశోద్ధారకుడో కనపడలేదు, తను మిగల్చని ఆస్తి కలవరపెట్టలేదు. మళ్ళీ పుట్టనేమో ఇప్పుడే చచ్చిపోతే ఎట్లా అనేభయం తట్టలేదు. 'ఇది కాకపోతే ఇంకోటి', ఈ విశాలశరీరంలో ఎక్కడో ఓ మర చెడింది అనుకుంటాడు అంతే. జీవనం హాయిగా గడిచి పోయింది, (ఎన్ని వెతలు పడ్డాడో

తల్చుకుంటూనే) అంటాడు, నిజంగా సుఖపడ్డవాడెవడూ మనస్ఫూర్తిగా అనని మాట. మిగతాదంతా మాయ, ఇది పోతేపోయింది, మళ్ళీ పుట్టడం చేతిలో మాట అంటాడు.

మళ్ళీ మనిషిగానే పుడతానుఇ అదికూడా ఇక్కడే, ఈ అడవి జాతిలోనే, ఇక్కడి గింజల రుచి, సారా నిషా లేకపోతే ఉండలేను అని ఖచ్చితంగా మటుకు అనుకుంటాడు.

'రెండు మూళ్ళ పిల్లంగ్రోవి తీసుకోని రెండు కోసుల దూరం రాగం విసిరేస్తాడు.పిల్లంగ్రోవితో జీవనశక్తిని పూజచేసినట్లు'. ఆ వెదురు గొట్టంలోకి యౌవ్వన రాగం ఊదుతూ నృత్యం చేస్తాడు.

శరీరాన్ని 'ఇది' అని అన్నాడు. ఆత్మ నశించదు. మళ్ళీ పుడతాను అన్నాడు. ఆడుతూ పాడుతూనే ఒరిగాడు.

మిగతా అంతా మాయే, తానూ(ఆత్మ), ఈ అడవీ, ఈ రెండే శాశ్వతం లేక రెండూ ఒకటేనా?

16-11-2017

## జయతి లోహితాక్షన్

# ఆ ఆరాధకుల్లో నేనూ ఉన్నాను

గడిచిన నాలుగేళ్ళలో నేను తూర్పు కనుమల్లోని విశాఖ, తూర్పు గోదావరి మన్యంలో పలు ప్రయాణాలు చేసి ఉన్నాను. వస్తూపోతూ చూస్తున్నాను. అప్పుడప్పుడూ ఆ సంతల్లో తిరిగాను. ఒకసారి ఒక కోదుల ఇంట్లో ఒక పగలంతా గడిపాను. వాళ్ళ పిల్లలతో అడవిలో తిరిగి పండ్లు ఏరుకున్నాను. వాళ్ళ మాటలు కొన్ని నేర్చుకున్నాను. అదిప్పటి మాట.

అమృత సంతానం మొదటి పేజీ తెరిచినప్పుడు మొట్ట మొదటి వాక్యమిలా ఉంటుంది.

> ఎదో అంతులేని అతీతకాలం నాటి తాతముత్తాతల కోదుస్థానం కొండల్లో
> నాలుగువేల అడుగుల ఎత్తులో వొకవూళ్ళో సరుబు సొవొతా ఇల్లు.

ఇందులో కోదులన్న మాట ఒక్కటే కాదు, నన్ను ఆపకుండా వాక్యాలవెంట ముందుకి పరిగెత్తించినది, 'అంతులేని అతీతకాలంనాటి కొండల'ని ఒక్క మాటతో మననందులో భాగం చేస్తాడు. ఈ కొండల్లో ఏదన్నా చోటుకి పోవాలనుకున్నప్పుడు గూగుల్ మ్యాపులో ముందు చూస్తాను. అట్లా ఆ ముసలి కొండల్లో నేరుగా మనల్ని సరుబు సొవొతా ఇంటి గుమ్మంలో దింపుతాడు రచయిత. అక్కడినుంచీ అతడు చెప్పదలుచుకున్న కథ మొదలైంది.

పుష్యమాసం చివరి దినాల ఎండ. ఎనభైయ్యేళ్ళ ముసలి సరుబు సొవొంతా గుమ్మంలోని మద్దిచెట్టుకి చేరబడి చూస్తూ కలకంటున్నాడు. ఆలోచిస్తున్నాడు. కోదులు అని ఒక ఆదిమ తెగ ఉండేదన్న మాటే ముందు ముందు మరిచిపోతారు లోకులు. కోదులంటే ఎవరు? ఇప్పటికీ భూమ్మీద మిగిలిఉన్న ఎన్నో ఆదిమ తెగలలో ఒక ఆదిమ తెగ.. కోదుల జీవనం ఋతువులకు అనుగుణంగా సాగుతుంది. కోదుదేశంలో ఋతువుకొక్క పండుగ జరుగుతుంది. పుష్యమాసం ముగిసి మాఘమాసం మొగన మోరియా పూజ ఆ రోజు. అది వాళ్లకి పెద్ద పండగ. అతడు కోదు. అతడి భాష కుభీ. వూరు మణిఆపాయి. సరుబు సొవొంతా కులవృద్ధు, పెద్ద బుర్ర. గుగ్గిలం చెట్టులాగా తిన్ననైన మనిషి అతడు. అతడి గోష్ఠిలో అయిదు వందల మంది కోదులకు అతడు అన్నీ. అతడు రాజు కాదు. రైతు. గోచీ పెడతాడు. రాగి జుట్టు పరపర ఎగురుతూ ఉంటుంది. పొగాకు ఉమ్మి నోటమ్మట కారుతూ ఉంటుంది. కోదు ఇలా ఉంటాడు. ఆ కొండల్లో చూస్తే ఇప్పటికీ ఇట్లా కనపడేవాళ్ళున్నారు.

ఈ కాలంలో ఆ చిన్న చిన్న ఇండ్లు చూసి, ఏ పూటకాపూట బతుకులు చూసి, గోచీ చింపిరి జుట్టు చూసి అయ్యో అనుకోవచ్చు ఎందరైనా .

కోదుల నమ్మకం ప్రకారం రైతు దరిద్రుడే అవుగాక రాజు కంటే అతడి అభిజాత్యం అధికం. రాజు తమ్ముడు. కోదు అన్న. అన్న గుర్రం ఎక్కడంకోసం రువ్వ విరిచి తేవడానికి వెళ్ళాడు. ఇంతలో తమ్ముడు గుర్రం వీపుమీద కూచుని ఉడాయించాడు. ఆవాళ నుంచీ అతడు రాజయ్యాడు. తమ్ముడు దగాకోరు. అన్నకి న్యాయంగా రావలసిన రాజ్యం లాక్కున్నాడు. (లాక్కుంటునే ఉన్నాడు). గద్దె ఎక్కి కూచున్నాడు. రాజైన తమ్ముడి విరోధం క్షమించడం నేర్చుకున్నాడు కోదన్న. అన్నీ వోర్చుకోవడం నేర్చుకున్నాడు. అన్నీ సహించే ధర్తినీ (భూమి) మాత పెద్దకొడుకు కోదు.

అయ్యో అని అన్న మీద మనం జాలిపడకూడదు. పైన దర్మ (సూర్యుడు) ఉన్నాడు.

ఊరి పెద్ద కాయిలా పడ్డాడు. ఊళ్ళో పండగ నిషాలో కొండజనమంతా తేలుతున్నారు. కొండ అడవివేపు మొహం చేసుకుని సరుబు సొవొంతా

ఆలోచిస్తున్నాడు. ఎంత అందంగా ఉంది మన్యం ! పుష్యమాసంలో ఇప్పసారా ఇంతా బాగుంటుంది! చోళ్ళల్లో రుచి ఉంది. మాంసంలో రుచి ఉంది. కల్లులో నిషా ఉంది. అందమైన అడవి నేలా, వొలిసెలు పూసిన ఈ కొండవాలు ఎంతబాగున్నాయి. ఇక్కడే కలలున్నాయి. ఇంచక్కటి మనిషి జన్మ వొదిలేసి ఉండనే లేడు తాను. ఇంట్లోకి వెళ్లి పిల్లంగోవి పట్టుకు వచ్చాడు. పుష్యమాసం ఉషారు ఎండలో, పిల్లంగోవి ఊదుతూ ఊదుతూ సొవోతా నాట్యం చేశాడు.

పుష్యమాసం ఎండలో సీతాకోక చిలకలు ఎగురుతున్నాయి. ఎన్నో అడవి పువ్వుల వాసన గుబాళిస్తున్నది. అడవి దేశం వాసన. పాత శరీరం పోతే పోనీ, ఈ అందమైన భూమ్మీద మళ్ళీ పుడతాను అనుకున్నాడు సరుబు సొవొతా. అనుకొని అతడు చచ్చిపోతాడు. నవల మొదటి అధ్యాయంలో.

'జీవనం సత్యం. జీవనం సుందరం'.

ఇట్లాంటి ఒక రచన చెయ్యడం ఎవరి తరం! నిజానికి ఈనవల ఒడిశా దక్షిణ దేశంలో కోరాపుట్టి (కోరాపుట్) జిల్లా అడవి ప్రాంతంలో ఒక కొండజాతి జీవనమే వర్ణిస్తుంది. కానీ, శ్రీ గోపీనాథ్ మహంతీ ఉద్యోగరీత్యా ఆ అడవుల్లో కోదుల మధ్య మసులుతూ, వాళ్ళను గమనిస్తూ రాసినది కాదనిపిస్తుంది. అడివిలో అడివై, చెట్టులో చెట్టై, లెక్కా జమా లేని ఆ కొండల్లో కొండై ఆ గాలిని తనలోకి పీల్చుకొని ఊదిన పిల్లనగ్రోవి రాగం. జీవనరాగం. కోదులదేశం పాట. తాను అనుభవించి, ఆ అడివి జీవనంలోని ఒక తన్మయత్వంలో మనల్నీ ముంచేస్తాడు.

> ముసలి కొండ దేశమది. ప్రాచీనకాలంలో ఏనాడో భూకంపంలో అగ్నిపర్వతం ఉడుకుపొగలో తయారైంది. పల్లాలూ, వొరకలూ, ఎగుళ్ళ దిగుళ్ళూ అంతా కొండలమయం. కొండలూ రాళ్ళూ అవే ఆ దేశమంతా. నిజంగా ఇంతేనా అనిపిస్తుంది చూస్తే. ఇక మనుషుల సంగతా– కొండగురువు దగ్గర నేర్చుకున్నారా అన్నట్టుంటుంది వాళ్ళ ఆదర్శం. చరిత్ర బారసాల నాటి నుంచి ఎన్ని ఎదురుదెబ్బలు పడినా లెక్కచెయ్యలేదు వాళ్ళు. నిర్వికారంగా అడివి జీవనంలో, అడివంతటా అదే ఆదర్శం కనిపిస్తుంది. సభ్యత అనే ముసుగువేసుకుని, ముస్తాబు బురఖా కింద తామర దాచుకోడమూ, కపటం, దాచుకోడమూ అక్కడ

లేదు. అలా బతకడం అక్కడి జనం నేర్చుకోలేదు. కనకనే వాళ్ళది అసభ్యత. అక్కడా అరిషడ్వర్గాలున్నాయి, అక్కడా కంపుంది, మైలా ఉంది.

అన్నిచోట్లా ఏముందో, అక్కడా అదే ఉంది. కానీ అక్కడి అడివి కెరటాల్లో మానవహృదయంలోని మూలస్వరూపం నాట్యం చేస్తుంది. అందుకని అక్కడిగాలి తగిలితే గాయం మానిపోతుంది. ఎండ తగిలి వానపడి గట్టిపడుతుంది కాయం. వెలుగుపడి మనసు నిమ్మళిస్తుంది. దుఃఖం ఊరిచేరువు ఊబిలా మారదక్కడ. హతాశులైన మానవుల దుర్దశను విశాల ప్రకృతి పరుశుమణిలా పనిచేసి బాగుపరుస్తుంది. దోమలా జోరీగలా దౌర్జన్యం ఉంటె ఉండుగాక. హోరుగాలి తిరుగుబాటు చేస్తే చేసిందేగాక, మానవ హృదయంలో కోమలరాగం మోగుతూ, అగదక్కడ.

ఇట్లాంటి వాక్యాలు రాయడానికి మహంతీ గారు ఏ కొండగురువు దగ్గర నేర్చుకొని ఉంటారు!

ఈ జీవితాన్ని చూసి అనుభవించిన మహంతీ మీద ఎక్కడో అసూయగా కూడా ఉంటుంది నాకు. ఇప్పుడా అడవి నిండిన ఆ కొండలను చూసినప్పుడు, స్వచ్ఛమైన సెలయేళ్ళను నేను కలలుగన్నప్పుడు, కొండల మీద తేలిపోతున్న మేఘాలను ఆగి చూసినప్పుడు వాటన్నిటితో ప్రేమలో పడినట్లు మహంతీతో నేను ప్రేమలో పడ్డాను! పడకుండా ఎవరూ ఉండలేరని చెప్పగలను.

ఉల్లి సాగు బాగుండాలి. వెల్లుల్లి సాగు బాగుండాలి. అడవితీగలాగా అడవిలాగా సాగు వ్యాపించాలి. నష్టం రాకుండా ఉండాలి. పులులు తినకుండా ఉండాలి. అందరూ సుఖంగా ఉండాలి. శాంతిగా ఉండాలి.

కోదులు దేవతలని అడిగేదల్లా ఇంతే!

ఇది, అదేదో అంతులేని అతీతకాలంనాటి తాతముత్తాతల కోదుస్థానం కొండల్లో నాలుగువేల అడుగుల ఎత్తున ఒకవూళ్ళో కోదుల పెద్దబుర్ర సరబు సొవొంతా ఇంటి కథనే కాదు. ఇది మనిషి కథ. అడివి కథ. అడివితో మనిషి, మనిషితో అడివి పెనవేసుకున్న కథ. కథలో ప్రధాన పాత్ర అడవి. అడివి

దుంపాదుట్రా, పండూకాయ ఇచ్చేదే కాదు. అడివి వేట ప్రదేశం మాత్రమే కాదు. అడివిలో మిలమిల ఎండే కాదు. అడివిలో చలి ఉంది. కొండలో ఋతువుల రంగులు మారినట్టు, ఋతువుల్లో మనిషి తళుకు మారుతుంది. కోదుదేశంలో పంట కోతలప్పుడు అడివిచాటు పొలాల్లో ఎంతో సరదాగా వుంటారు. నవ్వులకు సరదాలకు అంతముండదు. మనుషుల్ని దగ్గర చేస్తుంది చలి. అడివిలో ఋతువులున్నాయి. ముసలి కొండల నడుమ, అడివిలో దూరాన భూమి ఇరుకుసందుల్లో వాళ్ళ ఊళ్ళల్లో వర్షం కురవదు. బాది బాది కొడుతుంది. చికాకు పుట్టిస్తుంది. పనుల్లేక బద్ధకస్తులను చేస్తుంది. మనిషి మనస్సుల్లో చికాకు పెరిగిపెరిగి కాపురాలని తెగతెంపులదాకా లాగుతుంది. వాన వెలిసి ఎండొస్తుంది. చీకటి తరువాత వెలుగువస్తుంది.

బైటి ప్రకృతి కేవలం ఒక తెర. మనిషి ఆలోచన ప్రదర్శనం!

ఋతువుల క్రియ కర్మలో కనబడుతుంది. ఎప్పుడు భూమిదున్నాలి? ఎప్పుడు పైరు కోయాలి? ఒక ప్రణాళిక ప్రకారం ఏడాది పొడుగునా కాల చక్రం తిరుగుతుంది. ప్రపంచంలో అన్ని దేశాల్లాగే వ్యవసాయంపనిలో మెట్టుమెట్టుకీ స్మారకంగా పండుగలు జరుగుతాయి కోదుదేశంలోనూ. అడివిని సాపు చేసి పోడు చేస్తాడు. మాఘమాసం మొదలు. చేల కాపలా. మనిషి చెమటోడ్చి పండించిన పంట అడివి మృగాలు తేరగా నోటవేసుకునేవి, ఎగరేసుకుపోయేవి. అందుకనే చలిలోనూ మంచులోనూ కాపలా కాసేవాళ్ళు. దుప్పులు తింటాయి. లేళ్ళు మేస్తాయి. అడివిలో భయం ఉంది. ఆపదొస్తే వూళ్ళనొక్కటి చేస్తుంది అడివి. పంట కాపలా పోయిన మనుషుల్ని పులులు తినేస్తాయి. ఈ రోజుల్లో పులిపట్టుకుపోవడం తరచు. ఎలుగుబంట్లున్నాయి. పాములున్నాయి. ఏ ముహూర్తంలో ప్రాణం పోతుందో ఠికానాలేదు. మన్యంలో జ్వరాలొస్తాయి.

కోదు దేశంలోదంతా సామాన్య జ్ఞానం. కళ్ళముందే మందు.

చెట్ల అడివి (కథా కాలానికే) పల్చబడిపోతూ ఉందని, మనుషుల అడివి పెరుగుతూ ఉందని రచయిత– మిణిఅపాయి, మిటిం, బందికార సభ్యతకి దూరంగా ఉన్నాయి. ఇవాళదాకా ఈ ప్రాంతానికి ఎర్ర రోడ్డు రాలేదు. మన్యం

గుట్టు బైటికి పోలేదు. పులులూ రోగాలూ కొండలూ కాపలా కాస్తున్నాయి అంటాడు. మూడు వాక్యాల్లో ఎంత అర్థం చేసుకుంటాం!

అడివిబిడ్డలను పీడించే సాహుకార్లు, అధికార్లు అడివంతా నడిచేవొస్తే మరెట్లా ఉండేదో!

అడివి వాళ్ళ మనసులను శుభ్రపరిచేది. అడివి శోభ మనిషిని మరిపిస్తుంది. కానీ వాళ్లట్లా రారు. ఒక్కొక్కవ్వాళ్ళో సాహుకారు దూతలు ప్రత్యక్షమవుతారు. ఇంతపంటా సాహుకార్ల ఇంట్లో పడుతుంది. తరువాత అధికార్ల దర్శనం. ఒకళ్లు శిస్తు వసూలుకి వస్తే, ఒకరు ఇల్లు తనికీకి వస్తారు. వాళ్ళ కావళ్ళ మోతకి మనుషులు కావాలి. వాళ్లకి దినుసులు కావాలి. వాళ్లకి ఎన్నో కావాలి. కోదు తమ్ముళ్ళు అందరినీ సంతోషపెట్టాలి. కోదుకి కాయితమంటే భయం. రాతంటే భయం.

కోదుకి పులంటే కూడా భయం. పులిని ఎదుర్కుంటాడు. సాహుకార్ల ముందు అధికార్ల ముందు వణుకుతాడు.

విశాఖ మన్యంలో నేనొక గిరిజన గ్రామానికి వెళ్లాను. పిప్పళ్ళు సాగు చేస్తారు వాళ్ళు. పసుపు పండిస్తారు. మందుల్లోకి ఉపయోగపడే ఈ పంటంతా ఏ ముంబయికో వెళ్ళిపోతుంది. జ్వరాలొస్తే మీరేం చేస్తారంటే, మళ్ళా ఆ గిరిజనులు కావలసిన మందులు కొనుక్కుంటారు.

రచయిత ఒకచోటంటాడు. పంటలకోతలు జరుగుతుంటాయప్పుడు. ఎటు చూసినా పనుల్లో మనుషులుంటారు. అప్పుడు.. ఇందుకా ఇంతపని? ఏ షావుకారు బంగారు మురుగులు బొద్దుగా చెయ్యడానికి అడివిలో దిసమొల మనుషులు ఈ నాటకాలాడుతున్నారు. కోదులెవరూ ప్రశ్నవేసేవాళ్ళే కాదు. బతుకు ఉందని చావు తప్పదు. అయినా ఎవ్వరూ బతుకు మరణ విలాపమని భావించరు. రానీ, ఎప్పుడు ఏ సాహుకారొస్తాడో.

కోదు మాత్రం వ్యవసాయం చేస్తూనే ఉంటాడు.

అవును, అడవి మనుషులకి అది లెక్క కాదు. కోదుకి యవ్వనమంటే ఎంతో ఇష్టం. జీవనమంటే ప్రేమ. సంతలు జరుగుతాయి. కోదుదేశంలో

మగకుర్రాళ్ళని చూస్తే ఆడపిల్లలూ, ఆడపిల్లల్ని చూస్తే మగపిల్లలూ పాటలు పాడటం రివాజు. వీళ్ళు ఒకసారి పాడాక వాళ్ళు ఒకసారి పాడుతారు. ఉన్మత్త ప్రకృతి మనిషిని పాట పాడిస్తుంది. ఆడిస్తుంది. గెంతిస్తుంది. కోదు దేశంలో అంతా పాటలోనే సాగుతుంది. ప్రాణానికి ప్రాణం పెట్టి ప్రేమించుకుంటారు.

వెలుగునీడల అడివి నేల అది.

కథంతా మిణిఅపాయి గోష్ఠి (కోదు గ్రామాలని గోష్ఠి అంటారు) చుట్టూ తిరుగుతుంది. ఆ ఊరి పెద్ద సరబు సొవొతా. ఆయన కొడుకు దివుదు (కార్తీకం) కూతురు పుబిలి (సీతాకోకచిలుక) కోడలు పుయు (పువ్వు), తమ్ముడు లెంజు (చంద్రుడు). బంధువులు రాకపోకలు ఉన్న గ్రామాలు బందికార, మిటిం. వారిది అతి ప్రాచీన భాష కుభి.

ఆరువందల పేజీల ఈ నవలని చదవడం సగందాటేప్పటికి ఐపోతోందే అనిపించింది. చివరికొచ్చేటప్పటికి ఇది ఐపోదు! మెల్లమెల్లగా ఎప్పుడో నాలో ఇంకిపోయింది అప్పటికే. మళ్ళీ మొదటి పేజీకొచ్చాను. ఒక్కొక్క వాక్యాన్ని పట్టి పట్టి చదువుకున్నాను. దాచుకున్నాను. ఇది చదవండని కనపడినవాళ్ళకల్లా చెప్పాను.

అడివీ మనిషీ ఒకరితోఒకరు కలిసి సాగే తీరు. ఈ అగమ్యగోచరమైన కీకారణ్యం లోనే కోదు తమ్ముల ఆనందం. కోదు పడుచుల సంతోషం. ఎవరూలేని అడివిలో ఎవరూ లేకపోలేదు. అక్కడి పరిచయం తుప్పలతోనూ, పలకరింపులు చెట్లతోనూ. జంతువులమాట– అది మనోల్లాసం కలిగించే దూరం కల. అయితే వాటితోనూ పరిచయం లేకపోలేదు. వాటంతట అవి వస్తాయి. మేతమేసి వెళ్ళిపోతాయి. అవి లేకపోతే సౌందర్యమే అర్థం కాదు. భయం ఉంటేనే ప్రతి చోట దేవతలుంటారు.

ఆరువందల పేజీల కథ, చిన్న చిన్న వాక్యాలు, అందమైన వాక్యాలు, కథనం ఒక రిథంలో సాగుతూ ఉండి ఉండీ పాఠకులని చుక్కల్లో నిలబెడుతుంది.

> లోకంలోని పెంటాపేడా, చెట్టూ చేమలూ, ఛప్పన్నకోటి జంతువులూ ఆశ్రయించుకున్న వున్న మట్టే ఈ శరీరాలకి ఆశ్రయం. ఆ శరీరాలన్నీ

సగం నగ్నంగా ఉన్నాయి. వాటిలో తెలివి మరుపులతో ఉంది, ఏదో శక్తి. అంతేకాదు, ఎన్నో చింతలూ, ఎన్నో భావాలూ, నమ్మకాలూ కూడా ఉన్నాయి. ఇవి తప్పిస్తే ఇంతేసి పెద్ద కలేబరాల్లో స్వయంప్రకాశ మంటూ లేదు. తేజస్సులేని జడస్వరూపాలవి. ఒట్టి మట్టిముద్దలు. అదిగో అది దివుడు సొహొతా శరీరం. పొడవాటి కణుపులూ, ఇన్ని కొయ్యలూ ఇంత మాంసం ముద్దా. అందులో రంగూ ఉంది. జీవనమూ ఉంది. నిద్రలో అంతా నిశబ్దంగా ఉంది. అంతే దానిపరం. మరేమీలేదు. కానీ దానిలోపల ఉన్న ఉద్దేశాలు, స్వప్నాలూ వాటి పరిసరం అవుపించదు. కళ్ళు మిరమిట్లుగొలిపే వాటి తేజస్సు ఏ దూరదిగ్వలయంలోనో, దాని అవతలి అంచునో తొంగిచూస్తుంది. దాని తరవాత అంతా అంధకారమే అంధకారం.

రాత్రి పడింది. అగ్గిమంటలు ఆరిపోయాయి. మీద ఒట్టి ఆకాశం. నిద్రలో వొళ్ళు మరిచి నాలుగువందల మంది పడుకున్నారు. ఒక్కొక్కరినీ లేపి చూస్తే ఒక్కొక్కరూ వొక్కొక్క నవల.

ఇందులోని పాత్రలన్నిటిలో నాకు మరీ నచ్చిన పాత్ర పియొటి. కోదు దేశంలో పుట్టిందే. పెరిగిందంతా పల్లపుదేశంలో. పదిహేడేళ్ళవయసులో ఆమెని తీసుకుని తల్లి పుట్టిన గడ్డకి మళ్ళీ తిరిగొస్తుంది. సభ్యత నేర్చినదేశంలో పెరిగిన పియొటి కళ్ళల్లో అడివిని ఎంత చక్కగా చిత్రిస్తాడు రచయిత! ఈ అడవిలో ఒక్కటీ తిన్నగా లేదు. అన్నీ ఒంకరటింకరగా అడ్డదిడ్డంగా ఉన్నాయి. ఒక వావీవరసా లేదు. చెట్లూ డొంకలూ తీగలూ తుప్పలూ అన్నీ కలగా పులగం పెనవేసుకుంటాయి. ఈ సృష్టిలో సామరస్యం లేదు. ఉల్టా ప్రపంచం అను కుంటుంది అడవిని పియొటి. ఈ అస్తవ్యస్తంలో ఏ సూత్రముందో అర్థం కాదామెకి.

మనిషి కళ్ళుతెరిచినప్పటి నుంచి అతడు ఎదిగే క్రమాన్ని ఎట్లా వర్ణిస్తాడు!

సరుబు సొహొతా చచ్చిపోయినప్పుడు..

ఇక మనుషుల వెచ్చటి పొయ్యిదగ్గర అతడికి చోటులేదు. ఉత్త పేరు మాత్రమే అతడు.

సరుబు సొహొతా కన్ను మూసిన మర్నాడు అతడి మనవడు కళ్ళు తెరుస్తాడు. అతడికి ఐదునెల్ల వయసప్పుడు..

> మినిఆకా హోకినా ఐదు మాసాలవాడయ్యాడు. కళ్ళు చికిలించి, మొహం ముడతలు చేసుకుని నవ్వుతున్నాడతడు. ఎండా వానా, కష్టమూ సుఖమూ వెక్కిరించి, జన్మాంతరవాది కోదు నవ్వే నవ్వుతున్నాడతడు. ఆ నవ్వులో రాళ్ళమీద తుళ్ళింతలాడే సెలయేళ్ళు తొంగిచూసేవి. మన్యదేశంలో చుట్టూ కెరటాల్లా కునుకుపాట్లు పడుతున్న భూదేవి స్పర్శ అందులో ఉండేది.
>
> మనిషి శాంతంగా ఉన్నప్పుడు, ఉద్వేగం లేనప్పుడు హోకినా బైటికి చూసేవాడు. సంతోషించేవాడు. మనసు ద్వారాలన్నీ తెరుచుకునేవి. వెలుగులో ప్రక్రుతిరూపాలు, ఎండా గాలీ వాటిగుండా ధూళీ అన్నీ లోపల ప్రవేశించేవి. తల్లిపాలలాగా అవి కూడా ఆహారమే హోకినాకి. మందిలోనే పెరిగేవాడతడు. మందిలోని తలపులన్నీ గూళ్ళు కట్టుకువచ్చి అతడి ఎదిగే మనసుముందు పెరగడంకోసం నిలబడేవి. హోకినా ఎదిగే వాడు.

ఈ నవల అనువాదం అంటే నమ్మబుద్ధి కాలేదు. అమృతమంటి తియ్యని తెలుగుభాష పురిపండాగారు వాడినది!

అమృత సంతానం ఆరాధకుల్లో నన్ను చేర్చారు వాడ్రేవు చినవీరభద్రుడు గారు. అది మామూలు ఆరాధన కాదు. వీరభద్రుడు గారికి కృతజ్ఞతలు ఎట్లా తెలుపుకోవాలో తెలియదు ఈ పుస్తకం గురించి చెప్పినందుకు. ఇది చదవకపోతే జీవితంలో ఎంత కోల్పోయి ఉందును! చదువుతున్నప్పుడే నా డైరీ నిండిపోయింది. వారింటికి వెళ్లాను ఒకసారి. అప్పుడా డైరీ నా చేతిలో ఉంది. అందులో నేను రాసుకున్న వాక్యాలున్నాయి. ఏది కొన్ని చదువు అన్నారు. చదివాను. మరొక్కసారి ఆ ఆనందాన్ని వారితో పంచుకున్నాను. నాకా అదృష్టం కూడా కలిగింది. అప్పుడు నాకనిపించింది. వందల మంది వేలమంది గుమికూడనీ వాళ్ళందరికి అమృత సంతానం వినిపిస్తాను.

ఒకసారి చదివిన వెంటనే రాయడం మొదలు పెట్టాను. మళ్ళీ మళ్ళీ చదివాను. మళ్ళీ మళ్ళీ రాస్తాను. అడవి శబ్దాలలోకి, రంగులలోకి ప్రయాణ మౌతున్నానిప్పుడు. రేపటి నుంచి అడవిలో ఉంటాను. అప్పుడు చెప్పాలనుకున్నాను అమృత సంతానం గురించి. తిరిగొచ్చి మళ్ళీ చెప్తాను . అది చెప్పడానికి ఆ కొండల్లోకి మరెన్నో ప్రయాణాలు చేస్తాను.

నేననుకుంటున్నాను, అమృత సంతానం గురించి నేను రాయవలసినదంతా రాశాకా చెప్పవలసినదంతా చెప్పాకా నా ప్రాణానికిక ఏమైనా పరవాలేదు.

18-11-2017

## శిరంశెట్టి కాంతారావు

# వంచన నేర్వని అమృతసంతానం

ప్రపంచంలో మానవ మేధ వికసించడానికున్న ప్రధానమైన వనరుల్లో అత్యంత ప్రధానమైన వనరు సాహిత్యం. అటువంటి సాహిత్యంలో అనువాద సాహిత్యం మరింత ప్రధానమైనది. అనువాద సాహిత్య ఆదానప్రదానాలు విస్తృతంగా జరిగినప్పుడు మనిషి స్థానికత అనే సంకుచిత పరిధిని దాటి విశ్వమానవునిగా రూపుదిద్దుకోడానికి ఓ మంచి అవకాశం దొరుకుతుంది. అందుకే మనం అనువాద సాహిత్యాన్ని మరింత ఆదరించి అక్కున చేర్చుకోవాలి.

1957లో విఖ్యాత ఒడియా రచయిత గోపీనాథ మహాంతి ఒరియా భాషలో వ్రాసిన 'అమృత సంతానం' ఓ గొప్ప నవలారాజం. ఇందులో గిరిజన సంతతికి చెందిన కోదుల జీవితాన్ని సమగ్రంగా చిత్రించడం జరిగింది.

అటువంటి గొప్ప నవలను ఉత్తరాంధ్రకు చెందిన సుప్రసిద్ధ కవి పండితులు పురిపండా అప్పలస్వామిగారు కేంద్రసాహిత్య అకాడమీవారి పనుపున 1963లో తెలుగులోకి అనువదించారు.

నానాటికీ తీసికట్టు నాగంభట్టు అన్నట్టు ఇప్పటి తరంలో పుస్తకపఠనం అనేది క్రమంగా సన్నగిల్లి పోతుంది. ఇటువంటి సందర్భంలో ఎవరు ఎవరినైనా ఓ ఆరువందల పేజీల అనువాద నవలను చదవమని చెప్పడం దాదాపుగా సాహసం చేయడంగానే చెప్పుకోవాలి.

ఇక నవల విషయానికొస్తే..

నవల ఆరంభం పోతనామాత్య విరచిత భాగవతంలో 'అలవైకుంఠ పురిలో..ఆ మూలసౌధంలో..' అన్న పద్యంలో మరియు డా.కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి 'కుంతి కుమారి' ఖండకావ్యం ఆరంభంలో ఆయా కవులు ఎంతగొప్ప నేర్పుతో పాఠకుల కండ్లముందు ఆయాదృశ్యాలను రూపుకట్టించారో. అదేవిధంగా 'అమృతసంతానం' నవల ప్రారంభం గొప్పపదచిత్రణలతో ఆరంభమవుతుంది.

ఈ నవలలో నాయకుని పేరు సరబు సావోత. అతని ఊరు మణి ఆపాయు. ఆ ఊరికి అతనో రాజులాంటివాడు. వాస్తవానికి నవలలో అతను బ్రతికున్నది కొద్దికాలమే ఐనా, మాయాబజారు సినిమాలో అసలు కనిపించనే కనిపించని పాండవులచుట్టూనే కథ నడిచినట్టు అతని ప్రస్తావన నవల పొడవునా కొనసాగుతూనే వుంటుంది.

సరబు సావోత తమ్ముడు లెంజు సావోత, కొడుకు దివుడు సావోత, కోడలు పుయు, కూతురు పుబులి. ఇది సరబు సావోతా కుటుంబం.

సరబు సావోత భార్య ఎప్పుడో గతించిపోయింది. ఇక తమ్ముడు లెంజు సావోత భార్య రుక్మి పులి వాతపడిపోతుంది. కోదుల సాంప్రదాయంలో ఒక మగవాడి భార్యను పులి ఎత్తుకుపోయినట్టయితే ఆ వ్యక్తి వెంటనే మరో పెండ్లిచేసుకోడానికి వీలులేదు. మరొకచోట ఎక్కడైనా పులినోట పడి భర్తను కోల్పోయిన స్త్రీ వుంటే ఆవిడను వెతికిపట్టుకుని, ఆవిడను మాత్రమే పెండ్లి చేసుకోవాల్సి వుంటుంది. అటువంటి స్త్రీ లెంజు సావోతాకు ఎక్కడా దొరకకపోవడంతో, తిరిగి పెండ్లి కాకుండానే అతని జీవితమంతా గడిచి పోతుంటుంది. దేహ వాంఛను తీర్చుకోవడం కోసం అతను తహతహలాడి పోతుంటాడు. ఆఖరికి గ్రామ సేవకుడైన బారికి కోదు కోడలు సోనాదేయి ప్రాపకం కోసం వెంపర్లాడుతుంటాడు. అన్న తరువాత గ్రామ సావోత కావాల్సిన తనను కాదని అన్న కొడుకు దివుడు, గ్రామ సావోతా కావడాన్ని జీర్ణించుకోలేక పోతాడు లెంజు కోదు. దానికి ప్రతీకారం అన్నట్టుగా అతను ఇంట్లోను, చేలోనూ పైసాపని చెయ్యకుండా కల్లుతాక్కుంటూ ఊరిమీదబడి బలాదూరుగా తిరుగుతూ వేళకు

ఇంటికొచ్చి కోడలు పుయు ఒక ముద్దపెడితే తింటుంటాడు. క్రమంగా చిన్నాయనకు, కొడుక్కి పడని పరిస్థితొకటి దాపురిస్తుంది. అంతిమంగా దివుడు సావోతా లెంజు సావోతను ఇంటినుండి వెళ్ళగొడతాడు. ఇట్లా లెంజు సావోతా పాత్ర నవల మొత్తంలోకీ విషాదమైన పాత్రగా మిగిలిపోతుంది.

మరొక ముఖ్యమైన పాత్ర సరబు సావోత కోడలు, దివుడు సావోతా భార్య అయిన పుయు. సాధారణంగా మైదాన ప్రాంతాల్లో వుండే పురుషాధిపత్య సమాజానికి భిన్నంగా అడవుల్లో జీవనం సాగించే ఆదివాసీల్లో స్త్రీ ఆధిపత్య సమాజం నడుస్తుంది అనుకుంటాము. కానీ, అది నిజంకాదని పుయు పాత్ర ద్వారా రచయిత మనకు అవగతం చేస్తాడు.

పుయు యువతిగా వున్నప్పుడు దివుడు ఇష్టపడి ఆవిడను పెండ్లి చేసుకుంటాడు. ఇద్దరి మధ్య అన్యోన్యం పురి విప్పుతుంది. ఫలితంగా పుయు కడుపు ఫలించి కొడుకు పుడతాడు.

పుయు కన్నవారి ఊరు మిటిం గ్రామంలో ఆవిడకు గ్రామస్తులు, పాలివాళ్ళే తప్ప స్వంత వారంటూ ఎవరూలేరు. కొడుక్కి బారసాల చెయ్యాలంటే పుట్టింటివారు అందుకు కావాల్సిన సరంజామా కొంత తీసుకురావాల్సి వుంటుంది. అందుకే ఆవార్తను ఊరి బారికి ఖర్ష ముండాతో మిటిం గ్రామానికి చేరవేస్తుంది. ఆ వార్త తెలుసకున్న మిటిం గ్రామస్తులు పుట్టింటివారి తరపున పురిటి సంభావనలన్నీ తీసుకుని మణి అపాయు వస్తారు.

నా అనేవారే లేని ఓ అనాథయువతికి, తను పుట్టిపెరిగిన ఊరివారే ముందు నడిచి కన్నవారికన్నా ఎక్కువగా ఒక కార్యాన్ని నడిపించడమనేది గిరిజనేతరులకు కలలోగూడా అందని విషయం. ఈ సామూహిక తత్త్వం లోపించడం కారణంగానే మైదాన ప్రాంతాల్లో మనుషుల మధ్య మానవసంబంధాలు ఇగిరిపోవడం మరింత వేగం పుంజుకుంటుంది.

పుయు కొడుకు బారసాలసామాగ్రితీసుకుని మిటిం గ్రామ రఘుసావోత కొడుకు, యువకుడైన బేసుకోదు అందరికన్నా ముందునడిచొస్తాడు. బేసుకోదు పేరుమోసిన పులి వేటగాడు. పుయు కొడుకు బారసాల ఆవిడ అనుకున్నదానికన్నా మంచిగా జరుగుతుంది.

ఇటువంటి సందర్భంలోనే మైదానప్రాంత ప్రజలకు, గిరిపుత్రులకూ మధ్యగల తేడా ఏమిటో నవల చదువుతున్న పాఠకులకు స్పష్టంగా తెలుస్తుంది. తల్లిదండ్రులులేని పుయు కొడుకు బారసాల కార్యక్రమాన్ని మణి అపాయు, మిటిం రెండు గ్రామాల ప్రజలు ఎంతో వేడుకగా నిర్వహిస్తారు.

పుయుకు కొడుకుపుట్టిన తరువాత కొడుకుతోడిదే లోకమవుతుంది. సరైన పోషణలేక తాను శారీరకంగా చిక్కిపోతుంది. దివుడు సావోత శారీరకంగా బలహీనురాలైన పూయుకు దూర దూరంగా మసులుతూ, ప్రతి చిన్న విషయానికీ ఆవిడమీద అసహనం వ్యక్తం చేస్తుంటాడు. కల్లుతాగడం, ఆడవాళ్ళ వెంట పడడం చేస్తుంటాడు. అసలే శారీరకంగా చివికిపోతున్న పుయు భర్త ఈ ప్రవర్తనతో మానసికంగా కూడా మరింత కుంగిపోతుంది.

పుయు ఆడపడుచు పుబులి తండ్రి సరబు సావోతా బ్రతికుండగా బందికార గ్రామ సావోతా హికాకో హర్గుణతో పెండ్లి సంబంధం కుదురుతుంది. అయితే, వాళ్ల పెండ్లి కాక ముందే హర్గుణ తల్లిదండ్రులు విషజ్వరాలతో మరణించడంతో పెండ్లి వాయిదా పడిపోతుంది. కాలక్రమంలో తనదంటూ ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న పుబులి హర్గుణను కాదని పుయు గ్రామయువకుడైన బేసుకోదును ఇష్టపడి అతనితో వెళ్ళిపోతుంది. మనసుకు నచ్చిన మనిషితోటి మనువు స్త్రీ మనసుకూ సంతోషాన్ని పంచుతుందన్న ఒక ప్రాకృతిక సత్యాన్ని తనకు తెలియకుండానే అనుసరించిన పుబులి తనకు నచ్చిన బేసుకోదుతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టుకుంటుంది. ఈ విషయమంతా పుయుకి తెలిసే జరిగిందన్న అపోహకులోనైన దివుడు ఆవిడను తన మాటలతో, చేష్టలతో మానసికంగా మరింత వేధిస్తాడు. వీటన్నింటికి తోడు పుయు జబ్బుపడి మరణం అంచులదాకా వెళ్ళొస్తుంది.

కొన్నాళ్ళపాటు కొండల కింద మైదానప్రాంతంలో వుండి ముసలి తల్లి ప్రోద్బలంతో పెండ్లి చేస్కోవడం కోసమే తిరిగి అడవికొచ్చిన పియుటి అనే యువతి ఆకర్షణలో పడిపోయిన దివుడు సావోతా చివరికి ఆవిడను పెండ్లి చేసుకుని ఇంటికే తీసుకొస్తాడు. భర్తచేసిన పనిని ఏమాత్రం ఆమోదించలేకపోయిన పుయు భర్తనుండి విడివడి కొడుకుచుట్టూ తన బ్రతుకు చిత్రాన్ని గీసుకుని స్వతంత్రంగా

బ్రతకాలనే నిర్ణయం తీసుకుంటుంది. ఆవిధంగా పుయుపాత్ర మనిషికి సమస్యలు ఎదురైనప్పుడు వాటికి భయపడి, తీవ్రమైన నిర్ణయాలకు తలపడి పుసురులు పోగొట్టుకోకుండా పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కుంటూ తమకాళ్ళ మీద తాము నిలబడాలనే సందేశాన్నిస్తుంది. ఈ విధంగా వదినా మరదలైన పుయు, పుబులి పాత్రల ద్వారా కోదుస్త్రీల స్వతంత్ర్య వ్యక్తిత్వాన్ని మనకండ్లముందు సాక్షాత్కరింప జేస్తుందీ నవల.

నవలలో మరొక దుంబుజాతి అభాగినీ సోనాదేయి. భర్త నపుంసకుడు. మామ బారికి ముసిలోడు వాళ్ళకు వండి పెట్టుకుంటూ రోజులు వెళ్ళదీస్తుంటుంది. ఊళ్లోవుండే మొగవాళ్ళు చాలామంది అంటరానిది అయినప్పటికీ అవకాశం దొరికితే సోనాదేయి ఆడతనాన్ని కబళించాలను చూస్తుంటారు. తండ్రీ కొడుకులైన లెంజు, దివుడులు కూడా ఆవిడకోసం వెంపర్లాడుతూ ఆవిడ ఇంటిచుట్టూ తిరుగుతుంటారు. తన మనసులో వాళ్ళ పట్ల అసహనం వెల్లువలా తన్నుకొస్తున్నా తన వాస్తవపరిస్థితిని స్మరణకు తెచ్చుకుంటూ భూమాతలా ఓర్చుకుంటుంది. రకరకాలుగా తనలో తను నలిగిపోతుంటుంది.

మణి అపాయు గ్రామంలో ఇంకా దేవుడు వంటి మీదికొచ్చే వృద్ధ బేజుణి, నక్షత్రాలను గమనిస్తూ భవిష్యవాణిని వివరించే సిద్ధాంతి లేదా డిసారి, పురోహితుడు, ముసలి వైద్యుడులాంటి పాత్రలే కాకుండా సరబు సావోతా పెంచిన పెంపుడు కుక్క దస్రూలు కూడా వుంటాయి.

వీరుకాక పల్లం ప్రాంతంనుండి పంటకాలానికి ముందే కొండల మీదికొచ్చి నిలువు మీదనే అలవలు సలవులుగా పంటలకు ధరనిర్ధారణ చేసి బయానాలిచ్చి మోసం చేసే దళారీ వ్యాపారులు, అడవికొట్టి పోడు వ్యవసాయం చేసే అమాయక గిరిజనులను బేదిరించి, దేవుడిపేరు చెప్పి మామూల్లూ వసూలు చేసుకుపోయే ఫారెస్ట్ సిబ్బంది, సంతలు, సంతల్లో జరిగే వింతలు. పల్లపు ప్రాంతాల వ్యాపారులు, వాళ్ళుచేసే మోసాలు. పోలీసు వాళ్ళ సెటిల్మెంట్లు. యుక్తవయస్కులైన కోదు యువతీ, యువకులు పువ్వు, తుమ్మెదలమాదిరి ఒకరినొకరు ఆకర్షించుకోడానికి చేసే రకరకాల విన్యాసాలు నవల అంతటా పర్చుకుని

చదువుతున్న పాఠకుణ్ణి ఒక సరికొత్త మార్మిక ప్రపంచంలోకి చెయ్యిపట్టి తీసుకుపోయి చూపిస్తుంటాయి. సంభ్రమాశ్చర్యాలకులోను చేస్తుంటాయి.

అమృతాన్ని సేవించినవారిని అమృతసంతానం అంటారు. మృతం లేని వారు. వారే దేవతలు. అయితే, ఇక్కడే మనమో విషయాన్ని కొంత లోతులకు వెళ్ళి పరిశీలించాలి.

అమృతాన్ని సంపాధించడానికి దేవదానవులు కలిసి ఉమ్మడిగా పాల కడలిని మథిస్తారు. ఉమ్మడిగా సంపాధించిన సొత్తును సమానంగా పంచుకోవాలన్నది ప్రాకృతిక న్యాయం. అయితే, దేవగణం అటువంటి ప్రాకృతిక న్యాయానికి తిలోదకాలిచ్చి తమలో తామే పంచుకు తాగి, ప్రయోజనాన్ని పొందుతారు. ఆ విధంగా దేవతలు ఒక వంచనతో అమృతసంతానం అయ్యారు.

కానీ, అడవిలో పుట్టి, అడవిలో పెరిగి, అడవిలోనే అంతరించిపోయే గిరిజనులు మాత్రం ఆ అమృతసంతానానికన్నా గొప్పవారు. ఎందుకంటే? వారంతా వుమ్మడి కష్టంతో వచ్చిన ఫలితాన్నీ పొట్టలోవున్న బిడ్డకు కూడా సమానంగా పంచియిస్తారు. అదీ వారు పాటించే ప్రాకృతిక ధర్మం. ఆ రకంగా చూసినప్పుడు అందరూ సాధారణంగా అమృతసంతానంగా చెప్పుకునే ఆ దేవగణంకన్నా, మన ఆదివాసీ సోదరులే నిజమైన అమృతసంతానంగా పేర్కొనవచ్చు. అమృతసంతానంగా పిలువబడే అర్హత వారికి మాత్రమే వుంది. ఈ నవలలోని ప్రతిసంఘటనా, ప్రతి అంశం ఆ విషయాన్ని మనకు చెప్పకనే చెబుతుంది. ఇంత గొప్ప నవలను అందించిన మూల రచయిత గోపీనాథ మహాంతి గారికి, తెలుగు అనువాదకులు పురిపండా అప్పలస్వామిగారికి తెలుగు పాఠకలోకం ఎంతైనా ఋణపడివుంటుంది.

24-3-2018

మానస చామర్తి

# వరప్రసాదంలా లభించింది

ఐ

**బె**జవాడ బెంజ్‌సర్కిల్ దగ్గర్లో, రోడ్డు మీదకే ఉండే అపార్ట్మెంట్‌లో, ఒక చిన్న ఫ్లాట్ మాది. వెనుక వైపు ఖాళీగా ఉండే ఐ.టి.ఐ కాలేజీ గ్రౌండులో పద్ధతి లేకుండా అల్లుకుపోయే పిచ్చి చెట్లూ, దూరంగా కనపడే గుణదల కొండా, ఆ కొండ మీద మిణుకుమిణుకుమనే దీపమూ, పాలిటెక్నిక్ కాలేజీ గుబురు చెట్ల మీంచీ సూర్యుడూ చంద్రుడూ ఆకాశం పైకి ఎగబాకుతూ వచ్చే దృశ్యమూ – ఇదే నేను చూసిన ప్రపంచమూ, ప్రకృతీ. ఊరెళుతూ వెళుతూ పక్కవాళ్ళకి తాళాలిచ్చి నీళ్ళు పోయించుకు కాపాడుకునే తులసీ, గులాబీ మొక్కలు తప్ప, ఆ ఎర్రటి కుండీల్లోని నాలుగు గుప్పిళ్ళ మట్టి తప్ప, బంకమన్నును బిగించిన అదృష్టరేఖలేవీ నా అరచేతుల్లో లేవు. అట్లాంటి ఈ ఖాళీ చేతుల్లోకి, పుష్యమాసపు చివరి దినాల ఎండని మోసుకొంటూ, అమృతసంతానం వరప్రసాదంలా వచ్చి పడింది.

విచ్చుకున్న అడవి పూల మత్తుగాలిని మోసుకొచ్చింది. అడవి దేశపు వాసనలు చుట్టూ గుమ్మరించింది. గుమ్మటాల్లాంటి కొండల మధ్యలో నిలబెట్టి, 'ఎదటి కొండల మీద ఎండ కెరటాల్లా..' తేలిపోవడం చూపెట్టింది. కోదు గుడియాలను ఒరుసుకుంటూ పరుగెట్టే కొండవాగు పక్కన కూర్చుండబెట్టి పిల్లంగోళ్ళు వినిపించింది. చెవుల్లో దుంగుడుంగా గుబగుబలాడించింది. మామిడి టెంకల గుజ్జు గుటక దాటించింది. ఇప్పసారా జోపింది. ' షాఠీ' లా తోక విసిరింది.

‘ఆకుపచ్చ తుప్పల మధ్య ఎగసిన ఎఱ్ఱపువ్వు లాంటి గాయం’ లా – అమృత సంతానం కొంత బాధనూ మిగిల్చింది. అనుమతి అడక్కుండా యథేచ్ఛగా నా ఊహాప్రపంచాన్ని పునర్నిర్మించుకుంటూ పోయింది.

## 2

**సా**హిత్యం లోకవృత్తాన్ని ప్రతిబింబించాలి అనే మాట, విమర్శకుల దగ్గర వినపడుతూంటుంది. ఆ మాట, ఏ కాలానికి తగ్గట్టు ఆ కాలంలో, రచయితలు, పాఠకుల అవసరాలను బట్టి రూపు మార్చుకోవడం రివాజయ్యాక, లోకం కాస్తా సమకాలీన సమాజమయ్యింది. దరిమిలా, మన రచనలు, వాటిలో మనం చూస్తున్న మనుషులు, వాతావరణమూ ఇవన్నీ ఇప్పటికే మనకు చిరపరిచితాలైన వాతావరణాన్ని పాత్రలను అంటిపెట్టుకుని మసలడమూ మొదలైంది.

ఎప్పుడైతే ఇవి అందరికీ తెలిసిన పాత్రలే అన్న భావన స్థిరపడిపోయిందో, ఆ పాత్రలను బలమైన నేపథ్యంతోనూ, తమదైన ఒక గొంతుకతోనూ, ప్రభావంతోనూ కథలోకి నడిపించుకు రావలసిన అవసరమూ తగ్గిపోయింది. ఎక్కువ మంది రచయితలకు, ఈ పాత్రల ద్వారా చెప్పించాల్సిన కథే ముఖ్యమై పోయింది, పాత్రల కథ – వాటి ప్రాముఖ్యత వెనక్కి నెట్టబడ్డాయి. ‘కథలో పాత్రలు’ కాకుండా, ‘పాత్రల ద్వారా కథ’ చెప్పడమన్న పద్ధతి ఊపందుకున్నాక, రచనను నాయికా నాయికల చుట్టూ తిప్పుకురావడమూ, వాటికి ఉదాత్తతను, వీరత్వాన్నీ ఆపాదించి ఒక మెట్టెక్కించి నిలబెట్టడమూ, ఒక సరళరేఖలో వారి జీవిత గమ్యాన్ని నిర్దేశించుకుంటూ పోయి, మైలు రాళ్ళను ముందే నిలబెట్టుకుని చుక్కలను కలుపుకుపోవడమూ కూడా తప్పనిసరైపోయింది.

కాబట్టే, ఇప్పుడు మనం చదువుతున్న చాలా కథల్లో వర్ణనలంటే సందర్భ వివరణలే తప్ప ఆయా లోకపు వర్ణనలూ, మనుష్యుల వర్ణనలూ, విశేషాలూ కావు. ప్రత్యేకించి నవలలను పాపులర్ రచనలుగా ఇంటింటికీ చేర్చాక, సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యేలా చెయ్యాల్సిన అవసరానికి లోబడి, తెలుగు నవలలలో ఒక తరం రచయితలు, తమదైన పద్ధతినీ, శైలినీ నవలా రచనలో ప్రతిక్షేపించుకుంటూ పోయాక, అమృతసంతానం లాంటి ఒక నవల చదివినప్పుడు,

మనం పాఠకులుగా ఎలాంటి కల్పనా చాతుర్యానికీ, రచనా ప్రపంచానికీ, ఊహాశక్తికీ దూరమయ్యామో తెలుస్తుంది.

అందుకే అమృతసంతానంలో పాత్రల చిత్రీకరణను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రచయిత అవసరానికి మెరిసి వెళ్ళిపోయే పాత్రలు కావవి. చదువుతూండగానే మన కళ్ళకు కట్టే పాత్రలు.

ఇందులో ఉన్న ఎన్నో పాత్రల్లో బెజుణిదీ ఒక పాత్ర. సర్వస్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న ఈ పాత్ర, కథలో ఎలా ప్రవేశపెట్టబడిందో చూడండి : ఎన్ని వివరాలతో – వ్యక్తిగతంగానూ, కోదు జాతిలోనూ, – ఈ పాత్ర ఉనికిని, ఆనుపానులను సవివరంగా రచయిత చెక్కుకుపోయిన తీరును చూడండి. ఈ స్ఫుటమైన వర్ణనలే, ఆ లోకానికి మనం బొత్తిగా అపరిచితులమన్న లోలోపలి సంశయాన్ని, బెరుకును మెలమెల్లగా కరిగించుకుంటూ పోతాయి.

> బెజుణి ఇల్లు వచ్చింది. ఊరి చివర ఒంటరి కొంప. చుట్టూ కిత్తలి తుప్పల పెండె. లోపల గడ్డీగాదా అడివి. దాని మధ్య ఒక పాడుపంచ. అందులోనే ముసిలి బెజుణి కాపురం. ఎవ్వరూ లేరామెకి. కోదు సమాజంలో ఒక విశిష్ట స్థానముంది బెజుణికి. ఎప్పుడు కావాలంటే అప్పుడు దేవత పూనుతుందామెకి. ఏ దేవతని పిలిస్తే ఆ దేవత ఆవేశిస్తుంది. ఆమె గౌర్రాలు. చచ్చినవాళ్ళకి బతికినవాళ్ళకి మధ్య ఒక నిచ్చెనలాంటిదామె.
>
> బెజుణి అంటే జనానికి నచ్చేది కాదు. అందవికారంగా ఉండేదామె. ఆమె గోళ్ళు డేగగోళ్ళలా వంకరగా ఉండేవి. నోట్లో రెండే రెండు పళ్ళున్నాయి. రెండూ పొగచూరిన పసుపురంగుతో ఉండేవి. కళ్ళు రెండూ పొగచూరినట్టుండేవి. ఒంటి మీద చర్మం వేలాడుతూ ఉండేది. అందరూ ఆమెను చూసి భయపడేవాళ్ళు. ఎముకలు అవుపిస్తూన్న గుండె మీద రకరకాల గాజుపూసల పేర్లూ, గుత్తుగుత్తులు తావేజులూ, వేళ్ళముక్కలూ వేలాడుతూ ఉండేవి. అసాధ్యమైంది సాధించేదామె. అగ్గిలో నడిచేది. ముళ్ళ మీద కూచునేది. దేవతల వాహనం ఆమె: బెజుణి.

రెండవది, ఈ వర్ణనల్లోని పచ్చిదనం : అది రోమాలు నిక్కబొడుకునేలా చేస్తుంది. నిటారుగా కూర్చోబెట్టి పుస్తకం చదివిస్తుంది. మొదటి పేజీల్లోనే మనకెదురయే పియు, నెలలు నిండాక అడవిలో ఒంటరిగా ఆమె పడ్డ క్షోభ, రచయిత మాటల్లోనే..ఇలా –

'తుఫానులాగ తెరలుతెరలుగా వస్తున్నాయి నొప్పులు. ఒంటి మీద కెరటాలు విరిచిపోయేవి. పుయు అరిచేది. ఏడ్చేది. లోకం మరచి పోయేది, బైట ఎండ ఉజ్జ్వలంగా ఉంది. ప్రకృతి విచ్చలవిడిగా ఉంది. అన్నీ మరచిపోయింది పుయు. ఒంట్లో ఏదో భయంకరమైన విప్లవం రేగుతున్నట్టుంది. ఏదో తెంపుకున్నట్టుంది. లాక్కుంటున్నట్టుంది. పీక్కునట్లు పెనుగులాడుతున్నట్లు ఉంది. అంతా రణ చీకటి. దుఃఖం. మద్దిచెట్టు రెండు చేతులతోనూ బిగించి పట్టుకునేది పియు. చెట్టు బెరడు పళ్ళతో కరచిపట్టేది. అమ్మవారు పూనట్టు వొంటికి ఎక్కడలేని సత్తువా వచ్చేది. నులుచుకునేది.

ఎంతసేపలా గడచిందో తెలీదామెకి. హఠాత్తుగా తుఫాను ఆగిపోయినట్టు అనిపించింది. కళ్ళ ముందు చీకటి తొలగిపోయింది. దిమ్మెత్తిపోయిన చెవులకి ఏదో కొత్తజంతువు అరచినట్టు వినిపించింది. ఆమె వినడం కోసమే ఎవరో గూబలు పగిలిపోయినట్టు అరుస్తున్నారు. పుయు నివ్వెర పోయి చూసింది. ఎర్రటి చిన్నమనిషి కిందపడి అరుస్తున్నాడు. పుయు తెలువుకుంది. చేరడేసి కళ్ళు చేసుకు చూసిందామె. ఇది తన బిడ్డా? ఇదేనా ఇంతకాలమూ తన దేహంలో దాగుడుమూతలాడుతూ ఉంది? బలం లేని చేతులతో ఒక దారైన రాతిముక్క తీసిందామె. దాంతో కొడుకు బొడ్డు కోసింది.

చివ్వుమని లోపల నొప్పి లేచే వర్ణన – 'అమృతసంతానం' నేలను పడే వేళ. అమృతసంతానం చదవగానే గుర్తింపుకొచ్చేది, అందులోని భాష అనీ, కవిత్వమనీ, ఈ పుస్తకం ఇప్పటికే చదివిన మిత్రులు కొందరు నాతో చెప్పినప్పుడు, నేనా కవిత్వం దగ్గరే ఆగిపోతాననుకున్నాను. 'పుష్య మాసపు చివరి దినాల ఎండ' నన్ను పట్టి నిలబెట్టడమూ అబద్ధం కాదు. అయితే, నన్నాపినవి, నవలలో ఒక గొప్ప వచనం చదివిన తృప్తీ, సంతోషమే తప్ప కవిత్వం కళ్ళకు అడ్డుపడటం

కాదు. అది ఈ రచన విలువను పెంచేదే తప్ప, పాఠకులను పక్కదారి పట్టించేది కాదు. ఈ మాటలు రాస్తూ రాస్తూ నేను ఇది పురిపండా వారు చేసిన అనువాదమనీ మరొక్కసారి నాకు నేనే గుర్తు చేసుకుంటున్నాను. ఇట్లాంటి అనువాదం అరుదే కాదు, అసంభవం కూడా. ఇంత తేనెలొలికే తెలుగూ, తూచి వేసినట్లే పడ్డ మాటలూ, వాక్య నిర్మాణమూ, ఈ పుస్తకాన్ని భారతీయ సాహిత్యంలోనే పైవరుసలో కూర్చుండబెడతాయి.

ఒక సవిస్తారమైన ప్రపంచం! వలయాలు వలయాలుగా – లౌకికంగా మనమనుభవించినట్లే – శకలాలుగా, ఇక్కడా – మరొకచోట కూడా, కనపడని ముడులతో, ఇప్పటికింకా ముడిపడని మనుష్యుల మధ్య, పోగులుపోగులుగా అల్లుకుపోయే సాంసారిక బంధాలను సవిస్తరంగా చూపెట్టడానికి నవలకున్న పరిధే సరైనది.

అమృతసంతానం ఒక నాయకి కథ కాదు. ఒక జాతి కథ. ఒరిస్సా కొండ ప్రాంతాల్లో జీవించే కోదుల బ్రతుకు కథ. అక్కడి సంస్కృతిని పరిచయం చేసిన కథ. అందుకే, ఒక 'సాఔతా' సరబులా, ఒక 'డిసారి'లా, ఒక 'బెజుణి' లా, పియు లా, లెంజులా, పియోటి లా, హాకినాలా, ఈ కథలో కొండలూ, వాగులూ, డప్పులూ కూడా మనకు స్పష్టంగా పరిచయమవుతాయి. ఆ దారులు అస్పష్ట రేఖలు కావు. ఎక్కడ అడుగు తీసి అడుగేయాలో విస్పష్టంగా చూపెట్టిన కథనమిది.

అయితే, ఇది  విశ్వసనీయత కోసమో, పఠనీయత కోసమో మాత్రమే చెప్పుకోవలసిన వివరం కాదు. ఒక సర్వస్వతంత్ర ప్రపంచాన్ని పాఠకుడి చేతుల్లో పెట్టేప్పుడు, సమర్థుడూ, సహృదయుడూ అయిన రచయిత పడే కష్టమిదంతా. మరోలా చెప్పాలంటే, ఒక మంచి రచయితకు, మంచి పాఠకుడి మీద ఉండే అవ్యాజమైన ప్రేమ మాత్రమే ఇలాంటి రచనలా బయటకు రాగలదు.

ఒక కథగా చెప్పాలంటే, అమృతసంతానం చిన్నదే. కానీ పరికించి చూసినవాళ్ళకి, జీవితమంత పెద్దది. బహుముఖీయమైనది. తప్పొప్పులకు అతీతంగా, జీవితం ఎలా సాగగలదో, అదే చూపిస్తుందీ పుస్తకం. కొండల మీద పారాడి పారిపోయే వెలుగు నీడల్లాగే, జీవితమూ ఎప్పుడూ ఒక రంగు పులుముకుని

కూర్చునేది కాదని చెప్తుంది. కోదు జీవన నేపథ్యంలో ఈ కథను చెప్పడం, ఎత్తైన కొండల మీదా, ఆ లోయల్లోనూ అప్పుడప్పుడే నాగరికత పొటమరిస్తోన్న వాతావరణాన్ని చూపించడం, ఈ కథను మరింత ప్రత్యేకం చేశాయి. ప్రత్యేకించి ప్రకృతి వర్ణనల్లోని కవితాత్మకత, వాటిలోని నవ్యత (ఈనాటికీ..), ఆ వర్ణనల లోతూ, విస్తృతీ, ఈ పుస్తక పఠనానుభవాన్ని తనివి తీరని అనుభవంగా మిగులుస్తాయి.

మానవసంబంధాలు ఎన్ని ముళ్ళు పడి ఉన్నాయో, అన్ని ముళ్ళనూ విప్పే ప్రయత్నం, కాదంటే కనీసం తాకే ప్రయత్నం చేసి వదిలింది. ప్రత్యేకించి శారీరక సంబంధాల విషయంలో మనిషికి స్వాభావికమైన ఆశనూ, ఆకలినీ అంతే గాఢంగా, పదునైన పదాల్లో చూపెట్టింది.

> వెర్రెత్తిస్తోంది పియోటి. అభాసంతోనూ, ఇంగితంతోనూ దివుడు సాహొతా గుండె మీద సమ్మెటపడేది. ఆమె ఒళ్ళు కొంచం ఒంపు చేసేది, దివుడు మొహం మీద వేడిగాడ్పు కొట్టి, మొహం ఆర్చుకు పోయేది. ఆమె రవంత పక్కకి జరిగేది. ఇరవై మూళ్ళ దూరాన ఉండికూడా కోణం లెక్కప్రకారం అతడిమెడ అంతే జరిగేది

ఇదీ అతని లెక్క! ఇట్లాంటి మాటల గారడీతో మన మెడలనూ వంచి చదివించే నేర్పుతో, లెక్కతప్పని నిపుణతతో, ఇంత పకడ్బందీగానే ఏ సన్నివేశాన్నైనా రాసుకుపోయాడు.

అది ఫారెస్టాఫీసర్ల దాష్టీకం కావచ్చు, లెంజుకోదు నిస్సహాయత కావచ్చు, మన్యం జ్వరాల గురించి కావచ్చు, లొడబిడలాడుతూ ఆ శుభ్ర స్వచ్ఛలోకంలోకి చొచ్చుకొచ్చిన షావుకార్ల గురించి కావచ్చు– ఒక కథైనా, నవలైనా చదివేప్పుడు మనం ఎట్లాంటి నిజాయితీని ఆశిస్తామో, అదంతా ఈ రచనలో దొరుకుతుంది. ప్రత్యేకించి ఆ కొండజాతి వాళ్ళు తమ అమాయకత్వం వల్లా, అసహాయత వల్లా, అన్ని రకాలుగానూ దోపిడీకి గురవడాన్ని గురించి చదివినప్పుడు, మనకు నమ్మకంగా తెలుస్తుంది, ఇలాంటి ఒక రచన చెయ్యడానికి నైపుణ్యమొక్కటే కాదు, గుండెలో ఆర్ద్రత కూడా ఉండాలి. కళ్ళలోనూ కలంలోనూ కొంత కన్నీరుండాలి. పోతే, ఇన్ని పాత్రల గురించీ, ఇంత చెప్పీ, రచయిత ఎక్కడా ఏ

పాత్ర తరఫునా వకాల్తా పుచ్చుకోవడం కనపడదు. ఎంచి ఒకరికి అండగా నిలబడి ముందుకు నెట్టడమూ ఉండదు.

రచయిత నిలబెట్టుకున్న ఈ ఎడం, మనలని వాళ్ళకి దగ్గర చేస్తుంది. మనకి మనంగా వాళ్ళని హత్తుకునేట్లు చేస్తుంది.

పుయునే గమనించండి.

ఎంత సంఘర్షణనో అనుభవించిన మనసు పుయుది. ఆమె తన స్వహస్తాలతో బొడ్డు కోసిన అమృతసంతానం ఊసుతో కథ మొదలవుతుంది. అది మొదలు. మనస్సులో అగ్గి మండుతోన్నా, ఒళ్ళో పిల్లాణ్ణి చూసుకుంటే కళ్ళు ధారలు కట్టే వేదనలోకి వెళ్తుంది, ఆఖరు పేజీల వద్దకొచ్చే సరికి. 'ఎవళ్ళు వాణ్ణి నా అని ఆదుకుని పైటకొంగు కప్పుతారు?' అనుకుంటే దేవుడు గుర్తొస్తాడామెకి. మన గుండె చెరువైపోతుంది. వెక్కి వెక్కి ఏడుస్తూ ఆకాశం వైపుకి మొహమెత్తుకుంటుంది.

అండగా ఉండే వాళ్ళు లేరని కాదు. అయినా, పుయు బుదరింపు మాటలన్నీ అంత దుఃఖంలోనూ పసిగడుతూనే వొచ్చింది. దేబిరింపుతనం తన ఛాయలకు రాకుండా జాగ్రత్తపడుతూనే వచ్చింది. ఆమె మనసులోకి ఇంకిందల్లా 'డిసారి' మాటే

> మూణ్ణాళ్ళ ముచ్చట మనిషి జన్మ. తరవాత మార్పు రానే వస్తుంది.
> ఈ రెన్నాళ్ళూ గడుపుకోడం సాధ్యం కాదా?"

ఆకాశం వైపు చూసింది కానీ, ఆశ వదులుకోలేదు పుయు. తనదైన బంధాన్ని, తనదే అయిన జీవితాన్ని, ఎవ్వరికీ అయాచితంగా ధారపొయ్యలేదు. ధీరనాయిక పుయు! ఎగసిన ఆత్మగౌరవ పతాక! సీతనీ, ఒకానొక కోణంలో శకుంతలనీ కూడా గుర్తుకుతెస్తుంది.

ముందుకు నడిచింది. కథనూ నడిపించింది.

చావు లేని కథ, జీవనంలో ఉన్న రుచి తెలిపిన కథ. 'అమృత సంతానం'.

# 3

**ఆ**శా? ఆకలా? ఆక్రమణా? జాలీ, మోసం, కల్లోలమా? అసహాయతా? నిబ్బరమా? యుద్ధ స్థైర్యమా? మీరు చెప్పండి! ఒక గొప్ప నవలలో మీరేం ఆశిస్తారో, ఏం ఊహిస్తారో! అవన్నీ అంతకు పదింతలుగా దొరికే పుస్తకమిదేనేమో చదివి సరిచూసుకోండి. జటాజూటంలో ఉన్నంతసేపూ విశ్వరూపం చూపని గంగలా, భగీరథ ప్రయత్నం లేనిదే ఎవరికీ అందుబాటులోకి రాని గంగలా, ఈ ఆరువందల పేజీల పుస్తకం రెండు అట్టల మధ్యా చిక్కుబడి ఉన్నంతకాలమూ మనకిది అర్థం కాదు. భగీరథప్రయత్నం ఎవరికివారే చేసుకోవాలి. తరాలు, మారే కాలాలు, వాటి క్రీనీడలూ, మానవ సంబంధాలూ, మహోద్వేగాలూ..రచనా విశ్వరూపాన్ని చూడటానికి సంసిద్ధులై ఈ పుస్తకాన్ని అందుకోండి.

28-3-2018

# గోపీనాథ మొహాంతి

గోపీనాథ మొహాంతి (1914–1991) ఒడిశాలోని కటక్ జిల్లాలో నాగబలి గ్రామంలో జన్మించారు. ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్మే చేసారు. 1938 నుంచి 1969 దాకా ఒడిశా రాష్ట్రప్రభుత్వ పాలనాసర్వీసులో పనిచేసారు. తన ఉద్యోగ జీవితపు తొలిరోజుల్లో కోరాపుట్ జిల్లాలో మొదటిసారిగా గిరిజనుల స్థితిగతుల్ని దగ్గరగా చూసారు. ఆ అనుభవాలతో మొత్తం నాలుగు నవలలు 'దాదీ బుధా' (1944)', 'అపహంచ' (1961), 'పరజా' (1945), 'అమృత సంతానం' (1947) గిరిజనుల మీద రాసారు.

55 సంవత్సరాల పాటు సాగిన సుదీర్ఘ సాహిత్యకృషిలో భాగంగా ఆయన 24 నవలలు, 300 కథల్తో 12 సంపుటాలు, ఒక కవితా సంపుటి, రెండు జీవిత చరిత్రలు, మూడు నాటకాలు, రెండు వ్యాససంపుటులు, గిరిజన సంస్కృతి పైన ఐదు పుస్తకాలు వెలువరించారు. టాల్ స్టాయి, గోర్కీ, టాగోర్ లను ఒడియాలోకి అనువదించారు. ఒడియా మహాకవి సరళాదాస్ రచించిన మహాభారతం పరిశోధనతో పాటు తన ఆత్మకథ కూడా వెలువరించారు.

పదవీ విరమణ తర్వాత అమెరికాలో కాలిఫోర్నియాలో సాన్‌జోస్ విశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యులుగా పనిచేసారు.

ఆయన రచనల్లో అమృత సంతానం ద్వారా ఒడియాసాహిత్యానికి మొదటి సాహిత్య అకాదెమీ పురస్కారం లభించింది. ఒడియా మైదానప్రాంతాల సామాజిక జీవితాన్ని ఐతిహాసిక స్థాయిలో చిత్రించిన 'మటిమటాల' నవలకు గాను 1974 లో జ్ఞానపీఠ పురస్కారం లభించింది. గోర్కీని అనువదించినందుకుగాను సోవియెట్ లాండ్ నెహ్రూ పురస్కారం పొందారు. భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్'తో సత్కరించింది.

మరిన్ని వివరాలకు gopinathmohanty.in చూడవచ్చు.

# అప్పలస్వామి పురిపండా

కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామి (1904–1982) విజయనగరం జిల్లా సాలూరులో జన్మించారు. కవి, పండితుడు, అనువాదకుడు. ఆయన రచనల్లో ముఖ్యమైనవి 'పంచమ విలాసము' (పద్యకావ్యం,1925), 'విస్మయము' (గేయ కావ్యం,1928), 'రాట్నపతాకము' (పద్యకావ్యం, 1921), 'ఆదర్శ జీవనము', 'ఆంధ్రమహాభారతము' (1953–55) 'ఉత్కలపతనము' (నాటకం,1926), 'వీరభారతం' (1857 భారతీయ స్వాతంత్ర్య సమరం), 'పులిపంజా', 'మహమ్మదు చరిత్ర', 'హరియా పాటలు', 'విశ్వకథావీథి' (1954), 'పిల్లలకథాసాగరం', 'జగద్గురు శంకరాచార్య', 'హంగేరి విప్లవం', 'సంగ్రహ భారతం', 'సౌదామిని' (ఇంగ్లీషు, 1950) మొదలైనవి.

ప్రముఖ కవిపండితులు. కవితాసమితి కార్యదర్శిగా, నవ్యసాహిత్య వ్యాపకానికి, వ్యావహారిక భాషోద్యమానికి చాలా తోడ్పడ్డారు. బెంగాలీ, ఒరియా, హిందీ భాషలలో పండితులు. సంప్రదాయం పట్ల గౌరవం గల కవి. భావకవిత్వోద్యమం నుంచి అభ్యుదయ కవిత్వంలోకి, అధివాస్తవిక కవితకూ దారితీసినవారిలో ఒకరు. జాతీయవాది. దేశభక్తి ప్రేరేపకంగా రచనలు చేసారు. సాంఘిక దురన్యాయాలపై పంజా విప్పిన కవి. గ్రంథాలయోద్యమానికి గొప్ప సేవచేసారు.

ఆంధ్రసాహిత్య చరిత్రను ఒరియా భాషలో రాసారు. ఒరియా భాషనుంచి తెలుగులోకి అనువదించిన పకీర్ మోహన్ సేనాపతి 'ఛామాణొ ఆఠొగుంఠొ', కాళింది చరణ పాణిగ్రాహి 'మట్టిమనుషులు' తో పాటు 'అమృతసంతానం' సుప్రసిద్ధాలు. వీరి రచనలు కొన్నింటికి శ్రీ శ్రీ ఇంగ్లీషు అనువాదాలు 'సౌదామిని' పేరిట ప్రచురితమయ్యాయి. వీరి 'పులిపంజా' కవిత్వం లండన్ విదేశాంధ్ర ప్రచురణల వారు కవి చేత స్వయంగా పాడించి రికార్డు చేయించారు.

# రచయితల గురించి

**సూరపరాజు రాధాకృష్ణమూర్తి :** జననం 1935 లో ప్రకాశం జిల్లా కందుకూరులో. ఇంగ్లీషు ఉపన్యాసకులుగా కడప, ఆదిలాబాదు, హైదరాబాదుల్లో పనిచేసి, పదవీ విరమణ తరువాత, ప్రస్తుతం హైదరాబాదులో నివసిస్తున్నారు. 'అగ్నిమీళే' కవితాసంపుటి, 'సృష్టి: పి.రామకృష్ణ కథలు, కవితలు:ఒక పరామర్శ' లతో పాటు శ్రీ మద్భగవద్గీత శంకర భాష్యాన్ని తెలుగు చేసారు. ఈశ, కేన, కఠ, మాండూక్య ఉపనిషత్తులపైన వ్యాఖ్యానం రాసారు. 'శ్రీ గురుచరిత్ర', 'సాయిసుధ' ఇతర రచనలు. ఇటీవల ఫేస్ బుక్ మాధ్యమం ద్వారా 'టి.ఎస్. ఇలియట్ వేస్ట్ లాండ్ మరి నాలుగు కవితల' పైన సవివరమైన పరిచయవ్యాసాలు వెలువరించారు. ప్రస్తుతం జ్ఞానదేవుని 'అనుభవామృతం' ను అనుసృజిస్తున్నారు. వివిధ సాహిత్య, వేదాంత విషయాలపైన వారి రచనలతో ప్రస్తుతం SRK Moorthy పేరిట ఫేస్ బుక్ లో ఒక బ్లాగ్ పేజి నిర్వహిస్తున్నారు. సమకాలిక తెలుగు సాహిత్యంలో ప్రాక్పశ్చిమాల కలబోత, సంప్రదాయానికీ, ఆధునిక జీవితానికీ మధ్య అపురూపమైన అవగాహనా సేతువు.

**న్యాయపతి శ్రీనివాసరావు:** పుట్టింది ప్రస్తుతం ఒరిస్సా రాష్ట్రంలోని గుణుపురంలో. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్సులో పట్టభద్రులు. డి.ఆర్.డి.ఓ, హ్యూలెట్ పకార్డ్, ఐ.బి.ఎం వంటి సంస్థల్లో పనిచేసారు. ప్రస్తుతం బెంగలూరులో టాటా కన్సల్టన్సీ సర్వీసెస్ లో టెక్నికల్ ఆర్కిటెక్ట్ గా పనిచేస్తున్నారు. 'కాసేపు' కవితా సంపుటి వెలువరించారు. భావుకులు, సున్నిత హృదయులు, ఆధునిక తెలుగు కవిత్వాన్ని గాఢంగా అధ్యయనం చేస్తూవస్తున్న చింతనాశీలి.

**శ్రుతకీర్తి:** పుట్టింది కరీంనగర్ లో. ఉస్మానియా విశ్వవిద్యాలయంనుంచి రసాయన శాస్త్రంలో ఎమ్మెస్సీ చేసారు. గొప్ప సాహిత్య తృష్ణ, సునిశిత సాహిత్యానుశీలన, అనితరసాధ్యమైన అధ్యయనం ఆమె సొంతం.

**నరుకుర్తి శ్రీధర్**: పుట్టింది 1970లో రఘుదేవపురంలో. హైదరాబాదులో జవహర్ లాల్ టెక్నాజికల్ విశ్వవిద్యాలయం లో మెకానికల్ ఇంజనీరింగ్ చదువుకున్నారు. బొకారో స్టీల్ ప్లాంట్ లో అసిస్టెంట్ మానేజరుగా పనిచేసారు. ప్రస్తుతం విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ లో అసిస్టెంట్ జనరల్ మానేజరు–ఐ.టి గా పనిచేస్తున్నారు. ఫొటోగ్రఫీ, పర్వతారోహణలతో పాటు సాహిత్యమంటే గొప్ప అభిమానం. సుకుమారమైన సౌందర్యాభివ్యక్తి, స్పష్టమైన అభిప్రాయాల కలనేత.

**సుశీలా నాగరాజ:** పుట్టింది 1948 లో చిత్తూరు జిల్లా పుంగనూరులో. మాతృభాష కన్నడము. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మే తో పాటు ఉపాధ్యాయ శిక్షణ కోర్సు కూడా పూర్తి చేసి ఉపాధ్యాయులుగా పనిచేసారు. పదవీ విరమణ అనంతరం బెంగలూరులో ఉంటున్నారు. సంగీతం, ఇంగ్లీషు సినిమాలు, యాత్రలు ఇష్టం. గొప్ప భావుకులు. సున్నితమైన భావనాశీలి. మానవతా వాది.

**నౌదూరి మూర్తి:** పుట్టింది 1950 లో. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి అప్లైడ్ గణితశాస్త్రంలో పట్టభద్రులు. ఇంగ్లీషు సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసారు. అమెరికాలోని హౌస్టన్ విశ్వవిద్యాలయంలో కూడా ఇంగ్లీషు సాహిత్యం అభ్యసించారు. భారతప్రభుత్వానికి చెందిన నేషనల్ సాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ లో ముప్పై ఏళ్ళకు పైగా పనిచేసి పదవీ విరమణ అనంతరం ప్రస్తుతం బెంగలూరులో జి.ఎం.ఆర్ గ్రూపులో పనిచేస్తున్నారు. కథలు, కవితలు, నాటకాలు రచించారు. విస్తృతంగా అనువాదాలు వెలువరిస్తూ ఉన్నారు. తెలుగు కవుల కవితలను ఇంగ్లీషులోకి అనువదించి Wakes on the Horizon (2016) పేరిట ప్రచురించడంతో పాటు, ప్రపంచసాహిత్యంలో పేరెన్నికగన్న 1650 మేలిమి కవితలను తెలుగులోకి అనువదించి teluguanuvaadaalu.wordpress.com బ్లాగు ద్వారా పరిచయం చేసారు. వాటిల్లోంచి వంద కవితలను 'కవిత్వంతో ఏడడుగులు' పేరిట ఇటీవలే వెలువరించారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అసమాన ప్రావీణ్యం, విస్తృత సాహిత్యాధ్యయనం ఈయన ప్రత్యేకతలు.

**పద్మజ సూరపరాజు:** పుట్టింది 1962 లో హైదరాబాదులో. ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్మే,ఎంఫిల్ చేసారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన సాహిత్యసంస్కారం, సాహిత్యాభిలాష వల్ల నిరంతర సాహిత్య అధ్యయన శీలి.

**జయతి లోహితాక్షన్:** 1976 లో నిజామాబాద్ జిల్లా బోధన్ లో జన్మించారు. కొన్నాళ్ళు ఉపాధ్యాయులుగా పనిచేసారు. గత కొంతకాలంగా తన భర్త లోహితాక్షన్ తో కలిసి పూర్తికాలపు యాత్రీకురాలిగా, ప్రకృతి ఆరాధకురాలిగా జీవిస్తున్నారు. అడవి పట్లా, వనచరాల పట్లా, ఆదివాసులపట్లా అపారమైన ప్రేమ కలిగిన జయతి గొప్ప ప్రకృతి ఫొటోగ్రాఫర్ కూడా. తన వివిధ యాత్రానుభవాల్ని ఆమె గత కొంత కాలంగా ఫేస్‌బుక్ మాధ్యమం ద్వారా పంచుకుంటున్నారు.

**శిరంశెట్టి కాంతారావు:** పుట్టింది 1958 లో పూర్వపు నల్గొండ జిల్లాలోని ఫణిగిరిలో. న్యాయశాస్త్ర పట్టభద్రులు. నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, పాలొంచ శాఖలో ఉద్యోగం. ఇప్పటిదాకా నాలుగు కథాసంపుటాలు, ఒక హిందీ కథాసంపుటి, మూడు నవలలు వెలువరించారు. రెండు నవలలు త్వరలో రానున్నాయి. వివిధ పోటీల్లో కథారచనకు గాను ఇప్పటిదాకా యాభై దాకా బహుమతులు వరించాయి. అట్టడుగు వర్గాల వారి స్థితిగతుల్ని ఎంతో సన్నిహితంగా చూసి ఎంతో ఆర్ద్రతతో చిత్రించడం వీరి ప్రత్యేకత.

**మానస చామర్తి:** పుట్టింది విజయవాడలో. వెలగపూడి శ్రీరామకృష్ణ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలనుండి ఇంజనీరింగ్ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. కొంతకాలం పాటు హైదరాబాదులో సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పనిచేసిన తర్వాత ప్రస్తుతం బెంగలూరులో ఇన్ఫోసిస్ లో టెక్నాలజీ లీడ్ గా పనిచేస్తున్నారు. కర్ణాటక సంగీతం, ముఖ్యంగా వాద్యసంగీతమంటే ప్రాణం. కవితాపిపాసి. madhumanasam.in అనే బ్లాగు నిర్వహిస్తూన్నారు. అందులో వివిధ సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాల పైన సునిశితమైన పరిశీలనాత్మక వ్యాసాలు రాస్తున్నారు. ఈ వ్యాసం కూడా ఆ బ్లాగులోనుంచి గ్రహించిందే.

**వాడ్రేవు చినవీరభద్రుడు:** పుట్టింది 1962 లో తూర్పుగోదావరి జిల్లా మన్య ప్రాంతంలోని శరభవరం గ్రామంలో. ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి తత్త్వ శాస్త్రంలో ఎమ్మే చేసారు. గత ముప్పై ఏళ్ళకు పైగా గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాదులో సెంటర్ ఫర్ ఇన్నొవేషన్స్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్ లో సలహాదారుగా పనిచేస్తున్నారు. కవిత్వం, కథలు, సాహిత్యవిమర్శ, యాత్రాకథనాలతో పాటు గాంధీ, కలాం, కబీరు, కాంట్, బషో వంటి రచయితల, కవుల గ్రంథాలను కూడా తెలుగులోకి అనువదించారు.

# జీవనం సత్యం
# జీవనం సుందరం

## అమృతసంతానం నవలపైన ఆత్మీయస్పందన

ప్రసిద్ధ ఒడియారచయిత, జ్ఞానపీఠపురస్కార స్వీకర్త గోపీనాథ మొహాంతి ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో నివసిస్తున్న పురాతన గిరిజనతెగ కోదుల మీద రాసిన మహేతిహాసం 'అమృతసంతానం' నవలని సాహిత్య అకాదెమీ కోసం పురిపండా అప్పలస్వామి తెలుగుచేసారు. ఆ నవలని ఇటీవల కొందరు సాహిత్య మిత్రులు చదివి తమ స్పందనల్ని ఫేస్‌బుక్ మాధ్యమంగా మిత్రులతో పంచుకున్నారు. తొమ్మిదినెలల స్వల్ప వ్యవధిలో ఒక నవలపైన ఇన్ని వ్యాసాలు రావడం, అది కూడా ఒక అనువాదకృతి పైన రావడం, తెలుగు సాహిత్య చరిత్రలోనే మొదటిసారి అని చెప్పవచ్చు. ఈ నవలపట్ల ఆత్మీయంగా స్పందించిన వారిలో మూడు తరాలకు చెందిన సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు, సాహిత్యవిద్యార్థులు ఉన్నారు. ఆ ప్రాంతాల్లో గల అపారమైన ఖనిజ వనరులవల్ల అక్కడ జీవిస్తున్న ఆదివాసుల మనుగడనే ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో ఈ నవలకు విశేష ప్రాసంగికత ఏర్పడిందని మానవ శాస్త్రజ్ఞులు పేర్కొంటున్న తరుణంలో అమృతసంతానం నవలారచయితకు, అనువాద కర్తకు తెలుగుసాహిత్య ప్రపంచం సమర్పిస్తున్న నీరాజనం ఈ సంపుటం.